1993-2013 నడుస్తున్న చరిత్ర

సంపుటి : 2
సంచిక : 9
రు. 20/-లు
తెనాలి

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు

నవంబరు 2016

ఈ అక్టోబరు నెల ముగ్గురు తెలుగు భాషాసాహిత్య రంగాల యోధులను మనకు దూరం చేసింది.

**కోరాడ మహాదేవశాస్త్రి గారు** భాషా శాస్త్రజ్ఞుడు, పరిశోధకుడు, అధ్యాపకుడు.

**చిలుకూరి దేవపుత్ర గారు** తొలి తెలుగు దళిత నవలాకారుడు, ఉత్తమ కథారచయిత ఆదర్శాలతోనే బ్రతికిన ఉత్తమ మానవుడు.

**వెలుగు వెంకట సుబ్బారావు గారు** తెలుగు భాషోద్యమ సమాఖ్య పతాక గీత రచయిత. ఒకనాటి 'రుద్రజ్వాల'గా 'విరసం' పతాక గీతాన్ని రచించినవాడు. సాంస్కృతిక రంగంలో బహుముఖ ప్రజ్ఞావంతుడే కాదు, భాషోద్యమకారుడు కూడా. ఈ ముగ్గురికీ తెలుగుజాతి ఎంతైనా ఋణపడి వుంది.









ఈ అక్టోబరు 17న తిరుపతిలో ఘనంగా జరిగిన సభలో తాపీ ధర్మారావు పురస్కారాన్ని పాత్రికేయుడు, రచయిత ఆర్.ఎం.ఉమా మహేశ్వరరావు అందుకున్నారు. ఈ సభ సంస్కరణోద్యమాలకు స్ఫూర్తిగా నిలిచింది.



ఈ అక్టోబరు 15,16 లలో తిరుపతిలో జరిగిన భారతీయ భాషల సమ్మేళనం 'మాతృభాషల రక్షణ, అభివృద్ధితోనే భారతీయతను నిలుపుకోగలం' అని పిలుపునిచ్చింది

**మాతృభాషల రక్షణకై జాతీయవాదుల ఉద్యమం**

ఉత్తమ పాత్రికేయుడు, కథా రచయిత, సాహితీ విమర్శకుడు

# శ్రీ ఆర్.ఎం.ఉమామహేశ్వరరావుకు తాపీ ధర్మారావు పురస్కారం



అక్టోబరు 17న తిరుపతిలో జరిగిన తాపీ ధర్మారావు పురస్కార సభావేదిక.
ఎడమ నుంచి-సభాధ్యక్షుడు డా॥నాగసూరి వేణుగోపాల్, ఆత్మీయ అతిధులు తాపీ సుజాతాషా, డా॥పి.విజయలక్ష్మి పురస్కార స్వీకర్త ఆర్.ఎం.ఉమామహేశ్వరరావు, ముఖ్య అతిధి కాకరాల, అమ్మనుడి సంపాదకుడు డా॥సామల రమేష్‌బాబు, వక్త డా॥మధురాంతకం నరేంద్ర



సభలో పాల్గొన్న ప్రముఖులు




పురస్కారాన్ని అందజేస్తున్న దృశ్యం-కుడిపక్క చివర వున్నవారు కార్యక్రమాన్ని నిర్వహించిన రచయిత సాకం నాగరాజ










**నాట్య**శాస్త్రంలోని అమృతమథనం ఉదంతంలో అమృతం కోసం దేవదానవులు సముద్రాన్ని మథిస్తారు. సముద్ర గర్భం నుండి అన్ని సంపదలూ వెలికి వచ్చిన పిదప చివరిలో అమృతం పుట్టింది. ఆ అమృతాన్ని తాగి, దేవతలు అమరులైనారని కథ. ఇక్కడ అమృతం జ్ఞాన విజ్ఞానాలకు ప్రతీక. తన కాలానికి సమాజంలోవున్న జ్ఞాన విజ్ఞాన సంపదని తాము గ్రహించి, వాటి చైతన్యవికాసాలకు కృషి చేస్తూ సమాజ అభ్యుదయానికి కంకణం కట్టుకున్న కవులు, కళాకారులు, శాస్త్రవేత్తలు అమరులే. ఆ రకంగా తాపీ ధర్మారావు, ఉమామహేశ్వరరావు, సామల వంటి ఇంకెందరో...వారందరూ చిరంజీవులు, చిరస్మరణీయులు.

(తాపీ ధర్మారావు పురస్కార సభలో నాటక సినీ ప్రముఖులు **'కాకరాల'** ప్రసంగం)



మాతృభాషలలో సకల విద్యాసాధనములుండుట నాగరక రాష్ట్రముల (దేశముల) యొక్క మొదటి లక్షణము. అట్లన నెవ్వరును సంస్కృతమును గాని, యింగ్లీషును గాని నేర్చుకొనగూడదాయనియు, ఆయా భాషల నేర్చుకొని విద్యలను సాధించుటకు వీలున్నపుడు మాతృభాషలో లేవన్న చింత మనకేల యనియు కొందరు అడుగవచ్చును. సంస్కృత భాషను గాని, యింగ్లీషు భాషను గాని, ఫ్రెంచి మొదలైన యితర భాషలను గాని చేతనైన వారు, ధనమున్నవారు, వీలుగలవారు నేర్చుకొనవలయుననియే నా తాత్పర్యము. వానిలోని రాజభాషలనందునను, లోకమందలి యితర భాషల కంటే నన్ని విధములను గ్రంథ భాండారమునందత్యధికమైనదని ప్రఖ్యాతి చెందినదియు నగుటచే నింగ్లీషు భాషను నేర్చుకొనుట మన నాగరకతాభివృద్ధికిని, దేశోన్నతికి నత్యంతావశ్యకమని నా యభిప్రాయము. కాని యది యెంతవరకు సాధ్యమో! జనసామాన్యమునకంతకు నింగ్లీషు భాష చక్కగ వచ్చుటయు, నందు వారు సకల విద్యలను సాధింపగలుగుటయు నిక వేయి సంవత్సరములకయినను హిందూదేశమునందు సంభవించునా? ఎప్పటికినీ సంభవింపనేరదు. ఆపై సంస్కృతము. ఇది దేవభాషయని మనకు భక్తియున్నను దేశమునందెందరు సంస్కృత పండితులు కలరు? సంస్కృతము దేశభాషాభివృద్ధికి సాయముగా నుండవలసినదేగాని మరల నది దేశభాష యగునన్నమాట కలలోని వార్త. సంస్కృతముగాని, యింగ్లీషు గాని హిందూదేశములోని దేశభాషాస్థానమునాక్రమించుకొననేరవు. దేశభాషలలో విద్య నేర్పుట కంటే ఈ భాషలలో విద్య నేర్పుట యెప్పుడును నేర్చుకొనువారికిని, నేర్పువారికిని నెక్కుడు కష్టముగా నుండగలదు కావున నాయాభాషల వారికి నాయాభాషలలోనే విద్యాదానము చేయుమార్గముల నిర్మించుట యావశ్యకము.

**-కీ.శే. కొమఱ్ఱాజు వేంకట లక్ష్మణరావు**

(ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక-ప్రమాదీచ సంవత్సరము- 2వ సంచిక నుంచి)

ఈ అక్టోబరు నెల ముగ్గురు గొప్ప వ్యక్తులను మననుండి దూరం చేసింది. వయోవృద్ధుడు, భాషా పండితుడు శ్రీ కోరాడ మహాదేవ శాస్త్రి; తొలి తెలుగు దళిత నవలాకారుడు, సామాజిక విశ్లేషకుడైన మేధావి చిలుకూరి దేవపుత్ర; తొలిదశలో 'రుద్రజ్వాల'గా కలాన్ని కదంతొక్కించి, మలి దశలో తెలుగు భాషోద్యమ కవిగా వెలుగొందిన వెలుగు వెంకట సుబ్బారావు కనుమరుగయ్యారు. ఇదే సమయంలో మాతృభాషల రక్షణకు పిలుపిచ్చిన భారతీయ భాషా సమ్మేళనమూ, ప్రజల భాషలో పత్రికలను పరుగులెత్తించిన తాపీ ధర్మారావు పురస్కారసభ తిరుపతిలో జరిగాయి.... ఆ ప్రత్యేక కథనాలతో ఈ సంచిక మీ ముందుకు....



## లోపలి పుటలలో....


| | | | |
|---|---|---|---|
| | పొట్టిశ్రీరాములు నిలువెత్తు కంచువిగ్రహాన్ని స్థాపించాలి | -టి. రవిచంద్ | 6 |
| **సంపాదకహృదయం :** | మాతృభాషలరక్షణకై జాతీయవాదుల ఉద్యమం | -సామల రమేష్‌బాబు | 7 |
| తాపీ పురస్కార సభ | ఎప్పటికీ గుర్తుండేంత గొప్పగా జరిగిన....సభ | ...................... | 9 |
| | నేర్చుకుందాం | -తాపీ సుజాతా షా | 12 |
| | తాపీవారసత్వం-ఉమా వ్యక్తిత్వం | -మధురాంతకం నరేంద్ర | 16 |
| | తాత నడిచిన తోవలో | -ఆర్.ఎం.ఉమామహేశ్వరరావు | 18 |
| | గుండెను తడిపినతాపీధర్మారావు పురస్కార సభ | -సాకం నాగరాజ | 20 |
| **కంప్యూటర్ :** | భారతీయభాషల కంప్యూటింగ్ సంస్థలు | రహ్మానుద్దీన్ షేక్ | 22 |
| **పిట్టచూపు :** | కాలుష్యపుకోరల్లో కాలిపోతున్న నగరం... | -చలసాని నరేంద్ర | 24 |
| **బయటి తెలుగు కతల మాలిక - 6 :** | ఓ సంచారి అంతరంగం | -కుప్పె నాగరాజ | 26 |
| **న్యాయవ్యవస్థ :** | న్యాయవ్యవస్థపై సడలుతున్న నమ్మకం | -పెండ్యాల సత్యనారాయణ | 30 |
| **నివేదిక :** | భారతీయ భాషా సమ్మేళనం... | -కొ. దశపతిరావు | 32 |
| **ప్రత్యేకవ్యాసం :** | మాతృభాషలు-జాతీయవాదం | -సామల రమేష్‌బాబు | 35 |
| **శ్రద్ధాంజలి :** | వెలుగు వెంకట సుబ్బారావు | -కరణం కల్యాణ కృష్ణ | 38 |
| **ఉన్నసంగతి :** | నేను న్యాయవాదిని కాను | -పెండ్యాల సత్యనారాయణ | 41 |
| **పుస్తక పరిచయం:** | గిడుగు వేంకట రామమూర్తి......... | -అల్లంసెట్టి చంద్రశేఖరరావు | 43 |
| **శ్రద్ధాంజలి :** | కోరాడ మహదేవశాస్త్రి | -అద్దంకి శ్రీనివాస్ | 45 |
| **పుస్తక సమీక్ష:** | | -ఎం.వి.శాస్త్రి | 46 |
| **తెలుగులెంక సూక్తులు :** | | -నాగభైరవ ఆదినారాయణ | 47 |
| **కథానికతో ఓ సాయంత్రం :** | | ................... | 48 |
| **జనవాణి :** | తెలుగు వెలుగు ఎందుకు మసకబారిపోతోంది... | -ధూపం అభిమన్యుడు | 49 |
| **శ్రద్ధాంజలి :** | చిలుకూరి దేవపుత్ర | ............... | 50 |

**కవితలు** విశ్వభాష : **గుర్రాల రమణయ్య**(11) ఆఖరిఅర్జీ : **మందరపు హైమవతి**(15)
లోయ: **ఎన్.గోపి**(17) పద్యాలు: **ఎన్.వి రమణయ్య**(25)
అది ముగింపులేని పాట:**కత్తి పద్మారావు**(46) స్వస్థత : **ఎస్.కాశింబి**(48)


కైసేత, ముఖచిత్ర అలంకరణ : **కలిమిశ్రీ** ఫోటోలు : **తమ్మా శ్రీనివాసరెడ్డి**
రేఖాచిత్రం : **చిదంబరం** పకపకలు : **సరసి**


రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా

**డాక్టర్ సామల రమేష్‌బాబు**, సంపాదకుడు, **అమ్మనుడి,**
జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం, విజయవాడ-520004.
దూరవాణి: కార్యాలయం : 0866-2439466 సంపాదకుడు : 9848016136
e-mail : editorammanudi@gmail.com



పత్రికలో రచయితలు వ్యక్తం చేసే అభిప్రాయాలు వారి స్వంతం.
వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు.

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

మాసపత్రిక

• నుడి • నాడు • నెనరు

సంపాదకుడు డా॥ సామల రమేష్‌బాబు

శాలివాహన శకం 1938 : దుర్ముఖినామ సంవత్సర కార్తీక *(జీరాపి) శుద్ధవిదియ మంగళవారం మొదలు మార్గశిర*(ఈరాపి) శుద్ధపాడ్యమి బుధవారం వరకు

* జీరాపి * ఈరాపి : తెలుగు నెలలు

## చందా వివరాలు

| | | వ్యక్తులకు | సంస్థలకు | విదేశీయులకు |
|---|---|---|---|---|
| శాశ్వత చందా | : | రూ.5000 | రూ.7500 | -- |
| 5 సం॥ | : | రూ.1000 | రూ.1500 | 150 డాలర్లు |
| 3 సం॥ | : | రూ. 700 | రూ.1000 | 75 డాలర్లు |
| 1 సం॥ | : | రూ. 240 | రూ. 400 | 25 డాలర్లు |

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు డి.డి.ని **'అమ్మనుడి'** పేర పంపాలి. చెక్కు పంపేట్లయితే దయచేసి అదనంగా రు.30 లు చేర్చి పంపండి.

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'అమ్మనుడి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.

**AMMA NUDI - AXIS BANK, TENALI**

అకౌంట్ నెం. **915020010550189**

**IFSC Code : UTIB0000556**

ఆన్‌లైన్‌లో చందాను పంపినవారు, ఆ వెంటనే దయతో - చిరునామా, ఫోన్ నెం. తదితర వివరాలను జాబుద్వారాగాని, ఫోన్ మెసేజి ద్వారాగాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలకు చిరునామా

**డా॥ సామల లక్ష్మణబాబు,** ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి**
గుంటూరు జిల్లా - 522 211. ఫోన్ : 9440448244
ఇ-మెయిల్ : ammanudi@gmail.com

**చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. ఇందుకోసం మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలుపగలరు.**

## చందాదారులకు సూచనలు

1. చందా కాలం ముగింపు తేదీ - పత్రిక కవరుమీద మీ చిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
3. మీ ఇంటి నెంబరుతో పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలపాలి.
4. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.

## రచయితలకు సూచనలు

1. విభిన్న అంశాలపై వ్యాసాలను పంపవచ్చు. ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకుండా ఉండాలి. అన్నిరంగాలలో తెలుగు వారి శ్రేయస్సుకు సంబంధించిన రచనలను పంపండి. విమర్శలు విషయం పైనే ఉండాలి గాని వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. అప్రజాస్వామిక రచనలను తీసుకోలేము. సరళమైన తెలుగులో వ్రాయాలి. 2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్ చేసి editorammanudi@gmail.com కు పంపాలి. లేదా కొరియర్ / రిజిస్టర్డ్ / సాధారణ పోస్టులో పంపవచ్చు. **3. రచనతోపాటు రచన స్వంతమేనని, ఇతర పత్రికలకు గాని, ఇంటర్నెట్ పత్రికలకు గాని పంపలేదని, పరిశీలనలో లేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీపత్రాన్ని స్పష్టంగా వ్రాసి పంపాలి. పోస్టల్ చిరునామా, ఫోన్ నెం., ఇ-మెయిల్ కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.** 4. మాకు పంపే రచన నకలును మీ వద్ద ఉంచుకోండి. ప్రచురణకు ఎంపిక చేయని రచనలను తిప్పి పంపడం వీలుకాదు.

## కథారచయితలకు, కవులకు విన్నపం

1. మాట్లాడుకొనే తెలుగులో వ్రాసిన కథల్ని **'నడుస్తున్న చరిత్ర'** ప్రచురించిన సంగతి చదువరులకు, రచయితలకు తెలిసిందే. ఈ సంప్రదాయాన్ని **'అమ్మనుడి'** పత్రిక కొనసాగిస్తున్నది. పాత్రల సంభాషణలు తప్పనిసరిగా మీ ప్రాంతంలో మాట్లాడుకొనే తెలుగు తీరులో ఉండాలి. కథాచిత్రణ కూడా మీ తెలుగు తీరులోనే ఉంటే మంచిది. కఠినమైన సమాసాలను ఉపయోగించవద్దు. తేలికైన తెలుగు మాటలు కుదరకపోతే జనం వాడుకలోని ఇతర ప్రాంతాల తెలుగు మాటల్ని వ్రాయవచ్చు. తప్పనిసరి అయితే తప్ప ఏ ఇతర భాషల మాటలను ఉపయోగించవద్దు. ఈ సూచనలే కవితలకూ వర్తిస్తాయి.

2. **'అమ్మనుడి'**లో ప్రచురణకు తీసుకొనే కథలు, కవితలు తెలుగు వారి సామాజిక, భాషాసంస్కృతుల వికాసానికి తోడ్పడేవిగా ఉండాలి. ప్రతినెలా ఒకటి లేక రెండు కథలను మాత్రమే ప్రచురించగలం. ముద్రణలో 2 లేక 3 పుటలకు మించకుండా ఉండేవాటినే తొలి ఎంపికకు తీసుకుంటాము. కవితలు 20 నుంచి 30 వరుస (లైను) లకు మించకూడదు.

**నడుస్తున్న చరిత్ర** (2013 నవంబరు వరకు)

**అమ్మనుడి** (2015 మార్చి నుండి...)

**పాత సంచికలు విడిగా గాని, సంపుటి (వాల్యూం) బౌండులుగా గాని కావలసినవారు సంప్రదించండి.**

అమ్మనుడి, జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ,
హిందీ కళాశాల వీధి, మాచవరం, విజయవాడ-4.
ఫోన్ : 98480 16136, 0866-2439466



**శ్రీ నున్నా వేణుగోపాలరావు,**
**శ్రీమతి రంగమణి,**

హైదరాబాదు. ఫోన్ : 9346448149

ఈనాడులో 25 ఏళ్ళపాటు ఉపసంపాదకుడుగా పనిచేసిన నున్నా వేణుగోపాలరావు గారు తొలినుండీ తెలుగుభాషోద్య మంలో ఉన్నారు. తెలుగుభాషోద్యమ సమాఖ్య సంస్థాపక సభ్యులు. కార్యదర్శిగా పనిచేశారు. నడుస్తున్న చరిత్ర/అమ్మనుడికి అభిమాన పాఠకులు. హరిశ్చంద్ర చటోపాధ్యాయకు అత్యంత సన్నిహితులు. శ్రీమతి రంగమణి ఎ.పి.పి.ఎస్.సి.లో విభాగాధిపతిగా ఉద్యోగ విరమణ చేశారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ఎక్కువగా పాల్గొం టారు. అనేక సామాజిక, సేవా కార్యక్రమాల్లో దంపతులు ఇరు వురూ కలసి పాల్గొంటారు. దేశమంతా ఎంతో ఇష్టంగా పర్యటిం చిన వీరు తెలుగుజాతి ట్రస్టుకు ప్రోత్సాహకులుగా రు.10,000లు అందజేశారు.



**డా॥చలసాని సుబ్బారావు,**
**శ్రీమతి కనకరత్నం,**

మచిలీపట్టణం.

1923 నవంబరు 5న కృష్ణాజిల్లా ఇందుపల్లి గ్రామంలో పుట్టిన శ్రీ చలసాని సుబ్బారావుగారు బందరు హిందూకళాశాలలో హిందీ అధ్యాపకులుగా పనిచేశారు. హిందీ, తెలుగు, ఆంగ్లంలో సుమారు 2500 వ్యాసాలు, 75 గ్రంథాలు వ్రాశారు. 2013మే 26న కన్నుమూశారు. ఆయన కృషి వెనుక భార్య కనకరత్నంగారి పరిపూర్ణ సహకారం ఎంతో ఉంది. తల్లిదండ్రుల జ్ఞాపకార్థం వారి కుమారుడు శ్రీ సుధాకరరావు తెలుగుజాతి ట్రస్టుకు ప్రోత్సాహ కులుగా రు.10,000లు అందజేశారు. సుధాకరరావుగారు బందరు హిందూ కళాశాలలో రాజనీతి శాస్త్రంలో అధ్యాపకులుగా పనిచేసి, 2008లో ఉద్యోగ విరమణ చేశారు. సుధాకరరావుగారి ఫోను: 99596853085.

# తెలుగుజాతి (ట్రస్టు) విన్నపం

'నడుస్తున్న చరిత్ర' ప్రోత్సాహంతో ఆంధ్రప్రదేశ్‌లోనే కాక, పొరుగు రాష్ట్రాల్లోనూ నివసిస్తున్న తెలుగువారి శ్రేయస్సుకు, తెలుగు భాషోద్యమ నిర్మాణానికి కృషి జరిగింది. దక్షిణ భారతదేశమంతటా చిక్కగా అల్లుకొని, మొత్తం దేశంలోనేకాక, అనేక ఇతర దేశాల్లో కూడా భాషా సాంస్కృతిక మూలాలను విస్తరించుకొనివున్న తెలుగుజాతిలో చైతన్యాన్ని పెంపొందించి, వారిలో సంఘీభావాన్ని, భావసమైక్యతను బలపరచవలసిన అక్కరను గుర్తించిన కొందరు కార్యకర్తలు అందుకోసం పనిచేస్తున్నారు. అయితే, అనివార్య కారణాల వల్ల నడుస్తున్న చరిత్ర పత్రికను 2013 నవంబరు నుంచి నిలిపి వేయవలసి వచ్చింది. మళ్ళీ పత్రికను ప్రచురించడంతోపాటు తెలుగు నుడి, చరిత్ర, జాతి ముందడుగుకు అవసరమైన పుస్తకాల ప్రచురణను, ప్రచార కార్యక్రమాలను చేపట్టాలని తలపెట్టాము. ఇందుకోసం 'తెలుగుజాతి' పేరిట ఒక ట్రస్టును నమోదు చేయించాము. (92/ 2014). తెలుగు అమ్మనుడిగా కలిగినవారు ఎక్కడ నివసిస్తున్నా, వారి శ్రేయస్సు కోసం ఈ సంస్థ పనిచేస్తుంది.

2015 మార్చి నుంచి **అమ్మనుడి** పత్రికను ప్రచురిస్తున్నాము. పుస్తకాల ప్రచురణ కార్యక్రమంలో భాగంగా తొలుత స.వెం.రమేశ్ వ్యాసాల సంకలనం **'ఎల్లలు లేని తెలుగు'**ను విడుదల చేశాము. త్వరలోనే మరికొన్ని ప్రత్యేకమైన పుస్తకాలను వెలువరించ బోతున్నాము. ఈ ట్రస్టును బలమైన పునాదులపై, తగినన్ని వనరులతో బలపరచటానికి మీ అందరి చేయూత కావాలి. ట్రస్టు నిర్మాణంలో తోడ్పడాలని విన్నవిస్తున్నాము.

**ట్రస్టుకు విరాళాలనిచ్చి తోడ్పడ గోరుతున్నాము.**

| | |
|---|---|
| రాజ పోషకులురు. 1,00,000/-లు | పోషకులు రు. 25,000/-లు |
| విశిష్ట పోషకులు రు. 50,000/-లు | ప్రోత్సాహకులు రు. 10,000/-లు |

**దాత ఫోటోను, క్లుప్తంగా పరిచయాన్ని 'అమ్మనుడి' పత్రికలో ప్రచురిస్తాము.**
**దాతలందరినీ శాశ్వత చందాదారులుగా పరిగణించి పత్రికను ప్రతినెలా పంపిస్తాము. ట్రస్టు ప్రచురించే పుస్తకాలను కూడా ఉచితంగా పంపిస్తాము.**

సొమ్మును చెక్ / డ్రాఫ్టుగా / ఆన్‌లైన్‌లో 'TELUGUJAATHI' పేర పంపాలి. యాక్సిస్ బ్యాంక్, సికిందరాబాదు.

అక్కౌంట్ నెం. 914020020387880 I.F.S.C.Code : UTIB0000068

**డా॥ సామల రమేష్‌బాబు,** మేనేజింగ్ ట్రస్టీ, 9848016136 ట్రస్టీలు : **పారుపల్లి కోదండరామయ్య** 9505298565, **డా॥వెన్నిసెట్టి సింగారావు** 9393015584, **స.వెం.రమేశ్** 8500548142, **సామల లక్ష్మణబాబు** 9440448244



# నవ్యాంధ్రప్రదేశ్ కొత్తరాజధాని అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములు నిలువెత్తు కంచు విగ్రహాన్ని స్థాపించాలి

**అ**మరజీవి పొట్టి శ్రీరాములు (1902–1952) ఆధునిక ఆంధ్ర రాష్ట్ర నిర్మాత. భారతదేశంలో భాషాప్రయుక్త రాష్ట్రాల ఆవిర్భావానికి స్ఫూర్తి ప్రదాత. ఆంధ్ర రాష్ట్ర నిర్మాణం కోసం పొట్టి శ్రీరాములు చేసిన ఆమరణ నిరాహార దీక్ష ప్రపంచ చరిత్రలోనే సాటిలేనిది, మరువలేనిది. భాషాప్రయుక్త రాష్ట్రాల భావనకు ప్రాణం పోసి, తన ఆమరణ నిరాహార దీక్ష ద్వారా నాంది పలికిన త్యాగి పొట్టి శ్రీరాములు. అందువల్లనే ప్రముఖ రాజకీయ వ్యాఖ్యాత, చరిత్రకారుడు రామచంద్ర గుహ "ద బ్యాటల్ ఫర్ ఆంధ్ర" (ఆంధ్ర కోసం పోరాటం) అనే వ్యాసంలో పొట్టి శ్రీరాముల్ని "మార్టర్ ఆఫ్ ఇండియా" (భారతదేశ మార్టర్)గా అభివర్ణించాడు. ఎందుకంటే ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ఆయన చేసిన ప్రాణత్యాగం వల్ల భారతదేశ భౌగోళిక స్వరూపమే మారిపోయింది. భారతదేశ భౌగోళిక చిత్రపటం రూపురేఖలే మారిపోయాయి. ఆంధ్ర రాష్ట్రం ఏర్పడి 50 సంవత్సరాలయిన సందర్భంగా రాసిన ఈ వ్యాసంలో ఆయన ఇంకొక బాధాకరమైన విషయం కూడా పేర్కొన్నాడు : "విచారకరం, ఆంధ్ర రాష్ట్రానికి వెలుపల నేడు ఆయన విస్మరించబడిన వ్యక్తి" (Sadly, outside Andhra, he is a forgotten figure). ఆంధ్ర రాష్ట్రానికి వెలుపలే కాదు. ఆంధ్ర రాష్ట్రంలోనే నేడు ఆయన విస్మరించబడుతున్నాడు. అమరజీవి పొట్టి శ్రీరాములు దేహ త్యాగ ఫలితంగా అప్పటి మద్రాసు ప్రెసిడెన్సీలోని తొమ్మిది జిల్లాలతో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. ఆ తర్వాత రాష్ట్రాల పునర్విభజనలో భాగంగా భారతదేశంలోనే తొలి భాషాప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ అవతరించింది. అటువంటి ఆంధ్రప్రదేశ్ నేడు రెండు రాష్ట్రాలు (తెలంగాణా, ఆంధ్ర)గా ఏర్పడి భాషాప్రయుక్త రాష్ట్ర భావనను విస్మరించటమే కాకుండా పొట్టి శ్రీరాముల్ని ఆంధ్ర ప్రాంత నాయకుడిగా తెలంగాణా పాలకులు చిత్రిస్తుంటే, ఆంధ్ర పాలకులు భాషాప్రయుక్త రాష్ట్ర భావనను విస్మరిస్తున్నారు. ఆంధ్రుల ప్రాచీన చరిత్రలో అమరావతి ఎంత ముఖ్యమైనదో, ఆంధ్రుల ఆధునిక చరిత్రలో అమరజీవి పొట్టి శ్రీరాములు అంత ముఖ్యమైనవాడు. పొట్టి శ్రీరాములు తర్వాత ఆంధ్రులకు జాతీయంగా, అంతర్జాతీయంగా ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చి ఆంధ్రులందరి చేత అభిమానంతో "అన్న"గా పిలిపించుకొనే ఎన్.టి.రామారావు అమరజీవి పొట్టి శ్రీరాములు గురించి అన్నమాటల్ని ఆంధ్ర ప్రజలు, పాలకులు గుర్తుపెట్టుకోవాలి : "రాష్ట్ర ఉద్యమాన్ని పొట్టి శ్రీరాములు ఒక తపస్సుగా అకుంఠిత దీక్షతో నిర్వహించి చిరునవ్వుతో మృత్యువును ఆలింగనం చేసుకున్న మహామనీషి. ఆ అమరజీవి త్యాగమయ జీవితం తెలుగు వారందరికీ ముఖ్యంగా మన యువకులకు ఆదర్శప్రాయం కావాలి, ఆయన ఆశయమైన రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధిని సాధించడానికి అందరం కలిసి కృషి చేయాలి." ఆంధ్రుల చరిత్రలో అమరావతి ప్రాచీన చారిత్రక వారసత్వం, అమరజీవి త్యాగమయ నిర్మాణాత్మక వారసత్వం చిరస్థాయిగా నిలిచిపోతాయి.

పొట్టి శ్రీరాములు లాంటి దేశభక్తులు పది, పన్నెండు మంది ఉంటే ఈ దేశ స్వాతంత్ర్యాన్ని కొద్దిరోజుల్లోనే సాధించగలనన్నాడు గాంధీజీ. అంతటి గొప్ప వ్యక్తిత్వం అమరజీవిది. తన ప్రాణత్యాగం ద్వారా జాతీయస్థాయిలో తొలిసారి తెలుగువారికి ఒక గుర్తింపు తెచ్చిన పొట్టి శ్రీరాములు–ప్రపంచ మేధావి, బౌద్ధధర్మ పునరుద్ధారకుడు అయిన డా॥బి.ఆర్.అంబేద్కర్‌చే పార్లమెంట్ సభా ప్రాంగణంలో ప్రశంసలందుకున్న అరుదైన వ్యక్తి. అందరి ఆమోదం పొందిన భాషాప్రయుక్త రాష్ట్రాల తీర్మానాన్ని పట్టించు కోని నాటి కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ, దాని కోసం ప్రాణత్యాగం చేయాల్సిన పరిస్థితిని కల్పించిన ప్రభుత్వాన్ని ఇంకొక దేశంలోనయితే ఉరితీసే వాళ్ళని డా॥అంబేద్కర్ తీవ్రంగా నిరసించాడు.

పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్ర నిర్మాతయే కాదు. ఇంకా అనేక రంగాలలో సేవా కార్యక్రమాలను నిర్వహించాడు. శానిటరి ఇంజనీరింగ్ చదివి, ఉన్నతోద్యోగాలకు అవకాశం ఉన్నా వాటన్నిటినీ కాదని జాతీయోద్యమంలోకి ప్రవేశించాడు. సాంప్రదాయిక వ్యాపారస్తుల కుటుంబంలో పుట్టినా ఆదర్శాలు తప్ప ఆర్థిక విషయాలు పట్టించుకోని ఆదర్శ మూర్తి. నిస్వార్థంగా జీవించాడు. జాతీయోద్యమకాలంలో గాంధీజీ, డా॥ అంబేద్కర్ నేడు దళితులుగా పరిగణించబడుతున్న "అస్పృశ్య" కులాల కోసం, వారి అభ్యున్నతికోసం భిన్న మార్గాల్లో కృషి చేశారు. స్వాతంత్ర్యానంతరం గాంధీజీ ప్రకటించిన నిర్మాణాత్మక కార్యక్రమంలోని 18 మార్గదర్శక సూత్రాలను సాధించడానికి, అమలు పరచడానికి గాంధీజీ ఆశీస్సులతో, ఆయన అడుగుజాడల్లో ఒంటరిగా పోరాడాడు. రాజకీయాలకు అతీతంగా సంఘ సంస్కరణ కోసం నిలబడ్డాడు. ఎన్నో అవమానాల్ని, భౌతికదాడుల్ని ఎదుర్కొన్నాడు. సమకాలీనులు కొందరు హేళన చేసినా ఆయన చలించలేదు. ఒంటరిగా తాను నమ్మిన గాంధేయ మార్గంలో దేశాభివృద్ధికి, రాష్ట్రాభివృద్ధికీ నిరంతర శ్రామికుడిలా నిస్వార్థంగా శ్రమించాడు. ఆయన శ్రమయోగి, కర్మయోగి.

**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారికి ఒక విజ్ఞప్తి**

1. నవ్యాంధ్రప్రదేశ్ కొత్త రాజధాని, చారిత్రక ధార్మిక కేంద్రం అమరావతిలో అమరజీవి నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని ఆయన 115వ జయంతి సందర్భంగా ఆవిష్కరించి, ప్రజలకు అంకితం చేయాలి.
2. పొట్టి శ్రీరాములు జన్మదినాన్ని అధికారికంగా నిర్ధారించి (మార్చి 15 లేదా 16 కావచ్చు) ఆ రోజును శెలవుదినంగా ప్రకటించాలి.
3. పొట్టి శ్రీరాములు జీవిత చరిత్రను ప్రచురించాలి.

**–టి.రవిచంద్,** బాపట్ల

సంపుటి : 2 సంచిక : 9
**అమ్మనుడి**
నవంబరు 2016

సంపాదకీయం

# మాతృభాషల రక్షణకై జాతీయవాదుల ఉద్యమం

**బ**లమైన సాంస్కృతిక జాతీయవాదాన్ని ఆధారంగా చేసుకొని దేశంలోని అన్నిరంగాలను ప్రభావితం చేస్తున్న 'రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్' రాజకీయ పార్టీ కాదు. అదొక స్వచ్ఛంద సేవాసంస్థ. సుశిక్షితులైన నాయకత్వ లక్షణాలు కలిగిన ప్రచారకులకు వివిధ రంగాల్లో బాధ్యత నప్పగించి, సర్వాంగీణ జాతీయ సమైక్యతకోసం అభివృద్ధి కోసం నియోగిస్తారు. వారి లక్ష్యాలు, పని విధానం – భిన్నమైన సామాజిక, రాజకీయ దృక్పథం గల వ్యక్తులకు, సంస్థలకు నచ్చకపోవచ్చు. అయినా తమదైన తీరులో విశిష్టలక్ష్యాలతో పనిచేసుకుపోయే తీరు రా.స్వ.సంఘ కార్యకర్తలది.

తొలినుండి విద్యార్థి ఉపాధ్యాయ రంగాల్లో రా.స్వ.సంఘ కార్యకర్తలు ఆయా సంస్థల్లో పనిచేస్తున్నారు. కానీ భాషలకు సంబంధించి వారికున్న అభిప్రాయాలతో దేశమంతటా ఉద్యమరూపంలో ముందుకు వచ్చిన సందర్భాలు అంతగా లేవు. సంస్కృతం సర్వోన్నత భాష అని, అన్ని అవసరాలకు తగిన పారిభాషిక పదజాలాన్ని సమకూర్చుకునేందుకు సంస్కృతాన్ని వినియోగించుకోవాలని ఆ విధంగా సంస్కృత పదజాలంతో పరిపుష్టం చేసిన హిందీని జాతీయభాషగా బలీయం చేస్తే భారత జాతీయత బలపడుతుంది అనీ సంఘపరివార సంస్థల సైద్ధాంతిక దృక్పథం. అదే సమయంలో సంస్కృతాన్ని అన్నివిధాలుగా శక్తివంతం చేయాలనే లక్ష్యంతోనే వారిలోని, ఆ సంస్థల్లోని కొందరు మేధోజీవులు, కొన్ని సామాజికవర్గాల వారు ఆలోచిస్తుంటారు.

అంతమాత్రాన మాతృభాషల గురించి వారికి పట్టదని అనుకోకూడదు. అసలు ఏ సిద్ధాంతాన్ని బలపరిచే రాజకీయ, రాజకీయేతర సిద్ధాంత కర్తలు అయినా, వారి అనుచరులు అయినా మాతృభాషలను కాదని అనలేరు. ఎవరు ఏమన్నా ఎలా చూసినా ఎవరి మాతృభాషలో వారు మాట్లాడుకుంటారు. ఎవరి తల్లినుడిని వారు ప్రేమిస్తారు. వారికి అది ఆత్మగౌరవ అంశం. ఇటీవల మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కౌల్ గారు తమ తీర్పులో స్పష్టం చేసినట్లు – అన్ని భాషలూ సమానమే. అవన్నీ దేవాలయాలే. వాటిలో ఆ భాషీయుల ఆత్మలు విలసిల్లుతుంటాయి. ఎందుకంటే మాతృభాషలన్నీ ప్రజాభాషలే. అవి అత్యంత సహజంగా పుట్టిపెరుగుతుంటాయి. ఒకప్పుడు రాజుల, రాజ్యాల ప్రభావంతో వాటి పెరుగుదల, తరుగుదల వుండి, కేవలం సాహిత్యంతో ముడిబడి వాటి గౌరవం నిలిచి వుండేది. ఇప్పుడట్లా కాదు. ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ వ్యాప్తిలో భాగమై తమను తాము పెంచుకొనే భాషలే నిలబడతాయి. తక్కినవి వినియోగం నుండి తప్పుకొని క్రమంగా బలహీనపడతాయి.

మనదేశం ఎన్నో భాషల ప్రజలున్న దేశం అయినా భారతదేశంగా మనకొక జాతీయత వుంది. అయినా భాష, సంస్కృతి, ఆచార వ్యవహారాల్లో ఎంతో వైవిధ్యం వుంది. హిందుత్వం పేర స్పష్టత లేని వాదాల కంటే అతీతమైన కొన్ని భౌగోళిక, చారిత్రక, రాజకీయ, సామాజిక కారణాలు ఈ ప్రజలందరినీ ఒక జాతిగా కలిపి వుంచుతున్నాయి. అయితే భాషను ఆధారంగా చేసుకొని కొన్ని ప్రాంతాల ప్రజాసమూహాలను భాషాజాతులుగా గుర్తించడమనే చారిత్రక సాంప్రదాయం వుంది. జనభాషల బలం....అంటే మాతృభాషల బలం అలాంటిది. అయితే మనం గుర్తించాల్సిన విషయం ఒకటుంది. ఇక్కడ 'జాతి' అనే మాట సాపేక్షికం. స్పష్టత కోసం గుర్తింపుకోసం జాతి అనే మాట వాడబడుతుంది. కనుక..తెలుగు భాషాజాతి అంటే అది భారతజాతిలో అంతర్భాగమే.

భారత జాతీయతకు, జాతి విలువలకు అత్యంత ప్రాధాన్యత నిచ్చే సంఘ సిద్ధాంత కర్తలు ఇప్పుడు విద్యా సంస్కృతులను ఉద్ధరించడానికై 'శిక్షాసంస్కృతి ఉత్థాన్ న్యాస్' అనే సంస్థను స్థాపించి జాతీయస్థాయిలో పెద్దఎత్తున కార్యక్రమాలను తలపెట్టారు. భారతీయ భాషామంచ్ అనే వేదికనేర్పరచి, దేశమంతటా మాతృభాషల రక్షణకు, అభివృద్ధికి దీక్ష వహించారు. అందులో భాగంగానే అక్టోబరు 15,16లలో తిరుపతిలోని రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠంలో భారతీయ భాషల జాతీయ సమ్మేళనం నడిపారు. ఆ వేదిక నుండి మాతృభాషలను రక్షించుకోవడానికి ఏంచేయాలో తెలుపుతూ కొన్ని సూచనలిచ్చారు. అమ్మ, అమ్మనేల, అమ్మనుడి (మాత, మాతృదేశం, మాతృభాష) వీటికి ప్రత్యామ్నాయం లేదని స్పష్టం చేస్తూ తొమ్మిది సూత్రాల తక్షణ కార్యక్రమాన్ని ప్రకటించారు. (విచిత్రమేమిటంటే, తెలుగునేలపై వున్న ఆ విద్యాపీఠం ప్రాంగణంలో ఎక్కడా తెలుగుకు స్థానమే లేదు. అన్నిచోట్ల మొదట సంస్కృతంలో, దానికింద ఇంగ్లీషులోనే పేరు పలకలు, సూచన పలకలు అన్నీ నిండి వున్నాయి.)

1. ఎవరి సంతకాన్ని వారు అమ్మభాషలోనే చేయాలి. బ్యాంకు చెక్కులను కూడా తన భాషలోనే రాయాలి. 2. పేరు

పలకలు (సైన్‌బోర్డులు) ఇంటా బయటా, కార్యాలయాల్లోనూ, వ్యాపార సంస్థల్లోనూ, రశీదులు, రబ్బరు స్టాంపులతో సహా అంతా మీ సొంత భాషలోనే వుండాలి. 3. ఏ భాషలో రాసినా ఇండియా అనే బదులు భారత్ అని వ్రాయాలి. 4. మొబైల్ ఫోన్‌లు కంప్యూటర్లలో మీ భాషనే వాడండి. 5. పెండ్లికి, పుట్టినరోజుకు ముద్రించే ఆహ్వానాలను మీ మాతృభాషలోనే వేయండి. లేదా హిందీలో గానీ సంస్కృతంలో గాని వెయ్యండి. 6. వ్యక్తిగత సమాచారాలను మీ భాషలో గాని, హిందీలో గాని వ్రాయండి. 7. మాతృభాషా మాధ్యమాన్ని బోధించే పాఠశాలల్లో మాత్రమే మీ పిల్లల్ని చేర్చండి. 8. నమస్తే అనండి..గుడ్‌మార్నింగ్ కాదు. 9. బ్యాంకు పాస్ పుస్తకాలు, ఆదాయపన్ను పత్రాలు వంటివి కూడా మీ భాషలోనే వుండాలి....ఈ సూత్రాలన్నీ ప్రజలను ఉద్దేశించినవే.

ఇక తిరుపతిలో జరిగిన భాషా సమ్మేళనం లక్ష్యాలు.. ప్రాంతీయ భాషల్ని సమైక్యపరచటం, ప్రాంతీయ భాషల పునరుద్ధరణకు కార్యప్రణాళికను రూపొందించటం, మాతృభాషా పరిరక్షణోద్యమ నిర్మాణం కోసం ఒక జాతీయ శాశ్వతవేదిక నిర్మాణం. అయితే ఈ ఉద్యమం ఎలా వుండాలి అనిగాని, ప్రభుత్వం నుంచి సాధించాల్సింది ఏమిటి అని గాని ఎక్కడా స్పష్టమైన ఆలోచన లేదు.

భాష రక్షణకు మౌలికంగా కావలసినవి మాతృభాషలోనే పాలన, బోధన వుండటం. నిత్యజీవితంలోనూ అన్ని ఆధునిక అభివృద్ధి రంగాల్లోనూ మన భాషనే పూర్తిగా వినియోగించటం. నేటి పరిస్థితుల్లో దీన్ని ఎలా సాధించాలన్నదే లక్ష్యంగా ఉద్యమం సాగాలి. ఆ విధంగా ప్రభుత్వాల భాషావిధానం రూపొందితే, ప్రజల జీవనంలో మరొక భాషను ఎక్కువగా ఉపయోగించవలసిన అవసరమే వుండదు. భాష కోసం గానీ మరొకటి గానీ పరుల మీద ఆధారపడాలని ఎవరూ అనుకోరు. సామాజిక, ఆర్థిక భావజాలం వత్తిడివల్ల, చేతగాని ప్రభుత్వాల వల్ల మన స్వాభిమానం అణగారి పోతున్నదని, మనిషిని బానిసగా చేసే విధానాల్ని మన వ్యవస్థలు కాపాడుతున్నాయని మనం గ్రహించాలి. ఇలాంటి ప్రజావ్యతిరేక వ్యవస్థలు పరాయి భాషలకు లొంగి బానిసలుగా పనిచేస్తున్నాయని– ఆ చరిత్ర నుంచే ఇప్పటి కార్పొరేట్ వ్యవస్థ ఉదయించిందనీ, మన పాలకులు కేవలం ఆ వ్యవస్థల కీలుబొమ్మలుగానే వున్నారని మనం గ్రహించాలి. స్వదేశీ, అభివృద్ధి ప్రచారాలతో ఇప్పుడు కేంద్రలో అధికారాన్ని చెలాయిస్తున్న ఎన్డీయే ప్రభుత్వంలోని ప్రధాన భాగస్వామి భా.జ.పా., రా.స్వ.సంఘం ఆదర్శాలతో ఆశీర్వాదంతో వున్నదన్న సంగతి అందరికీ తెలిసిందే. కీ.శే.దీనదయాళ్ ఉపాధ్యాయ ప్రతిపాదించిన ఏకాత్మమానవదర్శన సిద్ధాంతాన్ని ఆ పార్టీ ఏనాడో తుంగలో తొక్కింది. గాంధేయ సోషలిజం అనే విచిత్ర సమాసాన్ని ముందుకు తెచ్చి అదేమిటో అర్థంగాక బోర్లాపడి చివరకు, తమకు ముందున్న ప్రభుత్వాల విధానాల్నే కొనసాగిస్తున్నారు. ఇంతకుముందున్న అవినీతిమయ, అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం కంటే ఎన్నో విధాలుగా మెరుగైనదే అయినా ఇప్పటి ప్రభుత్వం కూడా అంతర్జాతీయ, జాతీయ కార్పొరేట్ శక్తులకు మరింత బలాన్నిచ్చే విధానాలనే అనుసరిస్తున్నది. దీర్ఘకాలిక లక్ష్యాలతో పనిచేస్తున్న నేటి జాతీయ నాయకత్వం నిగ్గు తేలడానికి మరికొంత సమయం పట్టవచ్చు. కానీ స్పష్టంగా జాతీయ, ప్రాంతీయ భాషా విధానాల్ని రాష్ట్రాలతో కలిసి చర్చించి రూపొందించే ప్రయత్నం ఎందుకు చేయడం లేదు? జాతికి మౌలికమైన మన మాతృభాషల్ని అభివృద్ధి చేసుకుంటూ మన మేధోవారసత్వానికీ ఆధునికతకీ పెద్దపీట వేయగల జాతీయ దృక్పథం ఏమైంది?

ఇప్పటికైనా జాతీయస్థాయిలో మాతృభాషల రక్షణకై ఒక వేదికతో జాతీయవాద శక్తులు ముందుకు రావడం స్వాగతించదగిందే. ఇటీవల మాతృభాషలో విద్య, పాలన జరగాలంటూ దేశంలో కంప్యూటర్ రంగంలోనూ ఇతర రంగాల్లోనూ వున్న కొందరు యువ మేధావులు కదులుతున్నారు. మద్రాసు డిక్లరేషన్, ఢిల్లీ డిక్లరేషన్ వారి వల్ల వచ్చినవే. ఆంధ్ర తెలంగాణలతో సహా చాలా రాష్ట్రాల్లో తమ మాతృభాషల పట్ల ఆందోళన పెరుగుతున్నది. ఈ పరిస్థితుల్లో ఉద్యమాలు తప్పవు. అయితే చాలా అంశాలపట్ల లోతైన అవగాహనతో సాగాలి. ఇంగ్లీషును వ్యతిరేకించాల్సిందే. కానీ అది మన నట్టింట్లో, మన గుండెలమీద, మన నెత్తిన తిష్టవేసి కూర్చున్నది. దానిని ఎంతమేరకు వదిలించుకోగలమో అది ఎలా సాధ్యమో స్పష్టమైన ఆచరణాత్మక ప్రణాళిక వుండాలి.

అలాగే 'మాతృభాషల పునరుద్ధరణ'ను కూడా ఒక లక్ష్యంగా ప్రకటించినవారు – భారతీయ భాషల ప్రత్యేకతను గురించి, ఆ భాషల ఉత్పత్తి, పరిణామాల గురించి తెలుసుకోవాలి. దక్షిణాది భాషలను సంస్కృతీకరించడం అనే అతివాదం దుష్పరిణామాలకు దారి తీస్తుంది. ప్రతిభాషకు తనదైన మౌలిక వ్యాకరణం సహజంగా వుంటుంది. ప్రజాజీవనంలోంచి, సంస్కృతిలోంచి విడదీయలేని భాషలుంటాయి. వాటికే ప్రత్యేకమైన భాషాతత్వం వుంటుంది. కొన్ని వృత్తులకే ప్రత్యేకమైన, మాటలుంటాయి. అవి కాలక్రమంలో కొన్ని భాషల ఆధిపత్యానికి గురైనా ఇంకా కొన్ని నిలబడే వున్నాయి. నాడు సంస్కృతంతోనో, పర్సోఅరబిక్ (ఉర్దూ) పదాలతోనో, ఇప్పుడు ఆంగ్లీకరణంతోనో జనభాషలపై పెత్తనం చేసే ధోరణులు ఇకపై తగవు. ఆయా భాషల మౌలికత పైనే ఆధారపడి, వాటిని పెంపొందించాలి.

సరే...ఇంతకూ వామపక్షవాదులు, తదితర అభ్యుదయ ప్రజాస్వామ్యవాదులు మాతృభాషల రక్షణ విషయంలో ఏం చేస్తున్నట్లు? అధికారంలో వున్న తెలుగుదేశం, తెరాసలతో పాటు ఇతర రాజకీయ పార్టీలను సామాజిక ఉద్యమకారులను నిలదీయాల్సిన సమయం వచ్చింది. మాతృభాషల కోసం ఇకనైనా వీరంతా ఉద్యమిస్తారా? విద్య, పాలనా రంగాల్లో భాష వినియోగం విషయంలో ఏ విధంగా రాజీపడినా, మౌనం వహించినా వారిని ప్రజలు క్షమించబోరని అన్ని పార్టీలు తెలుసుకోవాలి. భాషారక్షణోద్యమాల్లో తమంతట తాము గాని, ఇతరులతో కలిసి గాని ముందుకు రావడం ప్రజాస్వామ్యప్రియుల, స్వాభిమానం గల అందరి కర్తవ్యం. అన్ని భాషా సాహిత్య సాంస్కృతిక సంఘాలు, రాజకీయ పార్టీలు, సామాజిక ఉద్యమ సంస్థలు, వ్యక్తులు అందరితోపాటు నిర్దిష్ట లక్ష్యాలకోసం తెలుగు భాషోద్యమ సమాఖ్య కలిసి పనిచేస్తుంది.

సామల రమేష్‌బాబు

**1-11-2016**



# ఎప్పటికీ గుర్తుండేంత గొప్పగా జరిగిన తాపీ పురస్కార సభ

**కీ.శే.**తాపీధర్మారావుగారి పేర ఒక పురస్కారాన్ని ప్రతిభావంతులైన పాత్రికేయులకు 2009నుండి ఇవ్వాలని 'నడుస్తున్న చరిత్ర' పత్రిక తలపెట్టింది. ఇప్పటికి డా॥నాగసూరి వేణుగోపాల్ (2009), డా॥కె.శ్రీనివాస్ (2011), శ్రీ టంకశాల అశోక్(2013), శ్రీ. జి.శ్రీరామమూర్తి(2014), శ్రీ ఎ.కృష్ణారావు(2015) లకు ఇచ్చిన సంగతి అందరికీ తెలిసిందే. 2013లో పత్రిక ఆగిపోయినప్పటికీ, తాపీ పురస్కారం కొనసాగాలనే ఆలోచనతో తాపీ ధర్మారావు వేదికను డా॥ సామల రమేష్‌బాబు నెలకొల్పారు. 2014,2015 పురస్కారాలను వేదికపేరుతోనే ఇవ్వడం జరిగింది. ఈ ఏడు అక్టోబరు 17న తిరుపతి శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ ఆర్ట్సుబ్లాక్ ఆడిటోరియంలో ఉదయం 11 గంటలకు ఈ పురస్కారసభ ఘనంగా జరిగింది. తిరుపతి నగరంలోనూ, విశ్వవిద్యాలయాల్లోనూ ప్రముఖులు, రచయితలు, కవులు, జర్నలిజం విద్యార్థులు పాల్గొన్న ఈ సభలో ఆడిటోరియంలో ఉన్న కుర్చీలు చాలక ఎంతోమంది నిలబడి సభను వీక్షించారు. ఎంతో ఉద్వేగంతో, ఉత్సాహంతో ఆలోచనాత్మకంగా, స్ఫూర్తిదాయకంగా ఈ కార్యక్రమం జరిగింది. తప్పని పరిస్థితులవల్ల ముఖ్యఅతిథిగా పాల్గొనవలసియున్న శ్రీభువనచంద్ర, డా॥ఎన్. ముక్తేశ్వరరావులు సభలో పాల్గొనలేక పోయారు. అయితే ఆలోటును ప్రముఖ కళాకారుడు, రచయిత శ్రీకాకరాల తీర్చారు. పురస్కారస్వీకర్త ఉమామహేశ్వరరావు అభిమానులైన పాత్రికేయులు, భాషోద్యమకారులు, రచయితలు ఎంతో ప్రేమతో తరలివచ్చి సభను ఆనందించారు.

సభకు అధ్యక్షత వహించిన ఆకాశవాణి, తిరుపతి సంచాలకులు డా॥ నాగసూరి వేణుగోపాల్ మాట్లాడుతూ తాపీధర్మారావు పత్రికా సినీ సాహిత్య రంగాల్లో చేపట్టిన కృషిపై మరెంతో పరిశోధన జరగాలన్నారు. జర్నలిజం విద్యార్థులు తాపీధర్మారావు కృషిని అధ్యయనం చేస్తే ఎంతో నేర్చుకోవచ్చునన్నారు. 'జనవాణి' పత్రికలోని సంపాదకీయాలను ఒక పుస్తకంగా తేవలసిన అవసరముందన్నారు. పురస్కార వ్యవస్థాపకుడు 'అమ్మనుడి' సంపాదకుడు డా॥ సామల రమేష్‌బాబు మాట్లాడుతూ ధర్మారావు ఆలోచనలు, వ్యక్తిత్వం, పాత్రికేయ విశిష్టత, రచనల్లోని విలక్షణత, పరిశోధన, ఉమామహేశ్వరరావులో కూడ కన్పిస్తున్నందున ఈ పురస్కారానికి ఆయనను ఎంపిక చేశామని తెలియజేశారు.

ఉమామహేశ్వరరావుకు సన్మాన పత్రాన్ని శ్రీమతి గంగవరం శ్రీదేవి సభికులకు చదివి వినిపించిన తరువాత దానితోపాటు పుష్పగుచ్ఛాన్ని, శాలువాను, పురస్కార ఫలకాన్ని, పారితోషికాన్ని వేదికమీదున్న పెద్దలంతా కలిసి ముఖ్యఅతిథి శ్రీకాకరాల చేతులమీదుగా పురస్కార స్వీకర్తకు అందజేశారు. ఉమామహేశ్వరరావును ఆయన భార్య శ్రీమతి విష్ణును ఈ సందర్భంగా వారి అభిమానులు, పాత్రికేయులు, రచయితలు అభినందనలతో, సన్మానాలతో ముంచెత్తారు. ఈ సత్కారానికి స్పందించిన శ్రీఉమామహేశ్వరరావు ప్రసంగాన్ని ఈ పక్క పుటలలో ప్రత్యేకంగా యిచ్చాము. ఆత్మీయ అతిథిగా విచ్చేసి, పురస్కార స్వీకర్త గురించి సభకు ఎంతో నిజాయితీగా పరిచయం చేస్తూ ప్రసంగించిన మధురాంతకం నరేంద్రగారి ప్రసంగాన్నీ, మరొక ఆత్మీయ అతిథిగా హైదరాబాదు నుంచి ప్రత్యేకించి వచ్చి పాల్గొన్న తాపీ సుజాతా షా (తాపీ ధర్మారావు గారి మనుమరాలు, తాపీ మోహన్‌రావుగారి కుమార్తె) ప్రసంగాన్నీ ప్రత్యేక వ్యాసాలుగా ఈ పక్క పుటల్లోనే ఇచ్చాము. ఆత్మీయ అతిథిగా పాల్గొన్న మహిళా విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా॥ పి.విజయలక్ష్మి, జనవాణి సంపాదకీయాలను సంకలనం చేస్తే తాను ముద్రించి, అందుబాటులోకి తెస్తామన్నారు. తాపీని ఆదర్శంగా తీసుకొని పత్రికా ప్రసార రంగాలు పనిచేయాలన్నారు.

ఈ సభను ఇంత విజయవంతం కావించడానికి కారణమైన అరసం రాష్ట్ర కార్యదర్శి, రచయిత, భాషోద్యమ సమితి ప్రముఖుడు శ్రీ సాకం నాగరాజ తొలుత పెద్దలను వేదికపైకి ఆహ్వానించారు. పని చేయడమే తప్ప ప్రచారానికి ఇష్టపడని తత్వమున్న శ్రీనాగరాజ చివరిలో ముగింపు మాటలను పలకడం వీలుకాలేదు. అందువల్ల ఆయన మాటల్లోనే ఒక వ్యాసాన్ని కూడా ఈ పుటల్లో ఇస్తున్నాము.

ఎందరో ప్రముఖులు సభలో పాల్గొన్నారు. ఘంటసాల నిర్మల, కిరణ్‌కుమారి, యండవల్లి భారతి, కొలకలూరి మధుజ్యోతి, శివుని రాజేశ్వరి వంటి ప్రజ్ఞావంతులైన మహిళలు, కోట పురుషోత్తం, రాసాని, శైలకుమార్, నాయని, పేట శ్రీనివాసరెడ్డి, కంపల్లి రవిచంద్ర వంటి ఎందరో రచయితలు, రాజాచంద్ర ఫౌండేషన్ జి.దుర్గాప్రసాద్, విశ్రాంత ఇంజనీర్ ఆర్. జగ్గారావు వంటి ఎందరోప్రముఖులు పాల్గొన్నారు. వారందరికీ పేరుపేరునా ధన్యవాదాలు.

– సం॥



## తాపీ ధర్మారావు

**కనువెలుగు : 19-09-1887**
**కనుమరుగు : 08-05-1973**

జనమాధ్యమాలను జనం
మధ్యకు తెచ్చిన వ్యక్తిగా
తాపీ ధర్మారావు తెలుగుజాతి
చరిత్రలో చిరస్మరణీయ
స్థానాన్ని పొందారు.
పాత పాళీలను తొలగించి
కొత్త పాళీలను తొడిగి
జనం భాషను జనసామాన్యానికి
అందుబాటులోకి తెచ్చిన
అరుదైన సంపాదకుడు.
పత్రికా రంగానికి, సినిమా
రంగానికి ఆయన చేసిన సేవ
సాటిలేనిది. కవి, పండితుడు,
విమర్శకుడు, వ్యాఖ్యాత,
నాటకకర్త, హేతువాది, పత్రికా
సంపాదకుడు, సినీ రచయిత,
సంస్కర్త, ఉద్యమకారుడు
తాపీ ధర్మారావు.
జనమాధ్యమాల వినియోగంలో
తన కలాన్ని పరాక్రమింపజేసిన
ఒక పాత్రికేయుడిని ప్రతి ఏటా
తాపీ ధర్మారావు స్మారక
పురస్కారంతో సత్కరిస్తున్నాము.



ఆర్.ఎం.ఉమామహేశ్వరరావు

## మన్నన

ఉత్తమ పాత్రికేయుడు మాత్రమే కాదు... అత్యుత్తమ కథారచయిత కూడా.
సామాజిక ప్రయోజనమే లక్ష్యంగా పనిచేస్తున్న నిత్య కృషీవలుడు.

వ్రాతల్లోనే కాదు, ఆలోచనలోనూ, ఆచరణలోనూ సంస్కారభావాలుండాలని నమ్మి, ఆ తీరున తన పనిని, జీవితాన్ని సమన్వయం చేసుకొంటూ, ముందుకు సాగుతున్న ఆర్.ఎం.ఉమామహేశ్వరరావుకు ఎవరితోనూ గొడవపడటం నచ్చదు. ఎదుటివారినీ, సమస్యలనూ, అర్థం చేసుకోవడానికి ప్రయత్నించడం ఆయన నైజం. తోటివారిని ప్రోత్సహించడం ఆయన ప్రవృత్తి. ఉమామహేశ్వరరావు స్నేహశీలతే ఎందరో మిత్రులనూ, శ్రేయోభిలాషుల్నీ, అభిమానుల్నీ ఆయనకు చేకూర్చింది.

1986లో 'ఈనాడు'లో సబ్‌ఎడిటర్‌గా మొదలైన పాత్రికేయ జీవితం, 'ఉదయం'లో, 'ఆంధ్రజ్యోతి'లోనూ కొన్నేళ్ళు సాగింది. 1995 నుంచి 2000 దాకా ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధం సంపాదకత్వ బాధ్యతను నిర్వహించారు. తర్వాత తిరుపతి కేంద్రంలో ఎడిషన్ ఇన్‌ఛార్జిగా, న్యూస్ ఎడిటర్‌గా కొనసాగి, ఇప్పుడు రాయలసీమ, నెల్లూరు జిల్లాల పరిధిలో ఎబిఎన్ ఆంధ్రజ్యోతి, ఆంధ్రజ్యోతి దినపత్రిక పర్యవేక్షణ బాధ్యతల్ని నిర్వహిస్తున్నారు. ఇలా ఎదుగుతున్న పాత్రికేయ జీవితంలో తన ప్రత్యేకతను చూపిన సందర్భాలు అనేకం ఉన్నాయి.

నెల్లూరు జిల్లాలో సారా వ్యతిరేక ఉద్యమం తొలిదశ నుండి చివరి వరకూ ఉద్యమం లోతుపాతులను ఉద్యమానికి ఊపిరి పోసిన సంఘటనలను ప్రత్యక్షంగా పరిశీలించి, ఆంధ్రజ్యోతిలో ఆయన వ్రాసిన 'సారాకథలు' ప్రఖ్యాతమైనవి. చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో ప్రత్యేక ఆర్థికమండళ్ల ప్రభావం పైనా, వాటివల్ల గ్రామాల్లోని ఆర్థిక, సామాజిక, కుటుంబ సంబంధాల్లో మొదలైన విధ్వంసం పైనా, వ్యవసాయంపై ప్రభావం పైనా వ్రాసిన కథనాలు సాటిలేనివి. నక్సలైట్ల అజ్ఞాత శిబిరాల్లోకి ప్రయాణించి, గణపతి, మహేష్, ఆర్కే సహా అనేక మందితో ఇంటర్వ్యూలు, అడవుల్లో అజ్ఞాత జీవన శైలిపై ఆయన వ్రాసిన కథనాలూ సంచలనం కలిగించాయి. ప్రత్యేకించి, తెలుగు భాషోద్యమానికి చేదోడు వాదోడుగా ఉమామహేశ్వరరావు ఇస్తున్న తోడ్పాటును కూడా పేర్కొనాలి. తెలుగు మూలాలను వెతుక్కుంటూ తెలుగువాణి సంస్థతో కలిసి తమిళనాడులోనే కాక, పొరుగు దేశాలైన శ్రీలంక, బంగ్లాదేశ్‌లలో కూడా పర్యటించారు. శ్రీలంక మూలవాసుల్లో తెలుగుజాతి గురించీ బంగ్లాదేశ్‌లో తెలుగువారి జీవితాల పైనా ప్రత్యేక కథనాల్ని వెలువరించారు.

ఇదంతా ఒక వైపైతే ఉమామహేశ్వరరావు ప్రతిభకు మరోవైపు– కథా రచన ప్రధానంగా సాహిత్యరంగం ఉంది. వ్రాసిన కథలు సంఖ్యలో తక్కువ. కానీ అవన్నీ చదువరి గుండెలోతుల్ని తాకేవే, ఆలోచింపజేసేవే. బిడ్డలు గల్ల తల్లి, మొగుడూ పెళ్ళాల ప్రేమకత, నోరుగల్ల ఆడది, వొంటేపమాను, ముక్కుపుల్ల, మంచివాడు వాటిలో కొన్ని. కొన్ని కథలు కన్నడ, ఆంగ్లభాషల్లోకి అనువాదం కాగా, కొన్ని పలు కథాసంకలనాల్లోకి వెళ్ళాయి. 'భారతీయ భాషల్లో తొలి కతలు' సంకలనానికీ, 'కథానేపథ్యం' రెండు సంపుటాలకూ సహ సంపాదకత్వం వహించారు. తెలుగు కతలమీద వ్యాసాలను కూడా ఉమామహేశ్వరరావు వ్రాశారు. కొందరు సాహితీ ప్రముఖులతో చేసిన ఇంటర్వ్యూలు ప్రత్యేకతను సంతరించుకొన్నాయి. "తెలుగు కథ.కామ్" వెబ్ పత్రికకు కొన్నాళ్లు సంపాదకుడుగా ఉన్నారు కూడా.

తాపీధర్మారావు జీవితంతో, వ్యక్తిత్వంతో, ఆలోచనారీతితో, రచనలతో సారూప్యత ఉన్న యువ పాత్రికేయుడు, రచయితగానే కాక సంస్కారవంతుడుగా, ఆదర్శజీవిగా తెలుగుజాతి నమ్ముకోదగ్గ వ్యక్తిగా ఆర్.ఎం. ఉమామహేశ్వరరావుకు ఈ పురస్కారాన్ని ఇవ్వడం సముచితమని మేము భావిస్తున్నాం.

శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం,
ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియం, తిరుపతి.
17 అక్టోబరు 2016.

తాపీ ధర్మారావు వేదిక,
9848016136
విజయవాడ.

తాపీ పురస్కార సభ

శ్రీ ఆర్.ఎం. ఉమామహేశ్వరరావు 2016 అక్టోబరు 17న తాపీ ధర్మారావు పురస్కారం' స్వీకరించిన సందర్భంగా చిత్తూరు జిల్లా రచయితల సమాఖ్య సమర్పించిన చిరుకానుక.

**జర్నలిజం వృత్తికి పట్టాభిషేకం కట్టిన 'బంగోరె' వ్యాసం**

# పాఠక మిత్రులకు నిర్గమన నీరాజనాలు - బంగోరె

(ఒక పత్రికకు ఎడిటర్‌గా స్వస్తి పలికే సందర్భంలో బంగోరె పాఠకులతో పంచుకున్న ఆవేదన)

**యూత్** కాంగ్రెస్ ఎడిటర్‌గా నా నూకలు నేటితో చెల్లిపోయాయి. కనుక నిర్గమిస్తున్నాను. గుడ్‌బై చెప్పేముందు ఈ నిర్గమన వేళ నాలుగు మాటలు...

ఈ పత్రికా పాఠకులుగా మీతో పరిచయమేర్పరచుకొని పట్టుమని పదినెల్లు కూడా కాలేదు. వోరుమంటే 50 సంచికల అనుబంధమైనా కాదు మనది.

మీతో నే గడిపిన రోజులు బహు తక్కువ, మీతో నే పలికిన పలుకులు అంతకన్నా తక్కువ, అయినా యివాళ వీడ్కోలు చెప్పి వెళ్ళిపోవడమంటే ఎందుకింత బాధ?

మీకు మరో ఎడిటర్ దొరక్కపోడు, నెల్లూరులో ఎడిటర్లకు కొదవా? నాకు సరిపడే, నేను ఇమడగలిగే పత్రిక మళ్ళీ మరొకటి దొరకడం నాకు కష్టం కావచ్చుగాక! అయినా ఇది తప్పని నిర్ణయం.

నిజమైన జర్నలిస్టుల బ్రతుకులు ఎప్పుడూ ఇట్లాగే ఉంటాయ్. ఆ రకం దేశదిమ్మరినే నేను కూడా, ఎప్పుడూ ఒంటరిగా ఏకాకి మార్గాన్ని వెతుక్కుంటూ వెళ్ళేవాణ్ణి. శక్తిమేర వ్యాఖ్యానించుకుంటూ, రిపోర్టు చేసుకుంటూ వెళ్ళే దేశదిమ్మరులం మేము. నిత్యవార్తలతో నడుస్తున్న చరిత్రాంశాలతో ముడిబడిన వాక్చిత్రాలను చెక్కుకునే అల్ప సంతోషపు శిల్పులం మేము. నిత్యజీవితంలోని సూక్ష్మాంశాల నిజాం శాలమీద ముగ్గు అల్లే గాలిజీవులం మేము. వీలుంటే విశ్వాస లోకనం చేసి చావాలనే అమాయకపు తహతహ గాళ్ళం. ఏమి చేయమంటారు. అది మా జర్నలిస్టుల జాడ్యం. ఏదో గాలిచేతిలో నెట్టబడి, అలవోకగా విసిరేయబడే విత్తనాల గింజలం మేము. చదివిన క్షణంలో ఎలాగో భావస్ఫూర్తిని కల్గించి మరుక్షణంలో మనసులోంచి మాయమైపొయ్యే ఒకపూట సువాసన వెదజల్లి మరుపూట వాడిపొయ్యే పువ్వుల లిపుల్ని అల్లే పిచ్చి మొక్కలం మేము.

విపులాచ పృథ్వీ ఈ రకం బ్రతుకు మా జర్నలిస్టులకు పరిపాటే.

ఈ ఉన్న పది నెలల్లో ఏదో నా శక్త్యానుసారం ఎడిటర్‌గా శ్రమించాను. ప్రమిదలో చమురుపోసి చిరుదీపం వెలిగించినట్లు నా జీవరక్తపు సిరాలో కలాన్ని ముంచి వ్రాసుకొంటూ ఎడిట్ చేసుకొంటూ ఇన్నాళ్ళు ఒంటరిగా నిస్సహాయంగా ఒక్కచేతి మీదుగా పత్రికను నడిపాను. అడపా దడపా సహకరించిన చెయ్యాసరా ఇచ్చిన మిత్రవర్యులకు ధన్యవాదాలు.

చేసేపని చిన్నదైనా వళ్ళు దగ్గర పెట్టుకొని ప్రేమార చేయడం, వ్రాసే వార్త స్థానిక వార్తే అయినా, విశ్వగీతికే అయినా హృదయమిచ్చి వ్రాయడం మినహా మరో బాణీ చేతకాని వాణ్ణి.

అందుకే ఉన్నమేరకు నా గుండెను పిండి తునాతునకలు చేసి మీ ముందు వెదజల్లాను. నా కాంక్షల సంతానాన్ని మీ ముందు దిస మొలతో కేరింతలతో తచ్చాడేలాగున చేశాను. బాధతో గాక, బరువు గుండెతో గాక ఇప్పుడు ఏదో బంధాన్ని అనుబంధాన్ని తెంచుకొని ఎడబాసి పోవాలంటే చేతకావడం లేదు. తృష్ణతో, దప్పికతో తీపెక్కిన హృదయాన్ని విడిచి వెళ్తున్నానా అనిపిస్తున్నది.

అరబ్ కవి ఖలీల్ జిబ్రాన్ అన్నట్లు – it is not a garment. I cast off this day, but a skin that I tear with my own hands. ఇక్కడ కొలిక్కి తగిల్చి పోతున్నది ఏదో మాసిన చొక్కాలాంటిది కాదు, చేతులారా నా చర్మాన్నే చీల్చిపెట్టి పోతున్నానా? చర్మకారుడెవరికైనా ఏ మాత్రం ఉపయోగపడినా మేలే!

---

కవిత

## విశ్వభాష!

**గుర్రాల రమణయ్య**
99939 21943

**రం**గులే అక్షరాలైన భాష
రంగులే భావాలు
పదచిత్రాలైనా, నానుడులైనా
అన్నీ రంగులే!
ఇది రంగుల భాష
హృదయాన్ని, ఉదయాన్ని
ఎర్రెర్రని ఎరుపులో
చావుని నలుపులో
పుట్టుకని తెలుపుతో
వర్ణించే చిత్రభాష
శతాబ్దాల చరిత్రనీ
శబ్దీకరించిన మంత్రాలనీ
వరాలిచ్చే దేవుళ్ళనీ
శపించబడ్డ పూబోణుల్నీ
హరివింటి రంగుల్లో కలబోసి
ప్రణవాన్నీ ప్రళయాన్నీ
ఒకే కాన్వాసుపైన
వివరించి అలరించే వింతభాష
సప్తమాతృకలనుండి
సప్తతి వర్ణసంగమాలని సృష్టించి
కల్పనకు రంగులద్ది
వికల్పముద్రను సాధించే
వర్ణభాష
ప్రకృతినీ, ప్రపంచాన్నీ
జీవంతంగా రచించడానికి
హృదయంలో నెమలిపింఛాన్ని ముంచి
చిత్రంగా ప్రాణంపోసే
ప్రపంచ భాష
కులాలు, మతాలు, జాతులు,
అలంకారాలు
మోకరిల్లే చిత్రికలభాష!

తాపీ పురస్కార సభ

# నేర్చుకుందాము....

–తాపీ సుజాతా షా, 9885021150



**ఆ** కాలం పాత, కొత్తలమధ్య ఘర్షణది. మతపరమైన, సామాజిక పరమైన మూఢవిశ్వాసాలు, సంప్రదాయాలకు నేరని ప్రజలను బలి చేస్తున్న వ్యవస్థలు, వాటి నేవగించుకుని, ప్రజలను కూడదీసుకుని, వాటి నెదిరించిన ఉద్యమాల కాలమది. సాహిత్యం, శాస్త్రీయదృక్పథం సాధనాలుగా ఆ ఉద్యమాలను నడిపిన వీరులకాలమది. వీరు ప్రజలను ప్రగతి బాట పట్టించాలి. అందుకు ఒకరి మాటొకరికి తెలియాలిగా. చూస్తే, ప్రజకీ, ప్రగతికీ మధ్య గ్రాంథికభాష అడ్డుగోడగా ఉంది. దాన్ని కూలదోసి, నిక్కమైన వాడుక భాషలో రాసీ, పలికీ, పురికొలిపారు ప్రజలను. కొత్త ఒరవడి దిద్దారు మహానుభావులు.

అలాంటి కాలంలో బరంపురంలో, 1887 సెప్టెంబర్ 19న, పాతవ్యవస్థకే చెందిన శ్రీమంతుల ఇంట తాపీ ధర్మారావు జన్మించారు. మద్రాసు మెడికల్ కాలేజీలో చదివి, డాక్టరై, అమృతహస్తులని పేరు తెచ్చుకున్న తండ్రి డా॥తాపీ అప్పన్నకీ, పూజలు ముందుపుట్టి, తరువాత తాను పుట్టిన (తాతాజీ మాటల్లో) నర్సమ్మకీ పుట్టిన రెండవ బిడ్డ తను– 'తాపీ?' 'బండారు' నుండి యధాలాపంగా 'తాపీ' లోకి మారిన ఇంటి పేరది. 'శ్రమ' ని గౌరవిస్తూ, మార్చకుండా అలానే దాన్ని కొనసాగించారు.

ధర్మారావుగారికి 'అక్షరాభ్యాసం నాడే తెలుగు పై, అభిమానం కలిగింది'. అది ఒకరు చెప్తే వచ్చింది కాదు. నిజానికి, తెలుగు వద్దనే మాటే, వ్యతిరేకత ఇంట! ఏమంటే, ఆంగ్లభాష, జీవనశైలి వేపే మొగ్గున్న వీరి తండ్రి, వీరి చేతిలో తెలుగు పుస్తకాన్ని చూస్తే ఏమిట్రా అదంతాను? తెలుగు చదువుతూ కూచున్నావు... ఏదేనా ఇంగ్లీష్ పుస్తకం చదువుకో' అని మందిలించేవారు. ఎవరి మాటా, ఏ ఆటుపోటూ వారినుండి తెలుగును వేరుచేసింది లేదు. మరి... చెప్తే వచ్చింది కాదుగా. ఎంపిక తనదైతే ఏదీ కష్టం కాదు. వదిలేది లేదు!

ఆ తండ్రి ఒకనాడు, "బాబాయ్! తములపాకులు నేసుకుంటే నాలుక మొద్దుబారిపోతుంది. చదువురాదు" అని చెప్పగానే మనసుకి పట్టించుకుని, అది లేకుండానే జీవితం గడిపారు.

ఏమాట కామాటే, వదిలేయడమూ ఉంది!

తల్లి నర్సమ్మగారు తొలిగురువు. చిన్న చిన్న పుస్తకాలు, సరళ భాషలో శారదా రామాయణం, హనుమాన్ చాలీసాలు, పురాణ శ్రవణాలు... ఒకనాడామె 'దేవుడి వేపు కాళ్ళు పెట్టావేంటి, తీయ్' అని కోప్పడ్డారు. 'కాళ్ళేపక్క నుంటేనే? దేవుడే పక్క లేడమ్మా?' అని కొంటె ప్రశ్న వేశారు ధర్మారావు. 'ఛీ! చీడగుంటడా! అన్నీ జొన్నకర్ర ప్రశ్నలూ నువ్వూను' అని రెండు వడ్డించారామె. నవ్వుకుంటూ, 'ఇందుగలడందు లేడను...' పద్యం గట్టిగా చదువుతూ. దులుపుకొనెళ్ళి పోయారు.

ఆ బాలుడే అవే 'జొన్నకర్ర' ప్రశ్నలు వేస్తూ, పరిశోధకుడై అసాధారణ అధ్యయనంతో వాటి జవాబులు వెలికి తీస్తూ, తన తెలుగు వారికి ఎన్నో విశేషాలు, చరిత్ర చిత్రాలు ప్రేమగా చిక్కువిప్పి చూపారు. సాధారణ భాషలో, శైలిలో.

జతగాళ్ళతో ఆటల్లో ఒక సాయంత్రం, తండ్రికై తలుపు తట్టిన ఒకరికి 'డాక్టరు గారు లేర' నీ, 'ఎప్పుడొస్తారండీ?' అంటే, 'ఏమో తెలియదనీ' కటువుగా చెప్పారట. అది విని, లోనుండి తల్లి గబగబ వచ్చి, చెవిపట్టుకు 'చీడగుంటడా! అలాగేనా మాటాడేది? త్వరగా వెళ్ళి, వారిని కలిసి, 7గం॥కొస్తారని చెప్ప' మంది.

మర్యాద, మన్నన అపైన ఎన్నడూ వారు మరువలేదు. వయసు, స్థాయి ఏదైనా 'బాబాయ్!' 'బాబూ!' అని ఆదరంగా పలకరిస్తూ, అందరిలో ఒకరై మెలిగారు. తను నడిపిన పత్రిక కార్యాలయాల్లోనూ నలుగురితో కలిసి కూచునే పనిచేసే వారట. ఆధిక్యత చూపటం, పెత్తనం వారెరుగరు.

ఆ ఇంటే, సాటి విద్యార్థులందరూ చేరి, ఏదోఒక విషయంపై చర్చలు (గురువులెవరినైనా న్యాయనిర్ణేతలుగా పిలిచి), నాటక ప్రదర్శనలు (టికెట్ పెట్టిమరీ) దానికి నేపథ్యతెరలు తీర్చేదీ ధర్మారావే. ఒక తోట, నగరం, దర్బారు సీను– వీరు చిత్రించేవారట; రంగు రంగుల క్రోటన్ మొక్కల పెంపకం; తమ ఇంటికొచ్చిపోయే కోడి రామ్మూర్తి (కింగ్ జార్జి 'కలియుగ భీమ' అని బిరుదిచ్చిన వస్తాదు, దేశ భక్తుడు) గారి పరిచయం వల్ల సర్కస్ చూడడం, అన్నగారి అసక్తితో ట్రెపీజ్ వగైరాలతో ఇంట్లో ఫీట్స్ చెయ్యటం, ఒక టీచర్ ప్రభావంతో మాజిక్ షోలు, సైన్సు పరిశోధనలు, దర్జీ పని కాస్త, కాస్త ఊలుతో నిట్టింగ్, కాయితాల గుమ్మటాలు... అన్నిటా ఆసక్తే, ఉత్సాహంగా నేర్చుకోవడమే. ముఖ్యమైన షరతు, చదువులో ఎవరూ వెనక బడరాదన్నది. చదువుకూడా విపరీతంగా చదివేవారట. ఎవరు గీతదాటినా తనబిడ్డ, పరాయమ్మ బిడ్డఅనే తేడా లేకుండా కాయిదా చేసేదిట తల్లి నర్సమ్మ. పనిపాటలకీ ఒంగేవారట ఆ బృందం. పుస్తకాల పురుగులూ కాదు. సోమరులూ కాదు. సిసలైనయువత ఎదగడానికీ, నేర్వడానికీ, విద్యార్థిదశలో ఈ వాతావరణమెంత బాగుండుంటుందో! అడుతూ, పాడుతూ...అందుకే బహుశా వీరు మద్రాసు పచ్చయప్ప విద్యార్థిగా కూడా చీట్లాటలు చిల్లర వేషాల జోలికి పోయింది లేదు. 'నేర్చుకుందాము' అన్న తపనతో కొత్తవిషయాలు నేర్చుకుంటూ, ఒక ప్రణాళికతో చదువుకుంటూ. తన స్థానాన్ని

(ఫస్ట్) నిలబెట్టుకున్నారు. తమిళం నేర్చుకుని 'శిలప్పదికారమ్', మరిన్ని ఇతర గ్రంథాలు చదువుకున్నారు. ఇంగ్లీష్ సాహిత్యంలోని కొత్త ప్రక్రియలెన్నో 'తెలుగులో ఇలా ఉంటే ఎంత బాగుండునో'అని వాటిని ప్రవేశపెట్టారు.

ఉద్యోగిగా కూడా రాచకొలువుల్లో గోల్ఫ్, గుర్రపు స్వారీ, టెన్నిస్ నేర్చుకున్నారు. మంచి చెస్ ఆటగాడు కూడా. గొప్ప గురువు సరేసరి. విద్యార్థి దశలోనూ, లెక్కల మేష్టారుగానూ ఆయన మంచి గురువు. అవును, లెక్కల మేష్టారాయన! తెలుగు పండిట్ కాదు (వృత్తి రీత్యా). ఇవన్నీ 'కవి, విమర్శకుడు, వ్యాఖ్యాత, సంస్కరణ వాది, అభ్యుదయ రచయిత పరిశోధకుడు' పట్టీలో చేర్చాలేమో. ఏమైనా వీరినుండి 'నేర్చుకోవడం' నేర్చుకుందాము. ఏం?

తొలిదశలో వీరు పాతవ్యవస్థకు చెందినవారే. గడ్డు గ్రాంథిక వాది. గిడుగు రామ్మూర్తి పంతులు వీరికి (గ్రేషియన్ హిస్టరీ, రామన్ హిస్టరీ చెప్పేవారు. తెలుగు కాదు) గురువుగారు. మంచి గురు శిష్యుల జోడీ. తర్వాత కొన్నేళ్ళకి (3సం॥లు) ఒక వేదికపై ఆ గురువుతో తలపడ్డారు. గిడుగు వారు వ్యావహారిక భాషావాదిగా ఉపన్యసిస్తే, ఈయన గ్రాంథిక వాదిగా 'చంపక మాలిక' చదివారు. "ఆంధ్రులార ఈ తెలుగును కావబూనుడు, గ్రామ్యమునన్ కలుప బోకుడని, పద్యాలతో, తెలుగువారిని ప్రార్థించారు. గురువుగారికి వ్యతిరేకంగా నిలబడడానికి భయపడ్డారు, సిగ్గువేసింది, వాటిని జయించి నమ్మినదానికై నిలబడ్డారు. ఆనాడు గ్రాంథిక భాషే ఆంధ్రు లకి గర్వకారణమని నమ్మారాయన. అందుకే తలపడ్డారలా.

దాదాపు ఇరవయ్యేళ్ళ తర్వాత, ధర్మారావుగారికీ నమ్మకం 'సరి' కాదనిపించింది. ఒక అలజడి రేగింది. మూడు సంవత్సరాలు కలం పట్టుకోలేదు. ఏ రచనా చెయ్యలేదు. మౌనం, పఠనం, తన చుట్టూ, తనలోకి చూసుకుంటూ గడిపారా కాలం. ఆపై వాడుక భాషే వారి భాషైంది.

"కవులు, ప్రజలెవరైనా వినాలంటే కూచోపెట్టి, పద్యం చెప్పి, అందులో భావం చెప్పినా... ఎక్కుతుందో లేదో..." భాషంటే ఇదా, ఇదేం అక్కర్లేదులే' అనిపించిందాయనకి, "ఎలాగ రాస్తే బాగా తెలుస్తుందో అదే కావాలన్నారు" కలానికి కొత్తపాళీ వేశారు. అలా అని, "పాతదానిని విడిచిపెట్టలేము. పాతది ఉండవలసిందే. అభివృద్ధి అంతా పాతదానిమీద మెరుగే కదా' అన్నారు. అలా ఏ భేషజం లేకుండా గ్రాంథికవాది ధర్మారావు, వాడుక భాషావాది అయ్యారు. పాత కొత్తల కొక మేలు వంతెనయారు. ప్రజలకు మరింత చేరువయారు. వారిలో ఎనలేని చైతన్యం రగిలించగలిగారు. తెలుగు భాష, జీవం తొణికిసలాడుతూ ప్రవహించిందా కలం నుండి.

'వచన కవిత్వం రాస్తున్నారా ఈ మధ్య' అని ఒకరడిగితే "అంతా... నా వచనమంతా కవిత్వమే" అని జవాబిచ్చారు. అక్షరాలా నిజం. అంత బాగుంటుందాయన రచన. తనను తాను సరిదిద్దుకోడా నికి ఎంతో సాహసం, సహనం కావాలి కదా! నేర్చుకుందాము.

శత్రుసేనల్లాంటి దరిద్రం, దోపిడి, తోపిడి, దుఃఖం, చుట్టు ముట్టినా, గొప్ప కొలువులూ, రాచభోగాలూ, ఖాళీ జేబులూ, కంగాళీ గందరగోళాలూ ఎలా ఉన్నా, అవి పరిచిన 'రాలూ, రప్పలూ' తొక్కు కుంటూ ముందుకే నడిచారు. రచనలకవే ప్రేరణలయాయి కూడా. ఇటువంటి కష్టాలు కాక, శ్రీనాథుని 'అవసరాల పట్టీ' కవిత్వానికెలా పనికొస్తుందన్నారు. ఈ శత్రువులనెదిర్చి నిల్చిననాడే గొప్ప కవిత్వం, గొప్ప వ్యక్తిత్వం సాధ్యపడతాయి. ఈ విజేత నిరాశ, చింతలకి లొంగక, వాటిని గేలిచేసి, ఛీత్కరించి, జయించి నిల్చిన స్వాభిమాని. కీర్తి, ధనం కోరని భాగ్యశాలి. కాస్త కన్నీటి భాగ్యమొకటే కోరిందట ఆయన మనసు.... ఏడవ లేనినాడు. 'భిక్షాపాత్ర', "నిరశ్రురోదనము" చదివితే ఈ స్థితి కళ్ళకు కడుతుంది. ఇవి చదువరికి, నిస్పృహకాక ఒక కొత్త ధైర్యం కలిగిస్తాయి. 'కొలిమిలాంటి ఈ కష్టాలే మరి ఖనిజం విలువ, రంగు తెలుస్తాయి. ఆపైన అది ఎన్నటికీ తరగని కాంతులీను తుందని' తన వీపు తనే తట్టుకు నిలబడ్డారు... "బంగారమ్మక్క" (1929)లోని రచనలో.

"బలమైన తాపము గుండెలు బద్దలు చేసిన్నాడు ప్రజలకు అమృతము పంచుతాను. నీరుగారి పోనని" నిండు మబ్బులో బతుకు బరువు చూస్తూ, జీవిత ధ్యేయం సాధించే వీరుల ప్రసన్నతా గుణాన్ని ప్రకటించారు- 'విషాద జలదము'లో. ఇదీ ఈయన తీరు. "... బతుకుచున్నాను జీవచ్ఛవము ఓలె..." అనే రకమే కాదు.

చిన్ని చిన్ని చికాకులకే వికలమైపోతున్న వారెవరేనా ఉంటే మళ్ళొకసారి వీరి రచనలూ, కవితలూ, జీవిత చరిత్ర చదివి చూడండి. కొత్త చూపు, ఊపు తప్పక లభిస్తుంది. ఇప్పటి విద్యార్థులు మొదటి సారిగా వీరిని చదివేవారికి 'నేర్చుకుందాము' అనే మాట జీవితమంతా వినిపిస్తుంది తప్పకుండా, నేర్చుకుందాము....

మద్రాసు పచ్చయ్యప్ప కాలేజీ విద్యార్థిగా బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమాలు చూచినా ఆయన బ్రాహ్మణులను శత్రువులుగా ఎన్నడూ అనుకోలేదు. వారి స్వాభిమానం బ్రాహ్మణ ద్వేషానికి కాక జిజ్ఞాసకు దారితీసింది. బ్రాహ్మణులను కాక "తత్వాన్ని, అలాంటివి సృష్టించిన వ్యవస్థను ద్వేషించాలి, మార్చాలని" అనుకున్నవారు. వారి స్నేహితు లనేకులు, పెద్దకోడలు తాపీరాజమ్మ బ్రాహ్మణులే. వీరితో ఆయన ఎన్నో పంచుకున్నారు ఆయన మనుషుల మనిషి. అందరూ కావాలి.

అందరూ, 'వేగుచుక్క గ్రంథమాల' (1917)లో, తమ ప్రచుర ణలు "పిల్లల కొరకు, బాలుల కొరకు, బాలికల కొరకు, పండితుల కొరకు, పామరుల కొరకు, వర్తకుల కొరకు, సేద్యగాండ్ర కొరకు, సకల జనోపయోగము కొరకని యెంచి, వివిధ కర్తలచే వివిధ విష యాల గూర్చి వ్రాయించుచున్నాము" అని ప్రకటించారు.

పండితులకి మృదువుగా, ధైర్యంగా విషయం చెప్పి, 'తప్పే' అని ఒప్పించిన వ్యక్తి, ఆ తప్పులందరికీ చూపి 'ఇలా చూడాలి. ఇదీ విషయం' అని నిర్లక్ష్యం చేయబడ్డ పూర్వ కవులు, కవితల శక్తి, అందాలు ఒక పూనికతో, ఉద్యమంలా ప్రజలకి పరిచయం చేశారు. 'సాహిత్య మొర్మొరాలు', 'విజయ విలాసం- హృదయోల్లాస వ్యాఖ్య' అందుకు ఉదాహరణ. సరిదిద్దటానికే తప్పులు చూపారు. చిరుగు చూపటానికీ, బురద విసరటానికో కాదు. అదే దృష్టితో సంప్రదాయాల వెనకున్న నిజానిజాలు, కొండొకచో లొసుగులు ముసుగు తీసి చూపారు. ముక్కున వేలేసేలా 'పెళ్ళి దాని పుట్టు పూర్వోత్తరాలు' 'దేవాలయాల మీద బూతుబొమ్మలెందుకు?' 'ఇనుప కచ్చడాలు' లాంటివి మీకు తెలుసు. ఇప్పటికింకా తెలియకపోతే చదివి తెలుసు కోండి. చల్లపల్లి జమీందారు కుమారుడు మల్లికార్జున ప్రసాద్ అక్షరా భ్యాసంలో ఓనమాలు దిద్దించబోతే, 'అక్షరాభ్యాసం లోనే అవక తవకలా' అంటూ అడ్డుబడి 'అ, ఆ' అని దిద్దించారట. వీరిమీది

భక్తితో అలాగే కానిచ్చారట. 'ఓనమాలు' ఒక రచనగా రూపొందింది.

ఈ అవకతవకల్లో ముఖ్యమైంది ఈ దేశంలో బిచ్చగాళ్ళ పుట్టుక అన్నారు. మనుష్యులకు వెళ్ళవలసిన రథాన్ని మతానికెప్పుడు తిప్పారో అపుడే దరిద్ర లక్షణాలు దేశానికి దాపురించాయని దేశపు ముష్టివాళ్ళ తరపున విరుచుకు పడ్డారు. 'పంచుకోవటం' 'దాన'మయి, మతంలో భాగస్వామి అయిందనీ, బిచ్చగాళ్ళు పుట్టుకొచ్చారనీ చెప్పారు. 'ఆలిండియా అడుక్కుతినేవాళ్ళ మహాసభ' లో 'అడుగ జాలని వాడు' అనే సంతకంతో రాసిన కథలు, నవ్వు తెప్పించినట్టే కన్నీరూ తెప్పిస్తాయి. గుచ్చుకుంటాయి.

తెలుగు చదువరుల ఆలోచనలకి పదునుపెట్టేవి, స్ఫూర్తి నింపేవి ఎన్నో కథలు, నాటకాలు, రేడియో నాటికలు, అటు సినీరంగాన వాడుక భాషలో మాటలు, పాటలు, కథ, స్క్రీన్‌ప్లే, కవితలు, విమర్శలు, చరిత్ర కారులై, పరిశోధకులై... వీరెంతటి వారు! వీరిదెంతటి సేవ!

దినపత్రికల ద్వారా పాఠకులలో కలిగించిన చైతన్యం, భావ సంచలనం అపూర్వం. ఆయన నడిపిన దినపత్రికలో పెట్టిన చర్చలకి పాఠకుల స్పందన, ప్రతిస్పందనలెంతకీ ముగియక 'అందరూ చాలా చక్కగా ఆలోచించారు. కోరుకున్నదదే' అని బతిమాలి చర్చను ముగించాల్సి వచ్చిందట, ప్రేమవివాహాలు, జమిలి కుటుంబాలు లాంటివెన్నిటి మీదో చర్చలు, తీర్పులు.

ప్రపంచ రాజకీయ పరిస్థితుల వలన మరికొన్ని మార్పులు. హిట్లర్ రష్యాపై చేసిన దాడి 'ప్రజాయుద్ధం'గా వీరి 'కాగడా' పత్రిక, ప్రజలకు పరిచయం చేసింది. ఫాసిస్ట్ వ్యతిరేకత వ్యాపించింది. దేశవ్యాప్తంగా 'అభ్యుదయ రచయితల సంఘాలేర్పడ్డాయి ఆంధ్రలో 1943 ఫిబ్రవరిలో మొదటి సభ తెనాలిలో జరిగింది- ధర్మారావుగారి అధ్యక్షతన. నాటినుండి వారే దానికి పట్టుకొమ్మ. పత్రికా నిర్వహణలో మొదటినుండీ తోడైఉన్న తాపీ మోహన్రావు. (తొలుత 'విశాలాంధ్ర' తరువాత మద్రాసులో 'సోవియట్ లాండ్ పత్రిక' లో జర్నలిస్టు) ప్రభావంతో కమ్యూనిజం వేపు మొగ్గు చూపారు. అభ్యుదయం. సంస్కరణ, సమదృష్టి ఆయనకు తొలినుండీ ఉన్నవే, 'జనవాణి' సంపాదకీయాలు, శీర్షికలు, సాహిత్యం, ఉద్యమాలు అన్నిటా అదే నిర్భీతి, దీక్ష కానవచ్చేవి. ఆనాటి ఇతర పత్రికలకీ తీరు లేదనే పెద్ద లన్నారు. అందులోని నాటికలు, ఔత్సాహక నాటక సమాజాలు ప్రదర్శించేవి. చిన్నకుమారుడు, లయోలా విద్యార్థి చాణక్య కొన్నిటిని డైరెక్టు చేశారు. తర్వాత కాలంలో ప్రసిద్ధ దర్శకులయిన వారికిది తొలిమెట్టు. పత్రిక కార్యాలయం ట్రిప్లికేన్‌లో వారింట్లో, మోహన్రావు. గదే. హాల్‌లో 'హోరా ప్లాట్‌ఫారమ్' లా ఉండే ఆ రణగొణ ధ్వనిలోనే వారు సినిమాలైనా, 'జనవాణి కైనా రచనలు చేసేవారట నిరుపహతి స్థలాలు, వీవెనలు, విడేలు లేకుండానే...

1950-56 మధ్య సినీరంగంలో వీరి కృషి ఉచ్ఛదశనందింది. 56లో త్యాగరాయనగర్‌లో ఇల్లు కట్టుకున్నారు. 57లో ఎస్.వి. యూనివర్సిటీ సెనేట్ మెంబర్‌గా ఎంపికయారు. 58 జూన్ హైదరాబాద్‌కి. చాణక్య కుటుంబంతో, వచ్చేశారు. నివాసం, కార్యస్థానం మద్రాసు నుండి హైదరాబాద్ బదిలీ అయింది. భాగ్యనగర సాహతీ సంస్థలు వీరి సలహా సంప్రదింపులతో నడవటం మొదలైంది.

ఆయన దాంపత్య జీవితం నుండే దాంపత్యము -శృంగారము అని కవిత రాశారు. అలాంటిదింకొకటి ఉందో లేదో మన సాహిత్యంలో. అర్ధ శతాబ్దం పైగా సాగిన ఆ అన్యోన్య దాంపత్యం 61లో భార్య మరణంతో ముగిసింది. ఒంటరివారైపోయారు. ఎస్.వి. యూనివర్సిటీలో 'అన్నపూర్ణమ్మ' పేర స్కాలర్‌షిప్ ఏర్పాటు చేశారు. అన్నపూర్ణ ప్రచురణలు, తాపీ ప్రచురణలు పేరిట విజయవాడనుండి పుస్తకాలు వెలువరించారు. 66లో సర్వేపల్లి రాధాకృష్ణన్, గిడుగు సీతాపతి, తాపీ ధర్మారావు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ విశిష్ఠ సభ్యులుగా ఎన్నికయారు.

గడ్డు గ్రాంథికం నుండి పూర్తివాడుక భాషలోకి మార్చాల్సిందింకొకటి మిగిలిఉంది. అది ఆయన నలభైఏళ్ళ కిందట గ్రాంథికంలో రాసి ఉంచిన విజయవిలాస వ్యాఖ్యానము (చేమకూర కవి విజయ విలాసము) వార్ధక్యంలో, ఉత్సాహమున్నా దానికయే వ్యయప్రయాసలు వారిని వెనకాడేట్టు చేశాయి. దేవులపల్లి రామానుజంగారు, బి. రామ రాజుగారు, తాపీ మోహనరావు గట్టిపట్టు పట్టడంతో దాని బూజు దులిపారు. వడగళ్ళ వానలాంటి అనేక ఆటంకాలు, అనారోగ్యం అధిగమించి 'హృదయోల్లాస వ్యాఖ్య'గా సాహితీలోకాని కందించ గలిగారు. అంతా తిరగరాయడమదెంత కష్టమో కదా. '71లో ఈ వ్యాఖ్యానానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చింది. ఢిల్లీ కెళ్ళి అవార్డు అందుకోలేని అరోగ్య పరిస్థితి. వెళ్ళలేదు. 72లో బర్కత్ పురా యువతీ మండలి భవనంలో, ప్రత్యేక సభలో వారికా అవార్డును అందజేశారు. నగరంలోని 30 కళాసంఘాలు సత్కరించి పండుగలా సంబరం పంచుకున్నాయి.

వారు చేసిన ఆఖరి సంస్కరణ వివాహం- తాపీ మోహన్రావు కుమార్తె విమల, డా॥ సోహన్‌సింగ్ లది- మునుపు తరిమెల నాగిరెడ్డి కుమార్తె- కె.కె. రంగాచార్యులు, నిర్మల- త్రిపురనేని సుబ్బారావు, ఫోటోగ్రాఫర్ చంద్రం కుమార్తె, వి. హనుమంతరావు- సరళ, తన మనుమరాలు చాణక్య కుమార్తె జోయ-లక్ష్మణ్‌లది, అహోబలరావు గారి సంతానము వారి అశీస్సులు పొందినవారే. కేవలం దండలు మార్చుకుని సంస్కరణ వివాహం ముగించి, విమల వివాహానంతరం కొత్త దంపతులతో (వివాహం విజయవాడ, విశాలాంధ్ర ప్రాంగణంలో) మద్రాసు చేరారు. 'ఆంధ్ర కల్చరల్ క్లబ్' లో జస్టిస్ రాజ మన్నార్ అధ్యక్షతన, సాహితీ, సినీ కళాకారులు గొప్ప సన్మానసభ ఏర్పాటు చేశారు. అదే మద్రాసుకి వారి ఆఖరి రాక తెచ్చిఇచ్చిన ఆఖరి పండుగ.

ఈ మనిషిలోని ఇంకో విశేషం "అతనొక మంచి బిడ్డ, భర్త, తండ్రి, తాత, బంధువు, ఆత్మబంధువు. 'మంచి' అంటే కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ, మీ స్వేచ్ఛ కద్దుకాకుండానే గట్టితోడు కాగలిగినవారు. తరాల అంతరాలెరుగని పసివాళ్ళ తీరేదో ఉంది. చెట్టున పండిన పండులాంటి శ్రేష్ఠత కూడా ఉంది ఆయనలో.

ఒకసారి మనాలిలో ఒక మజిలీ. విరివిగా పండిన ఆపిల్ పండ్ల చెట్టు, మాలి, మాకు చేతులు పట్టనన్ని పళ్ళు ఇస్తూ ఇంద రుచి చూడ' మని చేతులు, కొంగులు నింపేశాడు తియ్యని పళ్ళతో,

తాతయ్య తెలుగు ప్రజలకు, అలానే, రెండుచేతులా అలాంటి సాహితీ సంపద నిచ్చారు.

ఆ కాగడా పూని యువత కొత్తవెలుగులు, తెన్నులు చూపాలిక. చివరగా, డా॥ కొత్తపల్లి వీరభద్రరావు గారు జరిపిన ఆఖరి ఇంటర్వ్యూలో (72జూలై, హైదరాబాద్) 'కొత్త'లో ఒక 'పాతదోషం' ఇంకా

కనిపిస్తూందన్నారు. అది 'పునరుక్తి' దోషం. చెప్పిందే చెప్పటం. ఒకరిది చూస్తే, ఇంకొకరిది చూడనక్కరలేని అనుకరణ. సాహిత్యం, జీవితం ఏ కోణమైనా 'మంది' మనస్తత్వంతో కాక 'మనది' అన్నశైలితో సాగితే ఎక్కువ విలువున్న ప్రయోజనం సిద్ధిస్తుంది. అందుకు, విషయం తెలుసుకుని, స్వంతం చేసుకుని, పూర్తిగా అర్థం చేసుకుని, నమ్మకం కలిగాక మనస్ఫూర్తిగా చెప్పగలగాలి, ఉట్టినే ఒప్పజెప్పడం కాక.

ఈ నిజాయితీ లక్షణంగా యువత ఉంటే యువత లక్షణంగా ఉంటుంది- గొర్రెదాటు స్వభావాలు గొర్రెలకొదిలేసి.

బుద్ధిజీవులు ప్రగతిలై మోసం, ద్వేషం లేని సమాజాలు, సమూహాల్లకై ప్రతి నిమిషం కలగంటూ, సాకారం చేసుకుంటూ మనగలిగితే...

శ్రమనీ, అవిశ్రాంత జీవనాన్నీ, క్షమనీ, స్వేచ్ఛ, స్వాభిమానాన్నీ కొనసాగిస్తూనే జీవితంలో అవి పరిచే రాలూ, రప్పల్ని తొక్కుకుంటూ ముందుకు నడువగలిగితే... ఆ గమనం సార్థకమవుతుంది.

నిర్భీతి, ప్రేమ, దీక్షతో కొత్త కొత్త పాఠాలు గ్రహిస్తే ఆ జ్ఞానం శాశ్వత ఫలిమిస్తుంది.

ఇది అందరూ చేయగలిగిందే కొందరు ధర్మారావు లవుతారు, మరిన్ని వేలమందికి స్ఫూర్తిగా. అది తర్వాతి విషయం.

"నడక ప్రధానం, గమ్యం కన్నా
ముందది నేర్చుకుందాము "

(అక్టోబరు 17న ప్రసంగవ్యాసం)

## ఆఖరి అర్జీ

కవిత

-మందరపు హైమవతి

**చి**న్నప్పుడు అమ్మచంకనెత్తుకొని
తినిపించిన గోరుముద్దల్లా
పెద్దయినాక చందమామను చూస్తూ
వెన్నెల్లో తిన్న పాలబువ్వలా
కమ్మనైనది అమ్మ భాష
జీవశాస్త్రమైనా సాంఘిక శాస్త్రమైనా
గణితమైనా తల్లిభాషలో బోధిస్తేనే కదా
మనసు అద్దంపై హత్తుకొనేది

**అ**ప్పటి వరకు తెలుగు మాధ్యమంలో
నల్లేరు మీద బండిలా సాగిన నా చదువు
ఆంగ్లమాధ్యమంలో అడుగుపెట్టేసరికి
రాతికింద నలిగిన గింజలా మనసులో అలజడి
ఇల్లువదలి బయటకు వెళ్ళడం అలవాటు లేనపుడు
ఒక్కసారి పొరుగూరు వెళ్ళి తప్పిపోయినట్లు
అంతా అయోమయం గందరగోళం

**అ**ర్థం కావడం లేదని ఎంత చెప్పినా
అర్థం చేసికోని తల్లిదండ్రులొక పక్కా
మార్కుల కోసం వేధించే ఉపాధ్యాయాసురు లొకపక్క
చిత్రహింసల యంత్రంలో నన్ను గిరగిరా తిప్పినప్పుడు
ఎవరితో మొరపెట్టుకోను నా కన్నీటి కథ

**మా** అమ్మంటే నాకు ప్రాణం
మా అమ్మ భాషంటే అంతకంటే ప్రాణం
వేమన 'ఉప్పుకప్పురంబు'
బద్దెన "అడిగిన జీతం బియ్యని"
శ్రీశ్రీ "శైశవ గీతుల" పద్యమాధుర్యడోలలో
ఊగుతూ పరవశిస్తున్నపుడు
ఇంటాబయటా అవహేళనలు చేస్తూ
ఆంగ్లభాషా మహత్యం గురించి మహోపన్యాసాలు

**వి**రజాజి పువ్వులా సుకుమారమైన నేను
కర్కశమైన ఉరితాడుకు చిక్కుకొని
కమిలి పోయినపుడు
నేనొక బాధాగీతాన్ని
నావృత్తాంతం విని
ఎవరూ సానుభూతి గీతాలు కానక్కర లేదు

సమాధుల్లో శవాలని గుర్తుకుతెచ్చే
మమ్మీల పిలుపు లెందుకు
అమృతోపవశానమైన
'అమ్మా' అనే పిలుపులే ముద్దు
సాక్షివ్యాసాల సాక్షిగా ఇకనైనా
మాట్లాడండి తీయని తెలుగులో
ప్రవహించే నదిలాంటి తెలుగు భాషకు
పోయండి ప్రాణం
ఎవరూ మాటలాడక
పాచిపట్టిన చెరువునీటిలా
భావించకండి భాషనెపుడు
మాతృభాషను మన్నించండి
అమ్మానాన్నలా రా! ఇదే నా ఆఖరి అర్జీ.

*(వరంగల్లులో 7 వరకు తెలుగు మీడియంలో చదివి, 8వ తరగతిలో ఇంగ్లీషు మీడియంలో చేరినపుడు, పాఠాలు అర్థంగాక, ఆత్మహత్య చేసికొన్న 'రమ్య' వృత్తాంతం చదివి...)*

తాపీ పురస్కార సభ

# తాపీ వారసత్వం- ఉమా వ్యక్తిత్వం



డా॥మధురాంతకం నరేంద్ర
9866243659

"పెదవి దాటితే పృధివి దాటుతుందన్న సంయమం, ఆ సంయమమూ యెప్పుడైనా వడలుతుందేమోనన్నట్లు తరుచు చుట్ట బిగింపు ముక్తసరిగా సూత్రప్రాయమైన మాటతీరు; న్యాయంకోసం ఎంతటి వారినైనా ఎదిరించగల దిట్టతనం, తన భావాలను ఎదుటి వారికి సౌమ్యంగానైనా కచ్చితంగా చెప్పే కరకుతనం, మతభేదం కలిగినప్పుడు కుమారుణ్ణైగాదు, మరొకరినైనా సహించగల ఔదార్యం; తెలియని ఏ చిన్న విషయమైనా ఏ చిన్నవాడు తెలిపినా స్వీకరించే సరసత; పరస్పరం పోటీలు పడి జీవితం నడిపిన జిజ్ఞాసా పరిశ్రమలు; తప్పని తెలిసిన తర్వాత చప్పున సవరించుకుని ముందడుగువేసే గుండెనిబ్బరం; శత్రుత్వంతో సమీపించిన వారినైనా మిత్రులనుగా మార్చే సరళతర ప్రవర్తన, కీర్తికోసం కాని, కాంచనం కోసం కాని కక్కుర్తి పడని ఉదాత్తత; పాండిత్య ప్రకర్షకోసం కాక పరిశోధితాంశాలు పదిమందికీ తెలియ జేయడానికి చేపట్టిన రచనాదీక్ష ; గడ్డంతో పాటే అందంగా పెరిగిన అంతరంగం; తాత్సారమేమో నన్నంతగా ఒకోకప్పుడు తలపింపజేసే తాపీతనం- ఈ ధర్మాలన్నీ సమపాళాలుగా పోత పోసిన వ్యక్తిత్వం శ్రీతాపీ ధర్మారావు గారిది అంటే- పలురంగాలలో పాతకొత్తలకు పసిడి వంతెన వంటి- వారిని గురించి శాఖా చంద్ర న్యాయంగా చెప్పినట్టవుతుంది"

"మరపురాని మనీషి" శీర్షికతో నాటి ప్రముఖ తెలుగు ప్రముఖుల్ని పరిచయం చేసిన తిరుమల రామచంద్రగారు తాపీ ధర్మారావు గారి వ్యక్తిత్వాన్ని పటంగట్టిన తీరది.

వ్యావహారిక భాషావికాసానికీ, వ్యాసరచనా విన్యాసానికీ, కావ్య వ్యాఖ్యాన చమత్కృతికీ, పత్రికా సంపాదక ప్రతిభకూ ప్రచురణ సంస్థల నిర్వహణకూ, అభ్యుదయ సభా నిర్మాణానికీ, సినిమా రచన విలాసానికీ తాపీ ధర్మారావుగారు మారుపేరు. ఆయా రంగాలన్నింటిలోనూ ఆయన వైతాళికుడు. అటువంటి బహుముఖ ప్రజ్ఞాశాలి పేరుతో యిచ్చే పురస్కారానికి యువ పత్రికా రచయిత, పాత్రికేయుడు, కథకుడు ఆర్.ఎం.ఉమామహేశ్వరరావును యెన్నుకోవడం సముచితమైన నిర్ణయం.

52 సంవత్సరాల ఉమామహేశ్వరరావు అమాయకుడు, గడుసరి గూడా! 1992లో ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక నిర్వహించిన కథల పోటీలో ఆయన కథ 'నోరుగల ఆడది'కి బహుమతి వచ్చినపుడు తొలిసారిగా ఆయన తెలుగు కథానికా ప్రపంచానికి పరిచయమయ్యాడు. ఆ తరువాత దాదాపు యేడాది కొకటిగా ఆయన కథలు మంచివాడు, మొగుడూ పెళ్లాల ప్రేమకథ, బిడ్డలు గల తల్లి, ఒంటేపమాను మొదలైనవి యేడు వరకూ ప్రచురించబడ్డాయి. జానపద కథల్లో సంవత్సరానికొక గుడ్డు మాత్రం పెట్టే గండ భేరుండ పక్షిలా సంవత్సరానికొక కథ మాత్రమే రాస్తున్నందుకు ఉమామహేశ్వరరావును మిత్రులు యెద్దేవా చేసినందుకు ఫలితం, ఆ తరువాత ఆయన కథలు రాయడం దాదాపుగా మానేయడమే. అయితే అలా మానేయడానికి రెండు కారణాలున్నాయి.

**మొదటి కారణం :** కథ రాయడమన్నది ఉమామహేశ్వరరావుగారికి నిర్మోహంగా, యాంత్రికంగా చేసే పనిగాదు. పాత్రలతో మమేకం గాకపోతే, సంఘర్షణతో తాద్యాత్మ్యం గాలేకపోతే, ఆయన కథరాయలేదు. కథ రాయడమంటే ఆయనకు తన శరీరశకలాన్ని శస్త్ర చికిత్స చేసి పక్కకు తీసి మరో జీవిని తయారు చేయడమన్న ప్రక్రియే! అందుకే కథ రాస్తున్నప్పుడు ఆయన చిత్రహింసకు గురయినట్టుగా విలవిలలాడి పోవడం జరుగుతుంది. ఒక కథ పుట్టుకొచ్చినప్పుడు జీవన్మరణ పోరాట మొకటి జరిగి తీరుతుంది. అందుకే ఆయన కథారచనను యెప్పటికప్పుడు వాయిదా వేసుకుంటాడని ఆత్మీయ మిత్రులకు మాత్రమే తెలుసు.

**రెండవ కారణం :** ఉమామహేశ్వరరావుకు సాహిత్యం రెండవ యిష్టం. ఆయన మొదటి యిష్టం పాత్రికేయం. ముందుగా పాత్రికేయవృత్తి, సాహిత్య సంచికల సంపాదకత్వానికీ, వార్తాపత్రికల సంపాదకత్వానికీ, దూరదర్శన్ కార్యక్రమాల నిర్వహణ వరకూ కొనసాగింది.

ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధాల నిర్వహణ ఉమామహేశ్వరరావు సంపాదకత్వంలో సాగిన కాలం కథానికా యుగంలో చాలా ముఖ్యమైన పాత్రను పోషించింది. సాహిత్య సంపాదకుడుగా ఆయనది విలక్షణ వినూత్న ధోరణి (Avantegarde). కొత్తగొంతులంటేనూ, కొత్త రచయితలంటేనూ ఉమామహేశ్వరరావుకి వలపక్షం. ప్రసిద్ధులైన రచయితలపైన గౌరవ ప్రపత్తులు కూడా అంతే వున్నాయి. రచననూ, రచయితనూ, దాని వెనకుండే మనిషినీ, వేర్వేరుగా గమనించగల నైపుణ్యం ఆయనకు సహజంగా అబ్బింది. తాను స్వంతగా కనిపెట్టగలిగానన్న కథకులపైన ఆయనకు మరింత యెక్కువ వలపక్షం వుండేది. అందుకే ఆయనకు సమవయస్కులూ, తనకంటే పెద్దవాళ్లూ గూడా అయిన కథకులు చాలామంది ఆయనకు గురుస్థానమిస్తూ వుంటారు.

చేస్తున్న పని వ్యక్తిని మారుస్తుందనడానికి గూడా ఉమామహేశ్వరరావు ఉదాహరణగా కనబడతాడు. సాహిత్య సంపాదకుడుగా వుంటూ క్రమంగా ఆయన లిఖిత ప్రతులపైన ప్రేమలో పడిపోయారు. ముద్రిత రచనలకంటే ఆయన లిఖిత ప్రతులంటేనే యెక్కువ ప్రేమ, గౌరవమూ. ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధాల సంపాదకుడుగా వున్నప్పుడు ఆ పత్రికలో చాలా మంచిపనులూ, కొత్త ఆవిష్కరణలూ

జరిగాయి. తెలుగువాళ్లకు సాహిత్య పత్రిక లేదని అందరమూ బాధ పడుతున్నాం. యెప్పటికైనా తెలుగులో సాహిత్య పత్రిక పుట్టుకొస్తే దానికి ఉమామహేశ్వరరావు తగిన సంపాదకుడుగా కనిపిస్తాడు.

ఉమామహేశ్వరరావును ప్రత్యక్షంగా తెలిసిన మిత్రులకు ఆయన పెద్ద 'అమ్మకూచి' అని తెలుసు. చాలా చిన్నప్పుడు అమ్మ కొంగు పట్టుకుని తాయిలం తింటూ తిరిగిన రోజుల్నే ఆయనెప్పుడూ ప్రేమగా కలవరిస్తూంటాడు. పెద్దయ్యాక గూడా వాళ్లమ్మతో అలాగే తిరగడానికి ప్రయత్నించేవాడు. అందుకే ఆయన స్వాభావికంగా స్త్రీవాద రచయిత య్యారు. 'నోరుగల ఆడది' 'బిడ్డలుగల తల్లి' రెండూ ఆయన వ్యక్తిత్వపు పార్శ్వాలే! యెప్పుడూ సమతౌల్యంగా జీవించే ఉమామహేశ్వరరావు అమ్మ గురించిన రచనలపట్ల మాత్రం ఆ వైపుకు నిర్హేతుకంగా వొరిగి పోతాడు.

అయితే ప్రపంచానికి తెలియని విషయమేమిటంటే, ఆయన 'నాన్నకూచి' గూడా! గ్రామీణ జర్నలిస్టుగా పని చేసిన తనతండ్రి ఉమామహేశ్వరరావుకు గొప్ప ఆదర్శం. వాళ్లింట్లో వాళ్లనాన్నగారు బనీనుతో కూర్చుని రాసుకుంటున్న ఫోటో హాల్లోనే దర్శనమిస్తుంది. అమ్మతనంలోని హృదయాన్నీ, తండ్రి తనంలోని మనోధైర్యాన్నీ ఆయ నలో స్పష్టంగా చూడవచ్చు.

సాహితీజీవి ఉమామహేశ్వరరావు ఎప్పుడూ ప్రజాపక్షపాతి. శ్రామిక జనంపైననే ఆయన గౌరవమంతా. చిన్నతనంలో వామపక్ష రాజకీయాల్లో తిరిగినవాడు. పత్రికా సంపాదకుడుగా సమాకాలీన రాజకీయాలకు చెందిన వ్యక్తులతోనూ, వ్యాపారవేత్తలతోనూ తిరగ వలసిన అవసరం వచ్చిన ఆ సంబంధాలను నాజూకుగా మార్చుకో గలిగిన వాడతను. సారా వ్యతిరేక ఉద్యమం జరుగుతున్నప్పుడు ఆంధ్రజ్యోతిలో ఆయన వరసగా రాసిన కథనాలూ, ముఖాముఖి చర్చల వెనకున్న కంఠస్వరం స్పష్టంగా వినబడుతుంది.

ప్రత్యేక ఆర్థిక మండళ్లు చేసిన విధ్వంసాల గురించిన ఆయన కథనాలు సంచనాలు రేపాయి. యింటర్వ్యూలివ్వడానికి తీవ్రవాదులు గూడా ఆయన్నే నమ్మి యెంచుకున్నారు. స.వెం.రమేశ్‌తో కలిసి తెలుగువాళ్ల మూలాల్ని వెతుక్కుంటూ శ్రీలంక, బంగ్లాదేశ్‌లకు వెళ్లొ చ్చాడు. నరసింగరాయని పేట (చిత్తూరు జిల్లా) లో శ్రీలంక చివరి రాజుల ఆచూకీ వెలికితీశాడు. యే మంచి కథా సంకలనం, సంపుటం వెలువడాలన్నా, దానికి కావల్సినంత స్నేహహస్తం అందిస్తూ వస్తు న్నారు. పాలగుమ్మి సాయినాథ్ యిచ్చే పాత్రికేయ బహుమానం వరకూ చాలాకాలం క్రితమే యెదిగినవాడు.

తాపీ ధర్మారావు గారిని గురించి చెబుతూ ఆయన మనవరాలు సుజాతాషా గారు తమ తాత మంచి నాన్న, మంచి తాత గూడా అని చెప్పారు. ఉమామహేశ్వరరావు గూడా వొక కుటుంబీకుడు యెన్ని పాత్రల్ని పోషించాలో అన్ని పాత్రల్లోనూ సహజంగా వొదిగి, అన్నింటిలోనూ మంచివాడుగా గుర్తింపబడుతూ వున్నాడు. ఆయన మంచి మిత్రుడు, మంచిమనిషి.

తాపీ ధర్మారావు గారిని గురించి తిరుమల రామచంద్రగారు చెప్పిన మాటల్ని యీ కాలానికి సరిపోయేలా మారిస్తే, ఆ మాటలు ఉమామహేశ్వరరావు గారికీ సరిగ్గా సరిపోతాయి.

*(17 అక్టోబరు 2016న తిరుపతిలో జరిగిన సభలో ఆర్.ఎం. ఉమామహేశ్వరరావు గారికి తాపీ ధర్మారావు పురస్కారాన్ని అందించిన సందర్భంగా చేసిన ప్రసంగానికి వ్యాసరూపం)*

కవిత

# లోయ

**-డా॥ఎన్.గోపి**

అగాధం అనేది చిన్నమాట
అది అనూహ్యం

ఆ లోతును కొలవడానికి
ఏ కలమూ చాలదు
లోతులకు సారిస్తే
చూపులు తెగిపోతాయి

అలవి గాని
ఆ సౌందర్యంలోకి
ఓ రాయి విసిరాను
చెట్ల ఆకులను స్పృశిస్తూ
కొమ్మలపై దొర్లుతూ వెళ్తుంది
నిశ్శబ్దాన్ని పీల్చుకుంటూ
సమస్త జంతుజాలాన్ని
ఉలిక్కిపాటుకు గురిచేస్తుంది
వేల సంవత్సరాలను చీల్చుకుంటూ
ఎక్కడికి చేరుతుందో తెలియదు

ఇంతకూ
నేను విసిరింది రాయేనా
దానిపై నా అరచేతి ముద్రలున్నాయి
దాని అణువుల్లో
నా రక్తనాళాల వెచ్చదనముంది
ఏనాటి బంధమో
లోయ నోరు తెరుచుకొని
మగతగా చూస్తున్నది
చప్పుడు వినిపిస్తుందేమోనని
కాసేపు వేచి చూశాను
తడుముకుంటే
నాలోంచే ఏవో శబ్దాలు
అస్తిత్వంలోకి విసిరిన రాయి
అలా అలా వెళ్తూనే వుంది.

ఏ రాష్ట్రంలో ఉన్నా, ఏ దేశంలో ఉన్నా
తెలుగువాళ్ళంతా ఒక్కటే..
తెలుగులో సంతకం...
తెలుగుదనానికి సంకేతం

జాతి సాంస్కృతిక పతాక -మాతృభాష

తాపీ పురస్కార సభ

# తాత నడిచిన తోవలో...




**ఆర్.ఎం.ఉమామహేశ్వరరావు**

**తా**పీ ధర్మారావు పురస్కారాన్ని అందుకుని, ఇక్కడ ఇలా ఇంత మందితో సంతోషాన్ని పంచుకునే అవకాశం కల్పించిన తాపీ ధర్మారావు వేదికకు ముందుగా నా నమస్కారాలు. పత్రికా రచయితగా ఈ గౌరవాన్ని పొందడానికి కారణం, తొలి స్ఫూర్తి మా నాన్న, ఆర్ఎం ఆంజనేయులు. గ్రామీణ జర్నలిస్టు. ఆయన మాకు దూరమై పదిహేడేళ్ళు, యాధృచ్ఛికమే అయినా ఇదే నెల, ఇదే రోజు. ఇంకా అమ్మ, అన్న, వదిన.. నా ప్రయాణంలోని ప్రతి మెట్టుకూ ఆనందపడేవాళ్ళు, సంబరపడేవాళ్ళు. ఈ నలుగురూ ఇప్పుడు లేరు, వెళ్ళిపోయారు, తొందరపడి. గుండెల నిండా తడి తలపులతో ఈ క్షణం మీ ముందు నిలబడ్డాను. ఈ సందర్భంలో నా మిత్రులు ఎందరో గుర్తుకొస్తున్నారు, నన్ను వేలు పట్టుకుని నడిపించినవాళ్ళు, నాతో కలిసి నడిచినవాళ్ళు. నండూరి రామమోహనరావు గారు, ఏబీకే ప్రసాద్ గారు, కెవెన్వై పతంజలి గారు, కె రామచంద్రమూర్తి గారు. కె శ్రీనివాస్, వర్ధెల్లి మురళి, అల్లం నారాయణ, మానుకొండ నాగేశ్వరరావు, గోపాల కృష్ణ, శ్రీనివాసరావు, వి శ్రీనివాస్, కట్టా శేఖర్‌రెడ్డి, కృష్ణప్రసాద్, జి రామాంజనేయులు, ఖదీర్‌బాబు, లేపాక్షి, అక్బర్, పసుపులేటి గీత ఇంకా ఎందరో వీళ్ళందరినీ గుర్తు చేసుకుంటున్నాను. నా పొగరుని ఇష్టంగా భరిస్తున్న ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ గారికి నేను ప్రత్యేకంగా ధన్యవాదాలు చెప్పుకోవాలి. అలనాటి ఆంధ్రజ్యోతి ఎండీ జగదీష్ ప్రసాద్ గారు, జీఎం శ్రీనివాస్ గారు.. నాకు ఊతం ఇచ్చిన ఎందరో. అందరికీ వందనాలు.

తాపీ ధర్మారావు జర్నలిస్టా? అని కాసేపటి కిందటే నామిని ఆశ్చర్యంగా అడిగాడు. నిజానికి నిన్నా మొన్నటి దాకా ఆయన పాత్రికేయ జీవితం గురించి నాకు కూడా ఏమీ తెలీదు. ఇంటర్మీడియెట్ చదివే రోజుల్లో ఆయన రాసిన 'దేవాలయాల్లో బూతుబొమ్మలు ఎందుకు?', 'పెళ్ళి దాని పుట్టు పూర్వోత్తరాలు', 'ఇనుప కచ్చడాలు' చదివాను. అంతే తెలుసు ఆయన గురించి. నాగసూరి వేణుగోపాల్, డాక్టర్ సామల రమేశ్‌బాబుల సంపాదకత్వంలో వెలువడ్డ 'చెరగని స్ఫూర్తి తాపీ ధర్మారావు' అనే పుస్తకం చదివేదాకా ఆయన జీవితంలోని అతి ముఖ్యమైన పాత్రికేయ పార్శ్వం గురించి నాకు తెలియనేలేదు. ఆ పుస్తకంలో కత్తి పద్మారావు వ్యాసం చదివాక గానీ, ఈ తెలియని తనం నా అజ్ఞానమో, అమాయకత్వమో మాత్రమే కాదనీ, దీని వెనుక ఒక కుట్ర ఉందనీ తోచలేదు. అవును అక్షరానికి కూడా కులం ఉంది. దొంతర్లు దొంతర్లుగా పేర్చిన వ్యవస్థలో బతుకుతున్నవాళ్ళం. ఎన్నో మోయాలి. ఎన్నో భరించాలి. చాకచక్యంగా ఎన్నో తప్పించుకోవాలి. ఇలానే బతికాడు ఆయన. పొగరుగా, ధిక్కారంగా, నిటారుగా.

తాపీ ధర్మారావు అసంపూర్ణ ఆత్మకథ 'రాలూ రప్పలూ' నుంచి కొంతా, మనుమరాలు సుజాతాషా తాతయ్య గురించి చెప్పిన కబుర్లూ, కోడలు రాజమ్మ జ్ఞాపకాలూ, ఇంకా ఎందరివో వ్యాసాలు గుదిగుచ్చి అందించిన పుస్తకం 'చెరగని స్ఫూర్తి తాపీ ధర్మారావు'. ఈ పుస్తకం చదువుతూ ఉంటే 30 ఏళ్ల నా పాత్రికేయ ప్రయాణంలో ఎన్నో సందర్భాలు గుర్తుకొచ్చాయి. పుస్తకం పూర్తయ్యేప్పటికి ఆయనను హృదయమారా హత్తుకున్నట్టు అనిపించింది. తెలియని బంధమేదో ఆ పెద్దాయనతో పెనవేసుకుని ఉన్నట్టు అర్థమైంది. ఆయన పేరుతో ఉన్న పురస్కారాన్ని అందుకోవడానికి నాకు ఉన్న అర్హతకు బహుశా ఇవి గీటురాళ్ళు. తాపీ ధర్మారావు మనుమరాలి సమక్షంలో అందుకున్న పురస్కారంతో, ఆయనకు లాగే పూల అంచు శాలువాను భుజాల చుట్టూ కప్పుకుని మీ ముందు నిలబడ్డ ఈ క్షణాన.. పత్రికా ప్రపంచంలోకి అడుగు పెట్టిన నా తొలి రోజులు గుర్తుకొస్తున్నాయి. కాలం వేరైనా సారూప్యం ఉన్న అనుభవాలు. కొన్ని గుర్తు చేసుకుంటాను.

నెల్లూరు జిల్లా సూళ్ళూరుపేట ప్రభుత్వ కాలేజీలో నా డిగ్రీ పూర్తయింది. నాన్న నడిపిన 'కళాచిత్ర' నెల పత్రిక మూతబడింది. పాత్రికేయ అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి ఆయన ఈనాడు విలేకరిగా మారాడు. తుప్పు తేలిన గాద్రెజ్ కుర్చీలో కూర్చుని పరీక్ష రాస్తున్నంత శ్రద్ధగా ఆయన రోజూ వార్తలు రాసేవాడు. రాసేటపుడు ఆయన దృష్టి అంతా న్యూస్‌ప్రింట్ మీద కదిలే ఇంకు పెనా పాళీ మీదే ఉండేది. మనసులో భగవద్గీతను మననం చేసుకుంటున్నట్టుగా ఆయన పెదవులు, రాస్తున్న వార్తలోని వాక్యాలను ఉచ్చరిస్తూ ఉండేవి. చిన్న వార్తను కూడా నాలుగు సార్లు తిరగరాసి కవరులో పెట్టి తిరుపతి బస్సు కోసం టీ బంకు ముందు గంటలకు గంటలు ఎదురు చూసేవాడు. ఆయన అటు వెళ్ళగానే రాసి రాసి చించి పారేసిన కాయితాల్లోని అద్భుతాల కోసం ఆత్రంగా వెతుకులాడేవాడిని. తడికల కింద నడిచే బడి గురించో, కాళంగి యేటిలో కొట్టుకుపోయిన మనిషి గురించో రాసిన చిట్టి పొట్టి వార్తలు అవి, అంతే. బహుశా అప్పుడే ఆ అక్షరాలు నాలోలోతుల్లో నాటుకున్నాయి బలంగా.

ఒక రోజు నాన్న నన్ను బస్కెక్కించి తిరుపతికి తీసుకువెళ్ళాడు. రేణిగుంట దగ్గర ఈనాడు ఆఫీసు. డెస్క్ ఇన్‌చార్జి నవీన్. పొట్టిగా, సన్నగా, నల్లగా, చురుగ్గా ఉన్నాడు. 'మావాడు డిగ్రీ పాసయ్యాడు, పనికొస్తాడేమో చూడండి' అని పరిచయం చేశాడు. ఆయన తన ఎదురుగా ఉన్న కుర్చీ చూపించి 'దీన్ని ఈనాడులో అచ్చయ్యేట్టుగా రాసి ఇవ్వు' అంటూ రెండు పేజీల వార్తను నా చేతిలో పెట్టాడు. మా నాన్న ఎడంగా కూర్చుని ఉన్నాడు. వెంటనే రాసి తిరిగి ఇచ్చాను. 'రెండు పేజీల వార్త, ఆరు వాక్యాల్లో కుదించేశావు కదయ్యా' అన్నాడు. 'సమాచారం అంతే ఉంది సార్' అని చెప్పాను. 'సరే రేపటి నుంచీ రా. నెల రోజులు చూస్తాం. పనికొస్తావో లేదో అప్పుడు చెబుతాం'

అన్నాడాయన. తిరగరాయమని చెప్పి ఆయన నా చేతికిచ్చింది, మా నాయన రాసిన వార్తనే! వారం రోజులకే, 'నువ్వు డెస్క్‌లోకి పనికొస్తావయ్యా' అన్నాడాయన. ఈనాడులో ఎన్ఎంఆర్ సబ్ ఎడిటర్‌గా మొదలయ్యింది నా ప్రయాణం. పతంజలిగారు, ప్రకాష్, నామిని, మేర్లపాక మురళి, శైలకుమార్, సౌద.. వీళ్ళంతా తిరుపతి ఈనాడు నుంచి అప్పుడే వెళ్లిపోయారు. వాళ్ళ మాటలు డెస్క్‌లో దొర్లుతూ ఉండేవి. త్రిపురనేని శ్రీనివాస్, బ్రహ్మయ్య, కళత్తూరు సుధాకర్‌రెడ్డి, వాసు, బుడమల మునిరత్నంరెడ్డి, సుధీర్, జనార్దన్ నా సహచరులు. రామోజీరావు గారి కామెంట్స్‌తో ప్రతి రోజూ పేపర్ డెస్క్‌కి వచ్చేది. నచ్చిన వార్త చుట్టూ ఎర్ర ఇంకుతో సున్నా చుట్టి 'గుడ్, వెరీ గుడ్, వీవీ గుడ్' అని రాసేవారు. బాలేకపోతే బూతులూ ఉండేవి. ఎన్ని గుడ్‌లు వస్తే అంత గొప్ప, పోటీలు పడేవాళ్ళం గుడ్‌ల కోసం. 'బాక్స్ ఐటెమ్ అదిరింది గురూ, రాసింది ఎవరూ' అని టీ అంగళ్ళ దగ్గర తెల్లారక ముందే సీనియర్‌ల నుంచి లభించే ప్రసంశలకు పొంగిపోయే ఉత్సాహపు రోజులు ఈ క్షణాన నాకు గుర్తుకొస్తున్నాయి. వార్తలు ఎలా రాయాలో చెప్పే బడుల్లేవు. పాఠ్య పుస్తకాలూ చదువుకోలేదు. అయినా ఎవరో చేయి పట్టుకుని రాయించినట్టుగా రాసేసేవాళ్ళం. సరళమైన భాష, చదివించే శైలి, నప్పే శీర్షిక, గుణదోషాలను పసిగట్టేసే నైపుణ్యం..ఎలా అబ్బేవో తెలీదు. చాళ్లు చాళ్లుగా అప్పటికే నడిచి నలిగిన తోవలున్నాయి మా కోసం. భాషలో, శైలిలో, పేజీల అలంకరణలో ఇప్పటి మా ప్రయోగాలకు నాంది ఎప్పుడో ఎక్కడో ఎవరో పలికారని తెలుసు. కానీ, ఎవరు, ఎవరబ్బా అని ఆశ్చర్యంగా ఉండేది. ఆసక్తిగా ఉండేది. కనిపించని శక్తులు, తెలియని వ్యక్తులు ఎవరో మమ్మల్ని నడిపిస్తున్నట్టుగా, మా చేయి పట్టుకుని దిద్దిస్తున్నట్టుగా ఉండేది.

ఇన్నేళ్ళకి, ఇప్పుడు కదా తెలిసింది..ఆ తెల్ల గెడ్డపు పొడవు మనిషి గురించి. సిల్కు పోగుల వంటి గెడ్డం. లోతు బుగ్గల సుందర రూపం. అప్పుడప్పుడూ కోటు, లేదా భుజాల మీద లతలు అల్లిన పట్టు శాలువా. తాపీ ధర్మారావు. పొడవుకు మించిన పొగరు. ఆంధ్రకేసరినీ, రాజాజీనీ చెండాడిన దురుసు రాతగాడు. అధికారానికి అతడెప్పుడూ సవాలే. 'జనవాణి' పత్రికను ఆయన నడిపిన కాలం తక్కువే కావచ్చు. తెలుగు పత్రికా ప్రపంచంపై 'జనవాణి' వేసిన ముద్ర చెరగనిది. పండితులకే పరిమితమైన పత్రికను పగ్గాలు వేసి జనంలోకి నడిపించిన మొగలాయీ అతడు. సమాచారం సామాన్యుడికి కూడా అందాలంటే మాట్లాడే భాషే, రాసే భాషగా ఉండాలని గుర్తించి వార్తా పత్రికల భాషనే మార్చినవాడు. ఒకే కాలమ్‌లో కిందికి తెగ్గొట్టు కుంటూ సంపూర్ణ వాక్యాలుగా పేర్చి పెట్టేవాళ్లు అప్పట్లో శీర్షికలను. మొదటి పేజీ మొత్తం ప్రకటనల మయం. 'జనవాణి' ఈ సంప్ర దాయాలను తిరస్కరించింది. ప్రధాన వార్తలతోనే తొలి పేజీ ఉండేది. మూడు నాలుగు కాలాలుగా శీర్షికలను విస్తరించారు. ఈ ప్రయోగశీలి తాపీ ధర్మారావు అని తెలిసిన అబ్బురంతో మీ ముందు మాట్లాడు తున్నాను. ఆయన పాత్రికేయ జీవితంలోని ఒడిదుడుకుల గురించి తెలుసుకునే కొద్దీ ఆయన ఇంకా ఇంకా దగ్గరవుతున్నాడు నాకు. నా ప్రయాణమూ, ఆయన అనుభవాలూ కలగలిసిపోయి కనిపిస్తున్నాయి. ఒక్కటిగానే అనిపిస్తున్నాయి. ఆయన తిరుగాడిన తావుల్లోనే, నేనూ తిరుగాడుతున్న భావన కలుగుతోంది. అసలు ఆయనా నేనూ వేరు కాదనిపిస్తోంది. అవును ఆయన మా తాత, తాపీ ధర్మారావు.

అదే పొగరు , అదే ధిక్కారం.. ఆదివారం ఆంధ్రజ్యోతి సంపాదక బాధ్యతల్లో ఉన్న రోజుల్లో 'ఆ ఇద్దర్నీ క్షమించలేమా' అంటూ ఒక కవర్‌స్టోరీ ప్రచురించాను. కె శ్రీనివాస్ రాసిన వ్యాసం అది. చిలకలూరిపేట బస్సు దహనం కేసులో ఉరిశిక్ష పడ్డ చలపతి, విజయవర్ధనరావుల గురించి రాసిన వ్యాసం. నేరాన్ని నేరంగానే గాక, సామాజిక నేపథ్యంలోంచి కూడా చూడాలంటూ చేసిన విజ్ఞప్తి. ఆ వ్యాసం అచ్చయిన ఆదివారం అనుబంధం పత్రికను చూడగానే సంపాదకుడికి ఆగ్రహం కట్టలు తెంచుకునింది. ఆవేశంతో ఊగిపోతూ పత్రికను నా మొహం మీదకి విసిరికొట్టాడు. ఇతన్ని ఇంకా ఉద్యోగంలో ఉంచడమా అని యాజమాన్యం ముందు పంచాయతీ పెట్టాడు. ఇటువంటి సందర్భాలు ఎన్నో. మోనికా లెవెన్స్కీ క్లింటన్‌ల వ్యవహారం రచ్చకెక్కి ప్రపంచం కోడై కూస్తున్న కాలంలో టైమ్స్ పత్రిక నుంచి యధాతధంగా కాపీ కొట్టి వేసిన వ్యాసానికీ ఇదే స్పందన. వారం వారం మేనేజ్‌మెంట్ ముందు బోనెక్కాల్సి వచ్చేది. ఉద్యోగం ఊగిసలాడేది. వేసే ఏ వ్యాసమూ ముందుగా ఎడిటర్‌కి చూపించే నియమం లేదు, ఆదేశాలను పాటించే వినయమూ లేదు. పాండిత్యమా, హోదానా.. దేన్ని గౌరవించాలి? రాజాజీ అయితేనేం, ఆంధ్రకేసరి అయితేనేం? ప్రజలా, అధికారమా? దేనికి ప్రాధాన్యం ఇవ్వాలి? సందిగ్ధం లేకుండా జనం పక్షాన నిలబడిన తాతాజీ గుర్తుకొస్తున్నాడు. 'జనవాణి'లో ఆయన సంపాదకీయాలు గుర్తుకొస్తున్నాయి. రాయవేలూరు జైలులో పోలీసు కాల్పులు జరిగినపుడు ప్రభుత్వంపై ఆయన నిప్పులు చెరిగాడు. అప్పటి ముఖ్యమంత్రి ప్రకాశం పంతులునీ, కాల్పులకు అనుమతిచ్చిన గవర్నర్ రాజాజీనీ దుయ్యపట్టాడు. ఒకసారి అంతర్జాతీయ రచయితల సభకు చైనా ప్రభుత్వం తాపీ ధర్మారావును ఆహ్వానించింది. 'నాకు వ్యతిరేకంగా సంపాదకీయం రాసినవాడు చైనా వెళ్ళడమా, ఎలా వెళ్తాడో చూస్తా' అన్నాడంట రాజాజీ. తాపీ ధర్మారావు చైనా ప్రయాణం కోసం కుట్టించుకున్న ఉన్ని దుస్తులు అలాగే ఉండిపోయాయి. ఆ తర్వాత శ్రీశ్రీకి రష్యా ప్రయాణం పడింది. రష్యాలో కూడా బాగా చలి కదా చైనా కోసం కుట్టించుకున్న ఉన్ని దుస్తులు ఇవ్వండి అని అడిగాడట శ్రీశ్రీ. ఆనందంగా ఇచ్చాడంట తాతాజీ. ఈ సంఘటన చదివాక, తానా ఆహ్వానం మీద అమెరికా ప్రయాణానికి సిద్ధమైన నేను, పాస్‌పోర్ట్ కోసం పడ్డ కష్టాలు గుర్తుకొచ్చాయి. తాతాజీ జీవితమంతా ఇటువంటి సందర్భాలే. ఆయనని తలచుకుంటే గుండె పిడికిలవుతోంది. ఆ తాత పరచిన బాటలోనే కదా నడిచాను నేను. ఎన్ని నిఘాలు, ఎన్ని ఒత్తిళ్లు, ఎన్ని వేధింపులు.. ఎవరికి లొంగాడని, దేనికి తల వొగ్గాడని? పళనియప్ప, రాజాజీల నిరంతర వేధింపులు, నిఘాల మధ్య రాసిన రాతలు. కమ్యూనిస్టు రహస్య కార్యకర్తలను కలుసుకున్న వైనాలు. తాపీ ధర్మారావు ధీరత్వం గురించి చదువుతూ ఉంటే, అడువుల్లోకి నడిచి అజ్ఞాత నక్సలైట్‌లను కలుసుకుని, చేసిన ఇంటర్వ్యూలూ, ఆ తర్వాత వెంటాడిన నిఘాలూ..గుర్తుకొస్తున్నాయి. వారసత్వం రక్తానికే పరిమితం కాదు, అక్షరానికి కూడా వారసులుంటారు. ఎందరో ఆయన వారసులు, అందులో నేనూ ఒకడ్ని. ఆ తాతకు మనవడిని. నాకు తెలియకనే ఆ తాత ఒడిలో కూర్చుని అక్షరాలు నేర్చుకున్నాను. ఆయన చేతి కర్ర ఊతంతో నడకలు నేర్చుకున్నాను. ఆ తాత గుండెల మీద పడుకుని 'అనగా అనగా కథలు' ఆలకిస్తూ, చుట్ట పరిమళపు ముద్దులు మూటగట్టుకున్న ఆయన మనుమడిని నేనే అనిపిస్తోంది. అవును ఆయన పొగరుబోతు అక్షరానికి వారసుడిని నేను. తాతా..నిన్ను బహుమతిగా అందుకుంటున్న ఈ క్షణాన చెబుతున్నా.. నీలాగే నిటారుగా నిలబడే బతుకుతాను కడదాకా, పొగరుగా, ధిక్కారంగా.. దయగా.. ప్రేమగా.

(తాపీ ధర్మారావు పురస్కారం అందుకున్న సందర్భంగా చేసిన ప్రసంగం లోంచి)

తాపీ పురస్కార సభ

# గుండెను తడిమిన తాపీ ధర్మారావు పురస్కార సభ



ఉమా గుండె తడి, భావోద్వేగం, అనుబంధం – ఈ మూడూ నన్ను ముప్పిరిగొన్న సందర్భం అది! ముందున్న మర్రిచెట్టును దాటుకుని లోనికెళ్తే వచ్చే ఎస్.వి.యూనివర్సిటీ ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియం. వేదిక మీద జరిగేది –మన ఆర్.ఎం. ఉమామహేశ్వరరావుకి కాకలు తీరిన జర్నలిస్టు తాపీ ధర్మారావు పురస్కార ప్రదానోత్సవం. విద్యార్థులతో, రచయితలతో, మేధావులతో సభా ప్రాంగణం నిండు చెరువులా తొణికిసలాడుతోంది. ఈ సభలో, నా పాత్ర, ప్రమేయం గురించి ఒకటంటే ఒకటే మాట. తాపీ వారి వేదిక నుంచి ఈ ఏడాది అవార్డుని ఉమాకిస్తున్నట్టు ఒక మాటగా ఫోన్లో చెప్పారు సామల రమేశ్‌బాబు. మంచి వార్త. ఉమా మా తిరుపతి మనిషి గనుక ఆ సముచితమైన వార్తకు ఉప్పొంగిపోయాను కూడా. తీరా ఆ అవార్డు ప్రదానోత్సవ కార్యం కాస్త తిరుపతిలోనే జరుగుతుందనీ, సభా నిర్వహణ ఏర్పాట్లు చూడవలసి వస్తుందనీ తెలిసి... ఈ సభ ఇలా జరగడానికి నా పనేదో నేను అరసం, తెలుగు భాషోద్యమ సమితి కార్యకర్తలు, ముఖ్యంగా అధ్యక్షురాలు గంగవరం శ్రీదేవి గారి సహకారంతో చేశాను.

సరే, సభలో మాట్లాడిన వాళ్ల మాటలన్నిట్నీ ఇక్కడ ఏకరువు పెట్టడం భావ్యం కాదు. అనవసరం కూడా. నా మనసుకు తాకినవీ, నాటుకుపోయినవీ చెప్తాను. మధురాంతకం నరేంద్ర మాట్లాడుతూ ఉమామహేశ్వరరావు తక్కువ కథలు మాత్రమే రాశారనీ, అందునా పట్టుమని పది కథలు కూడా రాయలేదనీ, అందుకు కారణం ఒక్కో కథ రాయడానికి, ఆ భావస్ఫూర్తి పొందడానికి కొన్ని ఏళ్లు శ్రమపడతాడన్నారు. ఇంకా ఓ మంచి మాట అన్నారు. (కర్ణుడు కవచకుండలాల్ని వొలిచి పెట్టినట్టుగా) తన అవయవాలను వొలిచిపెట్టినంతగా కష్టపడతాడని, అందుకే ఆయన కథలు రాణించాయన్నారు. నాదో కోరిక ఉమాతో చాలా దఫాలు ప్రస్తావించాను, ఇప్పుడు పత్రికా ముఖంగా అడుగుతున్నాను కూడా, ఉమామహేశ్వరరావు కథల్ని మా అభినవ ప్రచురణల కింద పుస్తకంగా తీసుకురావాలని వుంది. లేదా తెలుగు భాషోద్యమ సమితి కింద సరే అన్నా దాన్ని మేము గౌరవప్రదంగా భావిస్తాము. ఉమానే ఎన్నో సంకలనాల్ని స.వెం.రమేశ్ సహ సంపాదకత్వంలో తీసుకువచ్చారు. ఆయన పుస్తకాన్ని ఆయన అచ్చువేసుకోలేరని కాదు. ఆ ప్రతిష్ట మా సమితికి చెందాలనేది నా చిరకాల కోరిక. ఇంకా సభలో ధర్మారావు గారి మనవరాలు సుజాత షా గారు కానీ, మిగతా వక్తలు కానీ అందరూ కూడా మనసు విప్పి మాట్లాడారు. ముఖ్యంగా సభ ప్రారంభంలో ఆదిశేషయ్య పాడిన "ఆ చల్లని సముద్ర గర్భం దాచిన బడబానల మెంతో.." దాశరథి పాటను కాకరాల గారు ప్రస్తావించి గద్గదికం కావడం మరిచిపోలేము.

ఉమామహేశ్వరరావు ప్రఖ్యాత రచయిత, జర్నలిస్టు అయినా, ఇంకా టీవీలో ఎన్నో ప్రోగ్రాముల్ని రూపకల్పించినా, వ్యాఖ్యాతగా వ్యవహరించినా ఆయన గురించి మా తిరుపతి మిత్రులకు తెలిసింది వేరు. ఎక్కువ మాట్లాడరు. మాట్లాడే ప్రతి మాటకీ సామాజిక విలువ వుంటుంది. ఎవరితోనూ పేచీ పడరు. ఎప్పుడూ నవ్వు మొహం. పలకరింపుగా ఆయన ఒక మాట అనరు, ఒక నవ్వు నవ్వుతారు. అందుకే ఆయన చుట్టూ ఆయన ఇంటి చుట్టూ మనుషులు చేరతారు. కసిరి పొమ్మనే స్వభావం కాదు. మనుషుల్ని చూడగానే మురిసిపోయి రమ్మనే స్వభావం. అందుకే ఉమా ఇల్లు సాహితీవేత్తల కేంద్రం. మన తెలుగు రాష్ట్రాల నుంచి ఎవరు తిరుపతి వచ్చినా ఉమా గడప తొక్కకుండా వెళ్లే పరిస్థితి లేదు. ఈ రాబట్టుకునే గుణమే ఉమాకు ఆభరణం.

నాకు తెలిసి ఉమా మహేశ్వరరావు ధర్మాగ్రహం చెందడం కానీ, విచలితుడు కావడం గానీ, కనీసం చిన్నపాటి భావోద్వేగానికి లోను కావడం కానీ మేమెప్పుడూ చూడలేదు. మాకు తెలిసే ఆయన వరసగా తండ్రినీ, తల్లినీ, అన్ననీ, వదిన్నీ పోగొట్టుకున్నారు. ఎంతో ప్రేమ వారిపై వున్నా తమాయించుకుని జరగాల్సిన పనులు చూశారే గానీ ఎప్పుడూ కుంగిపోలేదు. అలాంటి మనిషి ఇక్కడ, ఈ వేదిక మీద తన తండ్రిని తొలి గురువుగా చెప్పుకోవడం, ఈనాడు పత్రిక వారు పెట్టిన పరీక్షలో తన తండ్రి పంపిన వార్తనే క్లుప్తీకరించి ఉద్యోగం సంపాదించిన తీరు ముచ్చటించడం సభలో అందరికీ నచ్చింది. ఉమా ప్రసంగం మొదట్లోనే అక్కడ శారీరకంగా లేని ఆ నలుగురినీ తల్చుకొని, ఎక్కడ ఎమోషనల్ అయి బావురుమంటాడో అనుకుంటున్న తరుణంలో, క్షణంలో ఆయన్ని ఆయనే వూరడించుకుని, తనవారిని సంస్మరించుకుని ముందుకెళ్లిపోవడం సభకి హుందాతనం ఇచ్చింది. ఇంకా దయచేసి నాకు విలువ ఇవ్వకండి, జర్నలిజంలో నేను పాటిస్తున్న విలువలకు విలువ ఇవ్వండి అని అనడం! ఉమా కాస్త ధర్మాగ్రహాన్ని కూడా వేదిక మీద ప్రకటించారు. అలాంటి ఉమాను అసలు మేమెప్పుడూ ఎరగం. నాలుగు మాటలు టకటకా మాట్లాడక ఎప్పుడూ నాన్చేసే ఆ మనిషి ఆ రోజు నిజరూపదర్శనం గావించాడు. ఆదివారం ఆంధ్రజ్యోతి అనుభవాలు చెబుతున్నప్పుడు జర్నలిస్టుగా ఆయన పాటించిన నియమాలతోపాటు, సృష్టించిన సంచనాలు ఎంతటివో సభలో జర్నలిస్టులు కాని వారికి అర్థమైంది. ఎదిగిన కొద్దీ ఒదిగినట్టుగా – ఉమా మహేశ్వరరావు ఎ.బి.కె., పతంజలి, కె.ఆర్. మూర్తి, కట్టా శేఖర్‌రెడ్డి, కృష్ణప్రసాద్ లాంటి ఎందరో జర్నలిస్టులను తల్చుకోవడం కూడా న్యాయంగా అనిపించింది. ఉమా మహేశ్వరరావు తాపీ ధర్మారావు గురించి మాట్లాడిన మాటలు సరేసరి. వారి గొప్పతనం గురించి పక్కన పెట్టండి. ఏ కారణాల వల్ల తాపీ తాతయ్య జర్నలిస్టుగా మరుగున పడ్డాడు, ఇందులో వున్న కుట్ర ఏమిటి అని ఉమా ఉద్వేగంతో ప్రశ్నించడం వెనక నిజంగానే ఒక సామాజిక కోణం వుంది. ఈ ప్రశ్న ఆయన పూనకం వచ్చిన వ్యక్తిలానే వేశారు. ఇంకా ధర్మారావు గారిని మా తాత అనడం ఎంత బాగుందో ఆయన కుటుంబంలో ఒక సభ్యుణ్ణి అయ్యాను అనడం కూడా ఉమా మానవ సంబంధాలకు, అనుబంధాలకు ఎంతటి ప్రాధాన్యత ఇస్తాడో అర్థమైంది. ఆయన సభలో మాట్లాడింది ఓ పదిహేను నిమిషాలే అయినా పొల్లు మాట ఒక్కటి లేకుండా, సామాజిక బాధ్యతతో మాట్లాడిన మాటలు జర్నలిస్టులందరికీ శిరోధార్యం. ఉమా మహేశ్వరరావును సభలో ఈ రకంగా చూడడం ఒక గొప్ప మధురానుభూతినిచ్చింది.

ఇంతకూ సభ నిర్వహణకు ముందురోజు ఓ పెద్ద సమస్యనే ఎదురైంది. అనారోగ్యం చేత ముఖ్యఅతిథి భువనచంద్రగారు, అత్యవసర పనుల

## జీ.వో.86/2003ను తొక్కిపట్టి తుంగలో తొక్కుతున్నదెవరు?
## తెలుగును అణచివేసే విధానం కాదా ఇది?

**2003వ సం॥రంలో జీ.వో 86- అక్షరాభ్యాసం నుంచి పదవ తరగతి వరకు తెలుగును తప్పనిసరిగా బోధించాలనే సూత్రంతో వచ్చింది. అది ఊరికే రాలేదు. తెలుగు భాషోద్యమ సమాఖ్య, భాషాభిమానుల విస్తృత పోరాటంతోనే ప్రభుత్వం తెచ్చింది. అది నెరవేరుతున్నదా? ఇది ముందుకు నడవకుండా ఆపుతున్నదెవరు? అసలు ఇంగ్లీష్ మీడియం హైస్కూళ్ళలో తెలుగు అధమాధమ స్థితిలో ఎందుకుంది? సిలబస్ ఎంత? బోధన పద్ధతులేమిటి? ఒక్కసారి చూద్దాం.**

ఇంగ్లీషు బడులలో శిశు తరగతి నుంచే ఇంగ్లీషు ప్రారంభమవుతుంది. ఉదయం లేచినదగ్గర నుంచి పొద్దు పోయిందాకా ఒకటే రొద్దకొట్టుడు. అన్ని ఇంగ్లీషు తరగతుల మధ్య ఒకే ఒక్క తెలుగు క్లాసు. అదీ ఇంగ్లీషు, లెక్కలు సైన్సు క్లాసులు దురాక్రమించకుంటేనే మిగులుతుంది. సిలబస్ చెప్పాల్సిన పని లేదు. ఆరవ తరగతి నుంచి పదవ తరగతి వరకు ఇంతింత వాచకాలు. తెలుగు గొప్పతనం చెబుతూ, భాషావైభవం గుదిగుచ్చుతూ ప్రచురింపబడినవి. అదొక పద్మవ్యూహం. దాన్లోకిపోయిన విద్యార్థులెవరూ అక్కడ అర్థంగాక కూలబడాల్సిందే. ఏదో ముగ్గురు, నల్గురు తప్ప, తెలుగు చదవలేరు-రాయలేరు. (ఇంగ్లీషైటూ రాయలేరు. అది వేరే సంగతి) ఇక్కడ తెలుగు చెప్పే పంతులుకు జీతం తక్కువే. విలువుండదు. ఒకటే నస. మార్కులు సరిగ్గ రాకుంటే-తెలుగులో కూడా మార్కులు తక్కువా? ఏంటండీ ఇది? పేరెంట్స్ ఏమనుకుంటారు? ఈ సతాయింపు నిత్యం వెంటాడుతూనే వుంటుంది. ఇక్కడ గతిలేనివాడు తప్ప తెలుగు చెప్పి, నిలబడలేడు. నిలబడాలనుంటే తాడో, పేడో తేల్చుకోటానికి సిద్ధపడాల్సిందే. ఉద్యోగం ఎప్పుడు ఊడుతుందో, వుంటుందో - కత్తి మెడమీద వున్నట్టు గడపాల్సిందే. ఇక్కడ నిలదొక్కుకొని స్థిరపడాలంటే 'కాకా' పట్టేవాడైనా కావాలి, 'కాక' వున్నవాడైనా కావాలి.

ఈ ఇంగ్లీషు కీకారణ్యంలోకి అప్పుడప్పుడు తెలుగుమీడియం చదివే విద్యార్థులు దారి తప్పి వస్తుంటారు. వచ్చినవాళ్ళు, తెలుగులోనే కాదు, అన్ని సబ్జెక్టులూ దున్నేస్తూ ముందుకు పోతుంటారు. వీళ్ళను చూస్తుంటే ప్రాథమిక విద్యంతా తెలుగుమీడియంలోనే జరగాలనే భాషావేత్తల మాటెంత సత్యమో బోధపడ్తుంది. నా నలభై సంవత్సరాల తెలుగు పాఠ్యాంశ బోధనానుభవం కూడా ఇదే చెప్తుంది.

ఇక అసలు విషయానికి వస్తున్నాను. ఈ ఇంగ్లీషు మీడియం బళ్ళల్లో కార్పొరేట్ శక్తులదే హవా! వీళ్ళు ఏడవ తరగతిలో ప్రవేశపెట్టిన సంస్కృతం పదవ తరగతి వచ్చేసరికి పట్టు బిగించి మరాడించటం ప్రారంభిస్తుంది. పదవ తరగతిలో 20 మార్కులకు సంస్కృతం తీసుకుంటే చాలు. వాళ్ళకు వాచకంలో మూడునాల్గు పద్యగద్య భాగాలుండవు. ఉపవాచకమసలే వుండదు. దానికి ప్రతిగా వాళ్ళకు ప్రతిపదార్థాలు, అర్థ సందర్భాలు, ప్రశ్నలూ, 14 మార్కులకు తెలుగులో గీకొచ్చు. ఆరుమార్కుల సంస్కృతానికి శబ్దాలూ, ధాతువులూ, సంధులూ, విగ్రహ వాక్యాలుంటై. ఇవీ చిన్నా, చితకవే. సంస్కృత విద్యార్థులకు ఒకేరోజు, ఒకే పేపరుతో ముగిస్తే- తెలుగువాళ్ళు రెండు రోజులు రెండు ప్రశ్నాపత్రాలు దేకాల్సిందే. కార్పొరేట్ శక్తులకు సంస్కృతమంటే అభిమానమా, అంటే- ఉత్తిది... అంతా గుడిగుడిగుంచం గుళ్ళోరాగమే. ఇది నిలింపుల భాషట. చచ్చిన శవానికి చారెడంత కళ్ళు అని సంస్కృతం గురించి శ్రీశ్రీ అన్నా - వీళ్ళు పట్టించుకోరు. అన్నీ పరీక్ష కోసం ముక్కుపిండి చీదేస్తారు.

**చదువును మార్కెట్ చేసిన కార్పొరేట్ శక్తుల్ని కాదని- ఏ ప్రభుత్వమూ ముందుకు పోదు. తెలుగు భాషోద్యమ సమాఖ్య, భాషోద్యమకారుల పోరాట ఫలితంగా 2012లో డి.ఇ.ఓల నుంచి సంస్కృతం పేపరును సంస్కృతంలోనే రాయాలని కాలేజీల కొక సర్క్యులర్ వచ్చింది. అందువల్ల నిజంగా సంస్కృతంలో ఆసక్తి వుండి, చదవాలనుకున్నవారే, శక్తి ఉన్న వారే చదివే పరిస్థితి వచ్చి తమ వ్యాపారం కుంటుపడ్తుందని కార్పొరేట్ శక్తులు కలవరపడి, కట్టుగట్టి-కాలేజీ విద్యా విధానంలో పాతపద్ధతే ఇంటర్, బి.ఏల్లో కొనసాగేట్టు కట్టడి చేసి సాధించారు. దానికి పర్యవసానమే ఈ ప్రజావ్యతిరేక విద్యావిధానం. చెక్క భజనలూ- బతకమ్మ ఉత్సవాలే తెలుగుతనానికి ప్రతీకలు కాదని పాలకవర్గాలకు ఎవరెంత చెప్పినా విన్పడదు. ఉద్యమాలే వారి చెవిటి జబ్బుకు మందు.**

**-కీ.శే.వెలుగు వెంకటసుబ్బారావు,** ఉపాధ్యాయుడు, కవి, చీరాల.

అక్టోబరు 24న మరణించారు. అంతకు రెండు నెలలముందు వ్రాసినది ఇది.

మీద విశిష్ట అతిథి నంది వెలుగు ముక్తేశ్వరరావులు సభకు రాలేని పరిస్థితి. మరొక ముఖ్యవ్యక్తి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య పి.విజయలక్ష్మి ఆలస్యంగా సభకు హాజరవుతానని కబురు పెట్టారు. ఈ త్రిమూర్తులు లేని సభకు తీరని వెలితి ఏర్పడింది. తీరా సభ జరిగే ఉదయానికి కాకరాల గారు ముఖ్యఅతిథిగా సభలో పాల్గొని సభ ప్రతిష్టను నిలిపారు. ఈ సభ నిర్వహణ ఏర్పాట్లలో ప్రధాన పాత్రను సామలగారు నాకు అప్పగించడం, సభ అద్వితీయంగా జరగడం ఓ అపురూపమైన సన్నివేశం.

సభ ముగింపులో ఉమా ఉద్వేగభరితమైన ఉపన్యాసం వెనువెంటనే బంధుమిత్రులు, జర్నలిస్టుల సత్కారాల సందడి మధ్యలో చిరస్మరణీయమైన ఆ సభకు ముగింపు వాక్యాలు పలికే అవకాశం నాకు దక్కనే లేదు. ఆ రెండు మాటలు ఇక్కడ చెప్పే అవకాశం దొరికింది. "ఠాగూర్ గీతాంజలికి నోబెల్ బహుమతి ఓ యోగ్యతాపత్రం. శ్రీశ్రీ మహాప్రస్థాన కావ్యానికి చలం ముందు మాట ఓ యోగ్యతాపత్రం. జర్నలిజంలో ఉమామహేశ్వర రావు ప్రతిభకు తాపీ ధర్మారావు పురస్కారం ఓ యోగ్యతా పత్రం. సాహిత్యం, జర్నలిజం, విద్యా రంగానికి చెందిన పెద్దలు, ప్రముఖులు వేదికలో, సభలో ఉన్నారు. రేపటి సమాజ నిర్మాతలైన విద్యార్థినీ విద్యార్థులు కూడా దండిగా సభలో ఉన్నారు. వీరు ప్రతి ఒక్కరూ ఒకొక యోగ్యతా పత్రమే. ప్రతిష్ట కలిగిన పురస్కారం, పురస్కార గ్రహీతలు. ఈ మేలు కలయికకు ధీటుగా సభ దిగ్విజయంగా జరుపుకున్నాం. ఎందరో మహానుభావులు, అందరికీ వందనాలు."

ఉమా మహేశ్వరరావు జర్నలిజం పట్ల, సాహిత్యం పట్ల మరింత నిబద్ధతతో పనిచేసుకుంటూ వెళ్లాలని నాతోపాటు, మా తిరుపతి మిత్రుల ఆకాంక్ష.

**-సాకం నాగరాజ,**

అరసం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి



## కంప్యూటర్‌లో తెలుగు-ప్రస్తుత స్థితి, భవిష్యత్ కార్యాచరణ-3

-రహ్మానుద్దీన్ షేక్
96869 03386

# భారతీయభాషల కంప్యూటింగ్ సంస్థలు

అక్టోబర్ సంచికలో యూనికోడ్, ఆస్కీ, ఇస్కీ ప్రమాణాల గురించి తెలుసుకున్నాం. అవి ఎట్లా వాడాలి అని ఎందరో పాఠకులు ఫోను ద్వారా అడిగారు. వ్యాసంలో తెలిపిన విధంగా ఆస్కీ, ఇస్కీ, యూనికోడ్ వగైరా తలనొప్పులన్నీ సాఫ్టువేరులు చూసుకుంటాయి. ఈ-మెయిల్స్(వేగులు), ఫేస్‌బుక్, బ్లాగులు లాంటి చోట్ల మీరు తెలుగులో చదవడం, వ్రాయడం చేయగలుగుతున్నారంటే అది యూనికోడ్. లీప్ ఆఫీస్, సీడాక్ వారి ఉపకరణాలు ఇస్కీను వాడుతాయి. ఇక అను, శ్రీలిపి వాడి కంపోజ్ చేస్తున్న పుస్తకాలు, ముద్రణ వగైరా ఆస్కీను వాడుతాయి. మనకు తెలీకుండానే ఈ ఎన్కోడింగ్ లను మనం వాడుతున్నామన్నమాట. అయితే యూనికోడ్ లో వ్రాయటం అత్యుత్తమం. ఎందుకు అన్న విషయాన్ని గత సంచికలో తెలిపాము.

ఇక తెలుగు భాషపై పని చేస్తున్న వివిధ సంస్థల గురించి, భాషా శాస్త్రంలో జరుగుతున్న పరిశోధనల గురించి తెలుసుకుందాం.

తెలుగు భాషను భాషా కుటుంబాల విభజన ప్రకారం ద్రావిడ భాషా కుటుంబానికి సంబంధించిన భాషగా పరిగణిస్తారు. ఐతే లిపుల పరంగా చూస్తే అన్ని భారతీయ భాషల లిపులనూ బ్రాహ్మీ లిపి కుటుంబానికి చెందినవిగా పరిగణిస్తారు. మన భాషని “అబుగిడ” (గ్రీక్ పదం) అని పరిగణిస్తారు. అనగా ఒక హల్లు, ఒక అచ్చు సంయోగంతో భాషలో పదాలు తయారవుతాయి. అజంత పదాలూ ఉంటాయి, అచ్చులు విడిగా వాడినా పూర్తి అక్షరం హోదా ఉంటుంది. క్ అనేది హల్లు అయితే క అనేది క్+అ సంయోగంతో తయారైన మిశ్ర అక్షరం. అంటే మన భాష అజంత భాషే. హలంత భాష కాదు! రోజువారీ మాటల్లో ఎక్కడా మనం హలంతం వాడము. అయితే ఈ మధ్య పేరులన్నీ హలంతం (హల్లుతో ముగిసే అక్షరం) గా ఉంటున్నాయి. రాజేశ్, సురేశ్, రామ్ ఇలా. తెలుగు మాటల్లో ఇవి పొసగవు. రాజేశు, సురేశు, రాముగా మారిపోతాయి. ఇది సహజంగా మాటల్లో వచ్చేస్తుంది. రాజేశ్, సురేశ్, రామ్ ఇలా పలకటం కృతకంగా ఉంటుంది. అయినా మనం కృతకంగా ఉన్న భాష వైపుకే మారుతున్నాం. ఇది మంచి పంథానా కాదా అన్నది చర్చించడం ఈ వ్యాస పరిధిలో లేదు. అది నిర్ణయించేది రాబోయే తరాల తెలుగువారే. ఈ మధ్య వెబ్‌సైట్(వలగూడు) చిరునామాలో ఆఖరున ఉండే .com, .in, .org లతో పాటుగా. bharat అనీ, భారతీయ భాషలలో .भारत.ভারত, భారత్, ભારત,. بھارت , இந்தியா , .ভারত ఇలా రూపొందించారు. ఉత్తర భారత భాషలు హలంత భాషలు, బాగానే ఉంది. భారత ప్రభుత్వం వారు దక్షిణ భాషలలో కన్నడలో భారత అని, తమిళంలో ఇందియా అనీ, మలయాళంలో భారతం అని వాడగా అజంత తెలుగు భాషలో హలంత భారత్ పదాన్ని వాడారు. ఈ పరిణామాన్ని ఫేసుబుక్కు వేదికగా కొందరు తెలుగు వారు వ్యతిరేకించినా, ఎందరో తెలుగువాళ్ళకి ఇది సాధారణ విషయంగానే అనిపించింది. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే, ఇలాంటి పరిణామానికి కారణం భాషల అధ్యయనాన్ని భాషా కుటుంబం ఆధారంగా కాకుండా లిపి విభజన ఆధారంగా చెయ్యటం. దీని వల్ల ఉన్న సౌలభ్యాలు కొన్నే, విపరీత పరిణామాలు చాలా ఉన్నాయి. తెలుగును ప్రత్యేక భాషగా ఉంచి చేసే పరిశోధనల కన్నా, ఇతర భారతీయ భాషలతో కట్టేసి చేసే పరిశోధనలే ఎక్కువ.

ప్రభుత్వం-ప్రయివేటు సంస్థలు, ఆసక్తిగల వ్యక్తులు చేసే పరిశోధనలు కూడా సింహభాగం అన్ని భారతీయ భాషలనూ ఒక విధంగానే పరిగణించి చేస్తున్నవే. ఇండిక్ కంప్యూటింగ్ అని ఈ అభివృద్ధిని చేపడుతున్నారు. ఇండిక్ కంప్యూటింగ్ అంటే కంప్యూటర్ ఆధారిత కార్యాలను భారతీయ లిపులలో, భాషలలో చేయడం. భారతీయ భాషలు/లిపులలో సాఫ్టువేరులను అభివృద్ధి చేయటం, టైపింగు పద్ధతులు, కంప్యూటర్ ఉపకరణాలను స్థానికీకరించడం, వెబ్ (వల)




అను సంధానం, డేటాబేస్ మేనేజ్‌మెంట్, ఓసీఆర్, స్పెల్ చెకర్, స్పీచ్ టు టెక్స్ట్, టెక్స్ట్ టు స్పీచ్, మొదలైనవి రూపొందించటం ఇండిక్ కంప్యూ టింగ్ లక్ష్యం. దాదాపుగా అన్ని భారతీయ భాషలలో/లిపులలో నేడు యూనికోడ్ ఆధారంగానే కంప్యూటర్/ఇంటర్నెట్‌లో పనులు జరుగు తున్నాయి. యూనికోడ్ 5.0 రూపాంతరంలో (వెర్షన్) బెంగాలీ, దేవ నాగరి, గుజరాతీ, గురుముఖి, కన్నడ, లింబు, మలయాళం, ఒడియా, సింహళ, సైలోటి నాగరి, తమిళం, తెలుగు భాషలు అందుబాటులో ఉన్నాయి. తుళు లాంటి ఇతర భాషలు త్వరలో అందుబాటులోకి రావచ్చు. యూనికోడ్ 7.0 రూపాంతరంలో ౦,౦ అక్షరాలతో పాటుగా చంద్రబిందువు చిహ్నం కూడా వాడటానికి కుదిరింది. ఇండిక్ కంప్యూటింగ్ ప్రాజెక్టులు ఎన్నో నేడు చకచకా జరుగుతున్నాయి. కొన్ని ప్రభుత్వరంగ సంస్థల అధీనంలో జరుగుతూంటే, కొన్ని ఔత్సాహికుల ద్వారా జరుగుతున్నాయి.

**ప్రభుత్వ రంగ సంస్థలు :**

ప్రభుత్వ రంగ సంస్థల్లో చెప్పుకోదగ్గ పని చేసినవి సీ-డాక్, టిడిఐఎల్, ఎన్నార్సీఫాజ్. టిడిఐఎల్ (టెక్నాలజీ డెవలప్మెంట్ ఫర్ ఇండియన్ లాంగ్వేజెస్ - భారతీయ భాషల సాంకేతికాభివృద్ధి సంస్థ)ను భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం భారతీయ భాషలలో అభివృద్ధి కోసం రూపొందించింది. కంప్యూటర్‌ను వాడాలన్నా, కంప్యూటరుతో పనులు చేయించుకోవాలన్నా ఇంగ్లిష్ భాషలో



మాత్రమే అందుబాటు ఉండేది. భారతీయ భాషలలో కూడా కంప్యూటరు లావాదేవీలు చేసుకునేందుకు వీలు కల్పించటమే ఈ సంస్థ ముఖ్య ఉద్దేశ్యం. బహుభాషా నిఘంటువులు, బహుభాషా విజ్ఞాన సర్వస్వాలు రూపొందించడం, వాడి, వాటిని సాధారణ ప్రజలకు ప్రయోజనం కలిగించే ఉపకరణాలు రూపొందించడం ఈ సంస్థ చేయవలసిన పనులు.

2005లో ఈ సంస్థ భారతీయ భాషలలో కొన్ని ఉపకరణాలను రూపొందించి సీడీ రూపంలో పంచిపెట్టింది. వాణిజ్యేతర పనులకే ఈ ఉపకరణాలు వాడవచ్చు అన్న నిబంధన వల్ల ఈ ఉపకరణాలు అంతగా ప్రాచుర్యం పొందలేదు. ఈ సంస్థ రూపొందిస్తున్న ఉపకరణాలను టిడిఐఎల్ నిధి ద్వారా పంచిపెట్టాలి.

సీ–డాక్(సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్) సంస్థ ఒక బహుళజాతి ఐటీ కంపెనీతో సమానంగా పని చేసే సంస్థ. భాషా పరమైన సాఫ్టువేర్లను రూపొందించడం ఈ సంస్థ కర్తవ్యం. మనం తెలుగు టైపింగుకు వాడుతున్న ఇన్‌స్క్రిప్టు కీబోర్డును రూపొందించినది ఈ సంస్థే. ఎన్నో టైపింగు సాధనాలను, వర్డ్ ప్రాసెసర్లను, పాఠ్యం నుండి వినబడే మాటను రూపొందించే సాఫ్టువేర్‌ను ఈ సంస్థ రూపొందించింది. తెలుగులో దాదాపుగా 30 ఫాంట్(ఖతి)లను రూపొం దించింది. జిస్ట్ ఫాంట్లుగా చాలామందికి ఇవి సుపరిచితమే.

**భారతీయఓఓ.ఆర్గ్**

బెంగుళూరులోని సీడాక్ సంస్థ రూపొందించిన ఉపకరణాల ప్రాజెక్టు భారతీయఓఓ.ఆర్గ్‌గా తయారైంది. ఈ సంస్థ భారతీయ భాషలలో ఒక నిర్వహణ వ్యవస్థ – నివ్య (ఆపరేటింగ్ సిస్టం) ను రూపొందించింది. మైక్రోసాఫ్ట్ వర్డ్, ఎక్సెల్, పవర్‌పాయింట్ కు ప్రత్యా మ్నాయంగా ఓపెన్ ఆఫీస్ రైటర్, కాల్క్, ఇంప్రెస్ అనే స్వేచ్ఛా సాఫ్టు వేరులను భారతీయ భాషలలోకి స్థానికీకరణ చేసి ప్రాచుర్యం కలిపించింది.

**బాస్** (BOSS)

భారతీయ ఓపెన్ సోర్స్ సాఫ్టువేర్ ఎన్నార్సీఫాజ్ (నేషనల్ రీసోర్స్ సెంటర్ ఫర్ ఫ్రీ/ఓపెన్ సోర్స్ సాఫ్టువేర్) వారి ద్వారా రూపొందించబడింది. ఈ సంస్థ కార్యకలాపాలు సీ–డాక్ చెన్నై, అన్నా యూనివర్సిటీలోని కెబిసి రీసెర్చ్ సెంటర్ వారు సంయుక్తంగా పర్యవేక్షిస్తారు. భారతదేశంలో పలు నగరాలలో ఈ సంస్థ శాఖలున్నాయి.

**ప్రభుత్వేతర, ఔత్సాహిక జట్టులు, వ్యక్తులు :** ఇండ్‌లినక్స్ గ్నూ/లినక్స్ (పూర్తి వాణిజ్య లాభాపేక్ష ఉన్న సంస్థ మైక్రోసాఫ్ట్‌కు ప్రత్యామ్నాయంగా 1991లో మొదలైన నివ్య) ఎవరైనా తమ అవసరాలకనుగుణంగా మార్పులు చేసుకుని వాడుకునే వెసులుబాటున్న నిర్వహణ వ్యవస్థ. భారతదేశంలో ఎందరో ఔత్సాహికులు ఈ లినక్స్ అభివృద్ధికి తోడ్పడుతున్నారు. అలా వ్యక్తిగతంగా పని చేస్తున్న వారి కృషిని క్రమబద్ధీకరించేందుకు ఇండ్‌లినక్స్ పని చేస్తోంది.

**సరోవర్**

సరోవర్ స్వేచ్ఛా లైసెన్స్‌లో అందుబాటులో ఉన్న అన్ని ప్రాజెక్టులను, ఉపకరణాలను నిల్వ ఉంచుకునేందుకు, దింపుకునేందుకు (download) వీలుగా ఉండేలా రూపొందించిన జాలగూడు. ఇది తిరువనంతపురం కేంద్రంగా పని చేస్తున్న సంస్థ. ఏషియానెట్ డేటా సెంటర్ వారు ఈ సంస్థకు సహకారం అందిస్తున్నారు.

**పినాక్**

పినాక్ సంస్థ సాఫ్టువేర్ స్థానికీకరణపై, భాషా అభివృద్ధికై పని చేస్తోంది. అంతే కాకుండా పినాక్ వారు జనానికి కంప్యూటర్లపై అవగాహన పెంచేందుకు పని చేస్తోంది.

**అంకుర్**

కోలకతా కేంద్రంగా బెంగాలీ భాషలో వివిధ సాఫ్టువేర్ ఉపకరణాలను అభివృద్ధి చేయటం లక్ష్యంగా పని చేస్తున్న సంస్థ. బెంగాలీ భాషలో పూర్తిస్థాయి నివ్య, లైవ్ సీడీ, ఆంగ్లం నుండి బెంగాలీకు అను వాదం, బెంగాలీ ఓసీఆర్, బెంగాలీ మహాపదనిఘంటువు రూపొందిం చడం వీరు చేస్తున్న ఇతర కార్యక్రమాలు.

స్వతంత్ర మలయాళం కంప్యూటింగ్ పేరుతో పని చేస్తున్న ఈ స్వచ్ఛంద సంస్థ కేరళ కేంద్రంగా మలయాళం, ఇతర భారతీయ భాషలలో పలు ఉపకరణాలను రూపొందించింది. ఆండ్రాయిడ్ లో తెలుగుతో సహా అన్ని భారతీయ భాషలలో టైపింగ్ చేసే వెసులుబాటును తెచ్చింది.

**స్వేచ్ఛ :**

ఈ సంస్థ హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తోంది. తెలుగులో ఉచితంగా నిర్వహణా వ్యవస్థ(Operating System) అందించాలనే ఉద్దేశ్యంతో రూపొందించిన సంస్థ. స్వేచ్ఛ అనే పేరుతో అందరూ ఉపయోగించడానికి వీలున్న నివ్యను, బాలస్వేచ్ఛ అనే పేరుతో పిల్లలకు స్కూలు స్థాయిలో ఉపయోగపడే సాఫ్టువేర్లతో నిర్వహణా వ్యవస్థను రూపొందించారు.

(ఈ వ్యాసంలోని విషయాలు వికీపీడియా en.wikipedia.org నుంచి సంగ్రహించినవి. సీసీ–బై–ఎస్ఏ లైసెన్స్ ద్వారా పంపిణీ)

పిట్టచూపు

# కాలుష్యపు కోరల్లో కాలిపోతున్న నగరజీవనం

-చలసాని నరేంద్ర,
98495 69050

**ఏ పార్టీ అధికారంలో ఉన్నా నగరాల అభివృద్ధి పట్లనే దృష్టి కేంద్రీకరిస్తున్నది. గ్రామీణ జీవనాన్ని పరిపుష్టి చేయడం పట్ల తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నది. దానితో గ్రామాలకు వలసలు పెరుగు తున్నాయి. గ్రామీణ జీవనాన్ని సౌకర్యవంతంగా చేయడం కోసం, ఆధునిక పౌర సదుపాయాలు కల్పించడం కోసం ఎంతగా ప్రయ త్నాలు చేస్తున్నా అవసరాలకు సరిపోవడం లేదు. దానికి తోడు ప్రభుత్వ ప్రాధాన్యతలు సహితం తగిన విధంగా ఉండటం లేదు.**

దానితో కాలుష్యం రోజురోజుకు పట్టాన ప్రజల ప్రాణాలను కబళిస్తోంది. వాహనాలపై రోడ్లపైకి రావాలంటేనే హడలిపోవాల్సిన పరిస్థితి నెలకొంటోంది. దుమ్ము-ధూళి కణాలు నగర జీవనంలో ఒక భాగం అయిపోయాయి. ఇంటి నుంచి బయటకు వచ్చింది మొదలు ఇక మనం ధూళి ప్రయాణం చేయాల్సి వస్తోంది. దీంతో పలురకాల వ్యాధులు వస్తున్నాయి. విపరీతంగా పెరిగిపోయిన వాహ నాల వల్ల ఈ కణాలు మరింత ఎక్కువయ్యాయి.

ముఖ్యంగా నగరాల్లో బయట అడుగుపెడితే చాలు దుమ్ముతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు, విదేశీయులు మన నగరానికి వస్తే ఇక్కడ నెలకొన్న కాలుష్యం చూసి భయపడిపోతున్నారు. కొన్ని ప్రాంతాల్లో అయితే ఎదుటి మనిషి కనిపించనంతగా దుమ్ము లేస్తోంది. వాహనం నుంచి వెలువడే పొగ కంటే కూడా దుమ్ము-ధూళి అధికంగా లేస్తున్నది.

అయితే ఈ కణాలు చాలా ప్రమాదకరమని ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) నిర్ధారించింది. దుమ్ము-ధూళి కణాల కార ణంగా ఊపిరితిత్తుల క్యాన్సర్, ఆస్థమా, అలర్జీలు, శ్వాసకోశ వ్యాధు లతో మరణించే వారికి సంఖ్య రోజురోజుకు పెరిగి పోతోందని హెచ్చరించింది. తెలుగు రాష్ట్రాలలో సహితం కాలుష్యం పలు నగరా లలో విపరీతంగా పెరిగింది.

పట్టణాల్లో అంతకంతకూ పెరిగిపోతున్న జనాభా, వాహనాల కారణంగా కాలుష్యం విపరీతంగా పెరిగిపోతోంది. రహదారులు, ఫుట్‌పాత్‌లు, డివైడర్లను ఒకసారి పరిశీలిస్తే వాటిపై దుమ్ము-ధూళి మట్టిగడ్డలు కనిపిస్తాయి. అందులో దాగి ఉన్న కణాలు మానవ జీవితానికి చేటు చేస్తున్నాయి.

ఇటీవల ప్రభుత్వం విజయవాడ నగర పాలక సంస్థ, రాజధాని ప్రాంతంలో రహదార్లను శుభ్రం చేయడానికి రెండు ఊడ్చే యంత్రాల (స్వీపింగ్ మిషన్లు)ను కొనుగోలు చేసింది. వీటిలో ఒకటి విజయవాడ నగరంలోనూ, మరొకటి రాజధాని ప్రాంతంలోనూ తిరుగుతూ ఉంటాయి. దీన్ని బట్టి చూస్తే కొన్ని కోట్ల కణాలు గాలిలో ఉంటాయి. ప్రస్తుతం నగరంలో ఊడ్చే యంత్రాలు రహదారులను శుభ్రం చేసుకుంటూ తిరుగుతున్నాయి.

రాష్ట్రప్రభుత్వ పాలనకు విజయవాడ కేంద్రంగా మారిన తరు ణంలో ట్రాఫిక్ రద్దీ పెరిగింది. ఈ పరిస్థితుల్లో గతం కంటే ధూళి మరింత పెరిగింది. ఊడ్చే యంత్రాలను ప్రభుత్వం మరిన్ని అందిస్తే నగర జీవనానికి కాస్తంత ఉపశమనం కలుగుతుంది. ఇవి నగరమంతా తిరిగితే కాస్త అయినా నగరం శుభ్రంగా ఉంటుంది.

ఆస్ట్రియా, అస్తానా లాంటి దేశాలు కాలుష్యాన్ని నిర్మూలించ టంతో కొత్తగా ఆలోచిస్తున్నాయి. ఆయా దేశ రాజధాని నగరాల్లో ఊడ్చే యంత్రాలు నిరంతరం రహదార్లపై కనిపిస్తాయి. రోడ్లపై వెళు తుంటే దుమ్ము కాలుష్యం చాలా తక్కువగా కనిపిస్తుంది. ఏ రోడ్డు చూసినా పరిశుభ్రంగా ఉంటాయి. రహదార్లపై సేకరించిన దుమ్మును వాహనాలు నగర శివారుకు తీసుకెళ్లి వదులుతాయి. ఫలితంగా ప్రజలు కొన్ని వ్యాధులకు దూరంగా బతుకుతున్నారు.

ప్రతి లక్ష మందిలో 149.9 మంది ఊపిరితిత్తుల వ్యాధుల తో మరణిస్తున్నట్లు డబ్ల్యూహెచ్‌వో సర్వేలు చెబుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ఊపిరితిత్తుల వ్యాధులతో మరణించే వారికి సంఖ్య 27 శాతం ఉండగా ఒక్క భారత దేశంలోనే 11 శాతం వరకు ఉండటం కలవరపాటుకు గురిచేస్తోంది. ప్రపంచంలో వాయుకాలుష్యం మరణా లకు అతిపెద్ద ఐదవ కారణం అవుతూ ఉండగా మన దేశంలోని నగరాలలో మాత్రం రెండో పెద్ద కారణం అవుతున్నది. ఢిల్లీలో పుట్టే ప్రతి మూడవ శిశువు ఊపిరితిత్తుల సమస్యలతో పుడుతున్నారు.

రహదారులే ప్రధానంగా కాలుష్యానికి కేంద్రాలుగా మారు తున్నాయి. ప్రధాన రహదారులకు ఇరువైపులా 500 మీటర్ల వరకు నివసించే వారందరూ కాలుష్య బాధితులు కావలసి వస్తున్నది. ఇక జలకాలుష్యం సంగతి చెప్పనవసరం లేదు. ప్రపంచంలో మరే దేశంలో లేని కఠినమైన నీటి, వాయు కాలుష్య నివారణ చట్టాలు ఉన్నాయి. వాటి అమలులో మాత్రం ఎటువంటి శ్రద్ధ చూపడంలేదు.

దేశం మొత్తం మీద ఇంతవరకు కాలుష్యానికి కారణమైన పౌర సంస్థలపై కేసులు నమోదు చేసి, తగు శిక్షలు పడేటట్లు చేసిన దాఖ లాలు లేనే లేవు. దేశంలోని దాదాపు అన్ని ప్రధాన నగరాలలో 40 నుండి 60 శాతం వరకు కాలుష్యం వాహనాల వల్లనే వస్తున్నది. అందుకు ప్రధానంగా డీజిల్ వాహనాల వినియోగం అని వేరే చెప్ప నవసరం లేదు. మొత్తం వాహనాలలో 45 నుండి 55శాతం వరకు డీజిల్ వాహనాలు ఉంటున్నాయి. వాటిని కఠినం చేసే విధంగా ప్రభుత్వం తగు విధానపర నిర్ణయాలు తీసుకోవలసి ఉంది.

దేశం మొత్తంమీద నగరాన్ని కాలుష్యరహితంగా ఉంచడం కోసం ఢిల్లీలో పౌరసమాజం తీవ్రమైన కృషి చేసింది. అందుకు ఉన్నత న్యాయస్థానాలు సహితం క్రియాశీలంగా వ్యవహరించి కఠిన తరమైన నిబంధనల అమలుకు ప్రయత్నం చేశారు. పెద్ద ఎత్తున సీఎన్జీ ఇంధనాన్ని వినియోగంలోకి తేవడంతో కాలుష్యాన్ని చాలా వరకు ఒక దశాబ్దకాలం పాటు కట్టడి చేశారు. అయితే తిరిగి ఇప్పుడు పరిస్థితులు యధాస్థితికి చేరుకోవడంతో తిరిగి కఠిన నిర్ణయాలు తీసుకోవలసిన అవసరం అవుతున్నది.

నగరాలలో వాయు కాలుష్యాన్ని కట్టడి చేయడం కోసం ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేసే విధంగా ప్రభుత్వం చర్యలు ఉండాలి. అయితే మొత్తం ప్రభుత్వం ప్రణాళికలు అన్ని 10 శాతం కన్నా తక్కువగా వినియోగించే కార్లు వేగంగా, ఎక్కడ సిగ్నల్ లైట్

లేకుండా వెళ్లే విధంగా తయారు చేస్తున్నారు. నగరంలోని బస్సులకు ప్రత్యేక దారి ఏర్ప ర్చడం ద్వారా వేగంగా, త్వరగా అవి ప్రయాణం చేసే పరిస్థితుల కల్పన పట్ల దృష్టి కేంద్రీకరించడం లేదు.

సగమందికి పైగా బస్సులలోనే ప్రయాణం చేస్తున్నారు. మరో 30 శాతం మంది ద్విచక్ర వాహనాలు, సైకిళ్లపై ప్రయాణం చేస్తున్నారు. ప్రభుత్వ విధానాలు బస్సులలో ప్రయాణం చేసే వారిని శిక్షించే విధంగా ఉన్నాయి. ప్రపంచంలో మరెక్కడా లేని విధంగా మన దేశంలో బస్సులకు అత్యధికంగా పన్నులు విధిస్తున్నారు. కార్లపైన కన్నా పలు రేట్లు ఎక్కు వగా పన్నులు విధిస్తున్నారు. బస్సులను ఆదాయ వనరుగా ప్రభుత్వం పరిగణిస్తునండి గాని ప్రజలకు సులభమైన రవాణా వ్యవస్థ కల్పించే సదుపాయంగా పరిగణించడం లేదు.

నగరాలలో 6-8 వరుసల ఎక్స్‌ప్రెస్ హైవేలను ఏర్పాటు చేస్తూ ఉండటం వల్లనా పలు కి.మీ.వరకు రోడ్డు దాటటమే అసాధ్య మవుతున్నది. రోడ్లు దాటాలి అంటే పలు కి.మీ.అదనంగా ప్రయాణం చేయవలసి వస్తుంది. దానికోసం ప్రజా రవాణాను ఉప యోగించుకోవడాన్ని ఒక విధంగా నిరుత్సాహ పరచిన్నట్లు అవుతున్నది. ప్రజా రవాణా వ్యవ స్థను పటిష్ట పరచాలి అంటే బస్సు స్టేషన్లు, మెట్రో స్టేషన్లకు వెళ్ళడానికి వీలుగా పాద చారులకు, ద్విచక్ర వాహనదారు లకు సరైన రహదారులు, మార్గాలు ఏర్పరచాలి. మంచి పార్కింగ్ ప్రదేశాలు కూడా ఏర్పరచాలి.

హైదరాబాద్ నగరంలో నిర్మాణంలో ఉన్న మెట్రో స్టేషన్‌లకు చెప్పుకోదగిన పార్కింగ్ సదుపాయం కనిపించడం లేదు. పార్కింగ్ కోసం పాఠశాలల స్థలాల కోసం పలుచోట్ల అధికారులు ప్రయత్నం చేస్తున్నారు. ఇరుకైన రహదారులలో దూరంగా పార్కింగ్ సదు పాయం ఏర్పాటు చేస్తే సౌకర్యవంతంగా ఉండబోదు. 15 ఏళ్ళ పైబడిన వాహనాల ఉపయోగాన్ని నిరోధించాలని చాలాకాలంగా అనుకొంటున్నా నిర్దుష్టమైన ఒక ప్రోత్సాహకర ప్రణాళికతో ప్రభుత్వం ప్రజల ముందుకు రావడం లేదు.

నగరాలలో కాలుష్య పరిస్థితులను నమోదు చేసి, ఎప్పటికప్పుడు తగు నివారణ చర్యలు తీసుకొనే వ్యవస్థలను ఏర్పాటు చేసు కోవడం లేదు. దేశంలో సుమారు ఐదు వేల నగరాలు, పట్టణాలు ఉండగా కేవలం 34 నగరాలలో మాత్రమే అంతర్జాతీయ ప్రమా ణాలతో వాయు నాణ్యత పర్యవేక్షక కేంద్రాలు ఉన్నాయి. అయితే 22 కేంద్రాలలో మాత్రమే ప్రభుత్వం పనిచేస్తున్నాయి. ఈ కేంద్రాలు పని చేస్తున్నా, అవి నమోదు చేసిన సమాచారం అనుసరించి తక్షణం స్పదించే విధానాలు ఏవీ లేవు.

ఉదాహరణకు పలు ఐరోపా దేశాలలో కాలుష్యం ఎక్కువగా ఉన్నట్లు నమోదయితే తక్షణం తీవ్రతను బట్టి ఆ నగరంలోని విద్యుత్ ఉత్పాదన కేంద్రాలను మూసి వేయ డమే, కొన్ని పరిశ్రమలను మూసివేయడం వంటి చర్యలు తీసుకొంటారు. కానీ ఇక్కడ వివిధ ప్రభుత్వ విభాగాల మధ్యనే తగు సమ న్వయము ఉండటం లేదు. ఉదాహరణకు వాహనాల కాలుష్యం మన నగరాలలో తీవ్ర మైన సమస్య అవుతూ ఉండగా వాటిపై గురించి తగు చర్యలు తీసుకొనే అధికారం కాలుష్య నియంత్రణ మండలులకు లేదు. ఆ అధికారం ఉన్న రవాణా శాఖలు పన్నులు వాసులు, జరిమానాలు విధింపు పట్ల చూపే శ్రద్ధను కాలుష్యం అంశంపై చూపడం లేదు.

కాలుష్య నివారణ మండలిలు పారి శ్రామిక కాలుష్య అంశాలకు పరిమితం అవు తున్నాయి. అయితే ప్రస్తుతం కొత్త పరిశ్ర మలు అన్నింటిని నగరాలకు శివారులకు పంపుతూ ఉండటం, విద్యుత్ పథకాలు ఏవీ నగరాల మధ్యలో ఉండక పోవడంతో నగరా లపై పారిశ్రామిక కాలుష్య ప్రభావం 4 నుండి 8 శాతంకు మించి ఉండటం లేదు. వాహ నాలు ప్రతి ఆరు నెలలకు ఒకసారి కాలుష్య ధ్రువీకరణ పత్రాలు పొందాలని నిబంధనలు ఉన్నా ఆ విధమైన పత్రాలు జారీ చేసే వారి యంత్రాల నాణ్యత పట్ల ఎటువంటి శ్రద్ధ చూపడం లేదు. కేరళలో మినహా వాటి నాణ్యత గురించిన పర్యవేక్షణ లేనే లేదు.

పలుచోట్ల అసలు వాహనాల కాలుష్య స్థాయిలతో సంబంధం లేకుండా ధ్రువ పత్రా లను జారీ చేయడం జరుగుతున్నది.

హైదరాబాద్ నగరంలో పొడి, తడి వ్యర్థ పదార్ధాలను విడి విడిగా సేకరించాలని ప్రతి ఇంటికి రెండు రంగులలో రెండు ప్లాస్టిక్ బుట్టలు సరఫరా చేసినా ఆ విధంగా సేకరిం చడం జరగడం లేదు. మన ప్రజలకు విడిగా వ్యర్థ పదార్ధాలను పారవేసి అలవాటు కల గడం లేదు. అందుకనే ఈ మధ్య విజయ వాడలో పొడి, తడి వ్యర్ధ పదార్ధా లను కలిపి పునరుత్పత్తి చేసే యంత్రాలను సమకూర్చు కున్నారు. ఇటువంటి ప్రయత్నం అన్ని నగరా లలో జరగవలసి ఉంది.

కాలుష్య నివారణ యంత్రంగాన్ని ప్రభుత్వం పటిష్ట పరచి, ప్రయోజనకరంగా ప్రమాణాలను అమలు జరిపే ప్రయత్నం జర పాలి. అందుకోసం ప్రజలను కూడా విశ్వాసం లోకి తీసుకోవాలి. ❋

## పద్యకవిత

### మానవుండు వింత మానవుండు

**ప**రుల దప్పులెన్న పరుగు పరుగున పోవు
తానెఱుంగ దలడు తనదు తప్పు
పరులనీతి తనకు వర్తింపనెఱుగని
మానవుండు వింత మానవుండు

**వి**ఱ్ఱవీగు తాను విద్యలో ఘనుడని
వినయమింత లేని వెడగువోలె
సూరిజనుల చెంత సుంతనోర్వప్పని
మానవుండు వింత మానవుండు

**అ**ంతు పంతు లేని ఆశల నిశ్రేణి
నందరాని పండు నందుకొనగ
అలుపు సొలుపు లేక ఆతురపడుచుండు
మానవుండు వింత మానవుండు

**మ**ంచినెఱిగికూడ మంచిగా నుండడు
చెడును తెలిసి తెలిసి చేయుచుండు
అర్థవ్యత్యయమందు అభిమానమును చూపు
మానవుండు వింత మానవుండు

**ఆ**యువహరహంబు అంతరించుచునుండు
అంతులేని కాంక్ష నటమటించు
భవిత తెలియకున్న పర్వెత్తు దానికై
మానవుండు వింత మానవుండు

**-ఎన్. వి రమణయ్య**
9492655144

అమ్మనుడిపై నెనరు
లేనివాడు
కన్నతల్లినీ, పుట్టిన నేలనీ
ప్రేమించలేడు..

బయటి తెలుగు బతుకు కతల మాలిక-6



# ఓ సంచారి అంతరంగం

కుప్పె నాగరాజ గారు
కన్నడంలో రచించిన
'అలెమారియ అంతరంగ'కు
రంగనాథ రామచంద్రరావు
(9059779289) గారి
తెలుగు అనువాదం

## మారెమ్మ జాతర

మా ఊరిలో ప్రతి ఏడు ఉగాది పండుగ లేదా దానికి పదిహేను రోజులకు ముందుగా పదివూళ్ళ జనం చేరి జరిపించే 'హూసూరు మారెమ్మ' జాతర ప్రత్యేకమైంది. మా దాసరులంతా ఏ ఊళ్ళో తిరుగుతున్నా ఈ జాతర సమయానికి సరిగ్గా ఊరు చేరుకునేవారు.

"హూసూరు మారెమ్మ జాతర" అంటే మాకు సంబరమే సంబరం. ఆరోజు మా బంధుబలగమంతా ఊరికి వచ్చేవారు. మా పిన్నమ్మలు, వాళ్ళ పిల్లలు, అన్నాతమ్ముళ్ళంతా వచ్చేవారు. అమ్మ ఆ రోజు జాతరకు వెళ్ళే సమయానికి అనపగింజల చారు లేదా మొలకెత్తిన అలసందల చారు చేసి వడ్డించేది. ఆ చారు గుమగుమలాడేది. కడుపు నిండా తిని జాతరకు బయలుదేరేవాళ్ళం. ఆ జాతర ప్రత్యేకత ఏమిటంటే ఉదయం ఆరేడు గంటలకు మొదలైన జాతర సాయంత్రం ఆరుగంటలకు ముగిసి ఆ ప్రాంతమంతా పూర్తిగా ఖాళీ అయ్యేది. చీకటి పడ్డాక ఒక్క నరపురుగూ అక్కడ ఉండేది కాదు. ఆ సంవత్సరం పెళ్ళయిన కొత్త దంపతులు తప్పకుండా ఈ జాతరకు వచ్చి పూజలు చేయించేవారు, ఆడపిల్లలు సువాసనలు వెదజల్లే పూవులు తలలో ముడుచుకుని వెళ్ళటం ఒక పద్ధతి. ఆ గుడి ఉన్న నాలుగు దిక్కుల నుంచి ఛత్రచామరాల సమేతంగా దేవతలను ఊరేగింపుగా తెచ్చేవారు. నాలుగు దిక్కుల నుంచి తీసుకువచ్చిన దేవతలతో జనాల గుంపు చేరి నేలమీద సూదిమొన మోపనంత స్థలం ఖాళీ ఉండేది కాదు. ఆ జాతరలోని అంగళ్ళలో రకరకాల బెండులు, బత్తాసులు, గాజులు, ఆటసామాన్లు , భగభగమని మండే ఎండలో వచ్చే భక్తాదుల దాహం తీర్చడానికి రంగురంగుల షరబత్తులు, కొబ్బరి నీళ్ళు, పుచ్చకాయలు, దోసకాయలు మొదలైన చలువ పదార్థాలను పెట్టుకుని అమ్మే వ్యాపారులు- వీటన్నిటిని చూడటమే ఒక వైభోగం. వందలాది మంది ఆడవాళ్ళు, మగవాళ్ళు, పిల్లలు మొక్కులు తీర్చటానికి నోటికి, నాలుకకు ఇనుప చువ్వలను గుచ్చుకుని వచ్చేవారు. దేవాలయం దగ్గరికి వచ్చి ఆ చువ్వలను తీయించి, పూజలుచేసి మొక్కు తీర్చేవారు. ఆ గుడి ముందు నుంచున్న పూజారయ్య మొక్కులు చెల్లించడానికి తెచ్చిన కోళ్ళను, గొర్రెలను, మేకలను కసుక్కున నరికి విసిరేసేవాడు. మేము ఈ దృశ్యాలనంతా చూసి సంబరపడేవాళ్ళం.

మా చుట్టుపక్కల ఊళ్ళలోని జనమంతా ఎడ్లబళ్ళు కట్టుకుని ఇంటి వాళ్ళందరిని ఎక్కించుకుని ఎడ్లబండికి టార్పాల్ కట్టి, ఎడ్ల మెడలో గజ్జెలు కట్టి జాతరకు బయలుదేరేవాళ్ళు. మాకు ఎడ్లబండి ఉండకపోవటంతో మేము బండ్లు సాగిన దారి పట్టుకుని ఆ బండి వెనకాల పరుగెడుతూ వెళ్ళేవాళ్ళం. జాతరకు వెళుతున్నామన్న సంబరంలో భగభగమండే ఎండ కూడా మమ్మల్ని ఏమీ చేసేది కాదు. మా తల్లితండ్రులు ఒకటో రెండో రూపాయలు ఇస్తే అదే గొప్ప. ఆ జాతరలో దొరికే బొంబాయి మిఠాయి తిని, ఒక్కొక్క సేరు పప్పులు జేబులో నింపుకుని ఆ మారెమ్మ గుడి ముందు నుంచుని చేతులు జోడించి నమస్కరించి, సాయంత్రం అయిదు గంటల సమయంలో జాతర నుంచి వెనుతిరిగేవాళ్ళం.

జాతర ముగించుకుని ఊరికి తిరిగి వచ్చేలోగా ఊర్లో పూజకు అంతా సిద్ధంగా ఉండేది. అప్పుడు అందరి ఇళ్ళలో చల్లముద్దలతో కంచాలు సిద్ధమై నిర్ణయించుకున్న ఒక నిర్దిష్ట స్థలానికి ఆడవాళ్ళందరు చల్లముద్దల హారతులు తెచ్చేవాళ్ళు. ఆ స్థలాన్ని చిమ్మి, కళ్ళాపి జల్లి మూడు రాళ్ళు పెట్టి వేపాకుల హారంతో అలంకరించి చల్లముద్దల కంచాలను దాని ముందు పెట్టి మాలో నుంచి ఒకరు పూజ చేసేవారు. పదిమంది చేరి వంతులు వేసుకుని కొనితెచ్చిన గొర్రెనో, మేకనో నరికి మారెమ్మకు బలిచ్చేవాళ్ళు. బలి తరువాత దాని చర్మాన్ని వొలిచి, కోసి అందరి ఇళ్ళకు సమాన కుప్పలు చేసి ఇళ్ళకు తీసుకుని వెళ్ళేవారు. ఆ రోజు దాసరులవాడ మొత్తం మాంసం చారుతో గుమగుమలాడేది. ప్రతీ ఇంట్లో సారాయి సీసాలు, భంగూ యొక్క సమారాధన జరిగేది. సంవత్సరమంతా ఊరూర్లూ తిరిగి సంపాదించిన సొమ్మును ఖర్చు చేసి మరుసటి రోజుకు అందరూ జేబులు ఖాళీ చేసుకునేవారు.

పండుగ జరిగిన మరుసటి రోజున ఏవైనా జరిగిన తప్పులు గుర్తొచ్చి వాటి గురించి ఎవరైనా కుల యజమాని దగ్గర ఫిర్యాదు చేస్తే వాటి గురించి కులపంచాయితీ జరిపి న్యాయ నిర్ణయం చేసి తప్పు చేసిన వారికి పంచాయితీ నిర్ణయం ప్రకారం దండన విధించేవారు. ఆ దండన సొమ్మును అదే రోజు మాంసానికి, సారాకు తగలేసి మళ్ళీ తమ ముందరి కాయకానికి బయలుదేరేవారు. ఈ పరిస్థితుల తలాతోక ఒక్కటీ అర్థం కాక నేను కళ్ళు విప్పార్చుకుని చూస్తూ నుంచునేవాడిని. ఈ పండుగ జాతర ముగియగానే యధా ప్రకారంగా కుటుంబ సమేతంగా దేశాటనానికి బయలుదేరేవాళ్ళు. మూడునాలుగు కుటుంబాలవారు మాత్రం కష్టమో, సుఖమో అక్కడే నివాసం ఉండటానికి ప్రయత్నించేవాళ్ళం.

ఆ జాతర సమయంలో ఊళ్ళో రైతుజనం నాటకాలు నేర్చుకుని



జాతర రోజున మండ్య నుంచి సీన్లు తెప్పించి నాటకం వేయటం వాడుక. ప్రతీ సంవత్సరం రెండు గ్రూపులవారు నాటకాలు నేర్చుకునేవారు. ఒక నాటకం ఉగాది పండుగ రోజున వేస్తే, మరొకటి జాతర రోజున వేసేవారు. పై వీధిలో చిన్నాన్నా గోవిందయ్యగారు "రామాయణం" నేర్పితే, కింది వీధిలో మా మేనమామ లక్ష్మణమూర్తి 'సత్య హరిశ్చంద్ర' నేర్పేవారు. మా దాసరుల బయలు నాటకాలు చూసి ప్రభావితులైన గ్రామీణులు తాము సంవత్సరానికి ఒకసారి ఈ నాటకాలను నేర్చుకుని ప్రదర్శించి సంతోషపడేవారు.

## కులపంచాయితీ

దాసరుల గుడిసెలున్న ప్రధాన వీధుల్లో కులపంచాయితీ పెద్దలు చేరారు. పున్నమి రోజు. ఆ నీలాకాశం శుభ్రంగా చంద్రుడి కాంతిలో వెలుగుతూ తన చల్లటి కాంతిని భూమికి పంపి ఆ వెలుతురు దాసరుల గుడిసెల మీద కూడా ఎలాంటి తారాతమ్యాలు లేకుండా పడుతోంది. గత పదిపదిహేను రోజుల నుంచి 'నిద్రపల్లి' అని బయట వుంటున్న దాసరులూ ఆ రోజు తమ ఊళ్ళకు మరలారు. మా సల్లాపురి ముత్తయ్య వయస్సుకు వచ్చిన కొడుకు ముత్యాలు భిక్షాటన, నాటకం అంటూ ఊళ్ళు పట్టుకుని తిరుగుతూ, తనలాగే సంచారిగా తిరుగుతున్న 'పిచ్చగుంట్ల' అనే సంచార కుటుంబంతో పరిచయం కలిగి, ఆ కుటుంబంలోని అమ్మాయితో స్నేహం పెంచుకున్నారు, ఆ స్నేహం ప్రేమగా మారి ఆ అమ్మాయిని ఎవరికీ చెప్పా పెట్టకుండా తన వెంట తీసుకునిపోయి ఆమెతో కొన్నాళ్ళు సంసారం చేసి ఊరికి పిలుచుకుని వచ్చాడు. ఈ విషయం తెలిసిన కులస్థులు 'అతడిని కులంలోకి చేర్చుకునే వరకూ ఎవరూ ఆ కుటుంబంతో సంబంధం పెట్టుకోకూడదని, 'నిప్పు– నీళ్ళు' ఇవ్వకూడదని బహిష్కరించారు.

గంగిరెద్దును ఆడించే మా మామయ్య భార్య లక్ష్మీకీ, మా గుండ్లు గంగయ్య భార్య యంకటికీ ఇంట్లో ఏదో కోడి దూరిందన్న కారణంగా గొడవ జరిగింది. వాళ్ళిద్దరూ జుత్తులు పట్టుకుని పెనుగులాడారు. మా యంకటమ్మ ఆ లక్ష్మీని పరకతో కొట్టింది. ఈ విషయాన్ని మారయ్య పంచాయితీ ముందు పెట్టాడు.

ఆ రోజు ముఖ్యంగా ఈ రెండు ఫిర్యాదులను విచారించి తీర్పు చెప్పాల్సి ఉంది. ఆ వెన్నల వెలుతురులో అందరూ నట్టనడివీధిలోకి వచ్చి చేరారు. ఆ నడివీధిలో మా మారయ్య రెండు చాపలు తెచ్చి పరిచాడు. ఆ చాప మీద న్యాయాధీశుల స్థానంలో ఉన్న మా నాన్న, చిన్నాన్నలు కూర్చున్నారు. మిగతా వాళ్ళంతా వారి చుట్టూ ముందు వెనకాల కూర్చున్నారు. ఆ చాప మీద ఆకువక్కలు పెట్టి అక్కడ అగరొత్తులు వెలిగించి పెట్టారు. పంచాయితీకి ప్రతీ ఇంటి నుంచి అందరూ హాజరు కావాలి. అందరూ వచ్చారో లేదోనని తనిఖీ చేశారు. ఎవరైనా రాకపోయివుంటే వాళ్ళను కేకలు పెట్టి పిలిచారు. ఈ విచిత్రమైన న్యాయాన్ని చూడాలని ఆడవాళ్ళు, పిల్లలు అందరూ వీధిలోకి వచ్చి కూర్చున్నారు. నేను అమ్మ వెంబడి వచ్చాను. అమ్మ చీరచెంగు చాటున కూర్చుని జరుగుతున్నదంతా గమనిస్తున్నాను.

నాన్న మొదలుపెడుతూ, "సూదండబ్బా, ఈడ కులస్త్రంత సేరుండారు. ఇది న్యాయస్థానము. ఈడ అపద్దము తటవటము సెప్రాదు. కులమోళ్ళు ఏమ్ తీర్మానము సెప్తారో దాన్ని మీరు ఒప్కోనాల" అని చెప్పి ఒకసారి అన్నివైపులా కూర్చున్న కులస్థులందరిని కలయజూశాడు. మా సల్లాపురి ముత్తయ్య తన అరచేతిలో గంజాయి ఆకులను పెట్టుకుని, గింజల్ని కింద పారవేసి, దానికి చుక్కనీళ్ళు కలిపి, తన కుడి చేయి బొటనవేలితో చక్కగా నలిపి తన ముందున్న మట్టి చిలుములో దాన్ని నింపసాగాడు. మరొకవైపు ఆకువక్కలు, కాచు నోట వేసుకుని మా అవ్వ మూగూరమ్మ, ఇతర ఆడవాళ్ళు, పిల్లలతో కబుర్లు చెప్పసాగింది.

ప్రాయానికి వచ్చిన తుంటరిపిల్లలు ఆ గుంపులో చోటు చేసుకుని పెద్దవాళ్ళకు కనిపించకుండా బీడిలు కాల్చి పొగలు వదులుతూ ఆనందిస్తున్నారు. మా ముత్తయ్య తాను బాగా నలిపి నింపిన

గంజాయి ఆకుల చిలుముకు తడిబట్టను చుట్టి కొబ్బరి నారతో చేసిన దారానికి నిప్పంటించి ఆ నిప్పును ఆ చిలుము నోటికి పెట్టి, తన కుడి చేయి మీద దాన్ని పెట్టి, ఎడమ చేత్తో దాన్ని మూసి అత్యంత గౌరవంతో, భక్తితో నాన్న చేతికి అందించి "తీస్కో మామా ప్రసాదము" అన్నాడు. నాన్న ఆ చిలుమును తన చేతిలోకి తీసుకుని ఒక దమ్ములాగి, తన పక్కన కూర్చున్న చిన్నాన్న చేతికి అందించాడు. చిన్నాన్న తానూ దమ్ములాగి ఆ చిలుమును మరొకరికి బదిలీ చేశాడు. ఆలా అక్కడ గుమికూడిన ఇంటి యజమానులందరూ ఒక్కొక్క దమ్ము లాగారు. ఈ మధ్యలో గుసగుసగా మాట్లాడుకుంటున్న సభలోని వారిని చిన్నాన్న లేచి కసరి వాళ్ళ సద్దుమణిగాక, "ఊఁ అదేమిటో మాట్లాడండి" అన్నాడు.

మా సల్లాపురి ముత్తయ్య ఒక దమ్ము లాగి చిలుమును కింద పెట్టి, లేచి నుంచుని, కుల పంచాయితీకి చేతులు జోడించి నమస్క రించి, "సూడండి, నా కొడుకు ముత్యాలుడు నాల్గయిదు నెలల ఎనక "నిద్రపల్లి"కి పోయినప్పు ఆడ అద్యావుదో ఆడబిడ్డ్ని వాడ్ జొత్లో పిల్సకని వచ్చిండాడు. అద్నే ఒక దేవస్థానమ్లో బొట్ కట్టి పెండ్లాము అంట ఒప్పుకోని వొచ్చాడు. వాడ్ని కులపద్ధతిగా శుదుం సేస్కొని మన జాతికి సేరిచ్చుండి. ఆ తప్పు, నెప్పు కులబలగస్థలంతా ఏమి సెప్తారో దాన్కి నా సమ్మతి ఉంది" అని చెప్పి కూర్చున్నాడు.

మా పిన్నపెద్ద గంగయ్య అక్కడే కూర్చున్న ముత్యాలును, అతను తీసుకొచ్చిన ఆ పిచ్చుగుంట్ల ఆడపిల్లను దగ్గరికి పిలిచి-"మీరిద్రు



ఒప్కొని వచ్చుండార" అని అడిగాడు. దానికి ఆ ఆడపిల్ల. "ఊఁ అని తలూపి నేలను చూస్తూ నుంచుంది. దానికి యజ మాని "అదేమి నీ సమాచారము కొద్ద. చెప్పు. మీ అబ్బ, అమ్మ ఇద్దరూ ఒప్కొన్నార ఎట్లా?" అని అడిగాడు. అందుకు ఆ ఆడపిల్ల "మా సంసారము అరసీకెర నింకా అట్లానె ఊరూరు తిరక్కని కిక్కేరికి ఒచ్చాము. ఆడ కిక్కేరమ్మ దేవస్థానము తావు పెద్దపాలమాను దిగున మా బిడారము ఏస్కోని ఆడ్నే సుట్లు ఉండ్న పల్లలు తిరుక్కోని మా కులకసుబ సేస్కోని సుమారునాళ్ళు ఆ మానకిందనే ఉంట్మి. ఆడ్నే ఈ దాసరోళ్ళ కుటుంబము ఉండె. అప్పుడ్నె మా ఇద్రుకు పరిచయం ఐయింది. అక్కడ్నింక పార్‌పోయి హేమగిరొ దేవస్థానములో వీళ్ళు నాకి బొట్ కట్నారు. మన ఇంటోళ్కు ఈ విషయమ్ గొత్తయి యట్లనో బదకండి అంట ఊర్కె ఐరి" అంది. కులపంచాయితీ వీళ్ళిద్దరి ప్రేమ కథ విని సంతృప్తి పడ్డట్టు ఒకరి నొకరు చూసుకున్నారు. మా చినాన్న గోవిందయ్యగారు "ఇప్పడు కులబాందవలికంతా విషయము గొత్తయినట్ల ఆయ. ముంద్రకి నీ తీర్మానము ఏమి చప్పన్న" అని నాన్న వైపు తిరిగి అన్నారు. నాన్న తన ధ్యానస్థితి నుంచి బయటికి వచ్చినవాడిలా మా మామయ్య ముత్తయ్య వైపు తిరిగి "ఇప్పడు కులస్లంతా ఒక తీర్మానమ్కి వచ్చినట్ల ఐయింది. నూవూ అదేమి కులాన్కి తీస్కనకి కావస్లన వ్యవస్థ చేస్కో" అని చెప్పాడు. దమ్ములాగుతున్న చిలుమెను కిందపెట్టి లేచి నుంచుని కులపంచాయితీకి చేతులు జోడించి, "కులపంచాయితీ తీర్మానాన్కి నేను బద్ధం. నేను రేపే ఈ కార్యమ్ని ముగిపించేకి మీరంత ఒప్గి ఈయండి. నేను దీన్కి కావల్సినంతా వ్యవస్థాని నా యోగ్తానుసారము చేస్కుంటాను"అని చెప్పాడు. అప్పటికే మధ్యరాత్రి గడిచి కొత్త రోజు ప్రారంభమైంది. అందరూ లేచి తమతమ గుడిసెలు చేరుకున్నారు.

ఆ రోజు మా దాసరుల గుడెసెల్లో ఒక సంభ్రమం చోటుచేసు కుంది. 'గోష్ఠి' చేసి ఆ ఆడపిల్లను తమ కులంలో చేర్చుకునే కార్య క్రమంలో నిమగ్నమయ్యారు. ఈ గోష్ఠి తంతును నిర్వహించవలసిన 'గూడదాసరి' అనే వ్యక్తిని ఎక్కడి నుంచో పిలిపించారు. ఆయనకు అత్యంత గౌరవం ఇస్తారు.

ఆ సాయంత్రం చీకటి కమ్ముకుని గుడిసెల్లో దీపాలు వెలగసాగి ఆ చీకటి నీరవతల నడుమ ఈ దాసరులు గొడవల గలాటల సద్దు మాటలు ఆ చీకటిని చీల్చి వెలుగుతున్నట్టు అనిపించి ఆ గోష్ఠి

కార్యక్రమం మొదలైంది. నల్లటి కంబళి గద్దె మీద కూర్చున్న 'పిన్నపెద్ద', ఆ ఆడపిల్లను తీసుకు రమ్మని చెప్పారు. అప్పుడే స్నానం చేసి నుదుట తిలకం పెట్టుకుని వచ్చి కూర్చున్న ఆ ఆడపిల్ల నుదుట కుంకుం పెట్టి చేతికి అగరొత్తి ఇచ్చి ముందర పెట్టిన కలశానికి పూజ చేయమని చెప్పాడు. శుద్ధీకరణ చేయడానికి కావలసిన సామగ్రులైన గోమూత్రం, తులసి, గంధపు, నాలుక కాల్చడానికి కావలసిన వేపపుల్ల, బంగారపు ముక్కెర, మొదలైనవన్నీ ముందు పెట్టుకుని పిన్నపెద్ద తాను వాటికి అగరొత్తులు వెలిగించి హారతి ఇచ్చాడు. చుట్టూకూర్చున్న కులస్థులు, యజమానులను చూస్తూ, "ఇప్పడు గోష్ఠి చేస్కెనకి మీకంతా ఒప్ప వుందా? మాకంత ఒప్పెయింది. మీరు చేయొచ్చు అన్నారు. మీ అందరికీ సమ్మతమేనా?" అని అడిగాడు. అందరూ 'సమ్మతమే చేయండి' అన్నారు. ఆ ఆడపిల్ల మీద గోమూత్రం ప్రోక్షించి తులసీ దళాలను తల మీద వేసి, గంధపు తిలకాన్ని నుదుట దిద్దారు. తన ముందు మండుతున్న నెగడు మంటలో వేపపుల్లను వేడిచేసి ఆ వేడి కడ్డిపుల్లను ఆ ఆడపిల్ల నాలుకకు తాకించాడు. నాలుక చుర్రుమని కాలిన వేడిమి ఆమె కెవ్వున అరిచింది. ఆమె కెవ్వుమన్న కేక విన్న కులస్థులకంతా 'గోష్ఠి' అయిందనే సందేశం అర్థమైంది. పిన్నపెద్ద ఆ ఆడపిల్ల మీద గోమూత్రాన్ని ప్రోక్షించి 'శుద్ధి' అయిందని అన్నాడు. మేము ఇదంతా కళ్ళారా చూస్తూ అక్కడే పక్కనే కుతకుతమని ఉడుకుతున్న మాంసపు పులుసు వాసన పీలుస్తున్నాం. అక్కడ పక్కనే మా పెద్దలంతా కుండలోని నిండుగా నురుగులు కక్కుతున్న సారా తాగుతూ, గంజాయి దమ్ముకొడుతూ ఆనంద శిఖరాల్లో తేలుతున్నారు. ఇలా కులంలోకి చేర్చుకునే ప్రక్రియ ఎలాంటి అడ్డు ఆటంకం లేకుండా జరిగిపోయింది.

## మామయ్య నాటక పాఠం

ప్రతీరోజు మామయ్య సాయంత్రం కాగానే మడిబట్టలు కట్టుకుని భూజం మీద ఒక శాలువ కప్పుకుని చేతిలో లాంతరు పట్టుకుని నాటక పాఠాన్ని చెప్పడానికి బయలుదేరేవారు.రైతాంగానికి మామయ్య ఎలా నాటక పాఠం చెబుతాడో తెలుసుకోవాలని కుతూహలం. చాలాసార్లు మామయ్య వెంటబడి కొద్ది దూరం వెళ్ళి మామయ్య చేత తిట్టించుకుని తిరిగి వచ్చేవాడిని. అమ్మ కూడా ఇందుకు అవకాశం ఇచ్చేది కాదు.

ఒక రోజు ఆ అవకాశం నాకు లభించింది. యథాప్రకారం ఆయన వెంటపడి ఆయనతోపాటు వెళ్ళాను. ఆయన ముందు ముందు నడుస్తుండగా లాటీన్ వెలుతురులో నేను ఆయన్ను అనుసరించాను. మేము ఆ పాఠం చెప్పే వసారా చేరేసరికి అప్పటికే పాత్రధారులు అక్కడ చేరుకుని క్రితం రోజు మాస్టారు చెప్పించిన కంద పద్యాలు, సంభాషణలు మననం చేసుకుంటున్నారు. మామయ్య లెగ్ హార్మోనియంను పైకెత్తి స్టాండు వేసి నిలబెట్టి తను కుర్చీ మీద కూర్చున్నాడు. శిష్యులు హార్మోనియంకు నమస్కారం చేసి అగరొత్తులు వెలిగించి వరుసగా నిలబడ్డారు. మామయ్య ముందుగా లెగ్ హార్మోనియం తిత్తినొత్తి శృతి చేస్తుండగా అందరూ రాగయుక్తంగా ప్రార్థనా గీతాన్ని మొదలుపెట్టారు. ప్రార్థన ముగుస్తుండగా ఆ రోజు బీడీకట్ట, అగ్గిపెట్టె, తాగటానికి పాలు ఇవ్వవలసిన పాత్రధారి వాటిని తెచ్చి మామయ్య ముందు పెట్టాడు. ఆ రోజు నేను ఆయన వెంట ఉండటం వల్ల నాకూ ఒక లోటా మీగడ పాలు దొరికింది. శిష్యుడు తెచ్చి పెట్టిన పాలు తాగి ఒక బీడి వెలిగించి మామయ్య పాఠం మొదలుపెట్టాడు.

ఆ రోజు సీను హరిశ్చంద్రుడు తన సత్యసంధతను చాటడానికి తన సకల భోగాలను త్యాగం చేసి కట్టుబట్టలతో తన భార్య చంద్రమతి, పుత్రుడు లోహితాస్యుడు మరియు బాకీ వసూలు చేయడానికి వచ్చిన విశ్వామిత్రుడి శిష్యుడు నక్షత్రకుడిని వెంటబెట్టుకుని సామ్రాజ్యాన్ని విడిచి దేశభ్రష్టుడై వెళ్ళే దృశ్యం. నక్షత్రకుడి పాత్ర చేసిన చాకలి హుచ్చీరశెట్టి, హరిశ్చంద్ర పాత్రధారి లింగాయతుల మహదేవప్ప, చంద్రమతి పాత్రధారి అప్పూగౌడ మహదేవగౌడ–వీరి మధ్యన నడిచే సంభాషణలు మరియు పద్యాల ఉచ్చారణ మామయ్య ఎన్నిసార్లు చెప్పించినా వచ్చేది కాదు. 'హరిశ్చంద్ర'కు బదులుగా 'హరిచంద్ర' అని 'లోహితాశ్యడు'కు బదులుగా 'లోహితాస' అని ఇలా తప్పుతప్పుగా ఉచ్చరిస్తున్నారు. అక్షరజ్ఞానం లేని గ్రామీణుల చేత శుద్ధంగా మాట్లాడించడానికి మామయ్య ప్రయత్నించినట్టల్లా, మళ్ళీ మళ్ళీ తప్పులు జరుగుతున్నాయి. ఒక్కొక్క సంభాషణను, ఒక్కొక్క కంద పద్యాన్ని అనేకసార్లు చెప్పించి మామయ్య సతమతమయ్యేవాడు. అలా చెప్పించి చెప్పించి కోపం వచ్చి మామయ్య బెత్తంతో కొట్టడమూ జరిగింది. స్కూల్లో మాస్టర్లు చిన్నపిల్లలను అక్షరాలను దిద్దిస్తున్నప్పుడు కొట్టడం నాకు తెలుసు. నేనూ ఆ రుచిని చూసినవాడినే. అయితే ఇక్కడ మీసాలు వచ్చినవారినీ మామయ్య కొడతాడుకదా అని నాకు ఆశ్చర్యం వేసేది.

పాఠశాలలో పిల్లలకు అక్షరాలు నేర్పటం కన్నా ఈ నాటక పాఠం నేర్పడం చాలా కష్టమైన కార్యమని నాకు అనిపించింది వారికి అభినయంతోపాటు మాటలు, పాటలు, పద్యాలు, సందర్భాలు అన్ని వివరాలు మౌఖికంగానే చెప్పి నేర్పించటం సామాన్యమైన విషయం కాదు. అందుకు వృత్తి నైపుణ్యం కావలసిందే. ఈ నైపుణ్యం దాసరుల రక్తంలోనే ఉందని అనిపిస్తుంది.

ఆ రోజు అర్ధరాత్రివరకు నాటకం ప్రాక్టీసు జరిగింది. నేను నిద్ర ఆపుకోలేక తూగుతూవున్నా ఆ గొడవల హాస్యాల సారస్వత సందర్భాలను అనుభవిస్తూ మామయ్య పక్కన కూర్చుని కాలం గడిపాను. నాకూ ఆకలి తీవ్రంగా వేయటం వల్ల బాధగా ఉంది. మామయ్య ఎవరి ఇంట్లోనూ భోజనం చేసేవాడు కాదు. ఎంతసేపైనా ఇంటికి వచ్చి భోజనం చేసి పడుకునేవాడు. లేదా కొన్నిసార్లు ముందుగానే భోజనం చేసి పాఠం చెప్పటానికి వెళ్ళేవాడు. పాఠం ముగిసిన తరువాత శిష్యులు ఇంటివరకు వచ్చేవారు. ఆ రోజూ

నలుగురైదుగురు శిష్యులు మా వెంబడి లాంతరు పట్టుకుని వచ్చి ఇంటివరకు దిగబెట్టి వెళ్ళిపోయారు.

అప్పటికే అక్క, పిల్లలు భోజనాలు చేసి పడుకున్నారు. మామయ్య తడికె తలుపు కదిలించి తెరిపించాడు.

"నాకీ నాగణ్ణికి తినేకి ఏమన్నా వుంటే పెట్టు" అన్నాడు.

ఎందుకో అక్క కోపంతో, "సారు సేసేకి బ్యాళ్ళు గింజ్లి యేమీలేదు. సద్దిసారికి సంకటి సేసి బిడ్లికి తినబెట్టి పండేసిన. అంబ్లి వుంది అద్ముని ముద్ని తినండి" అంది.

మరోదారి లేక మామయ్య, నేను అంబలిలో ఉప్పు వేసుకుని ముద్దను తుంచి అంబలినే చారు అనుకుని అందులో అద్దుకుని ముద్దలు మింగాం. ఆ రాత్రి మామయ్య ఇంట్లోనే పడుకుని ఉదయమే మా ఇంటికి వెళ్ళాను.

**(ఇంకా వుంది)**

న్యాయవ్యవస్థ

–పెండ్యాల సత్యనారాయణ,
న్యాయవాది, సెల్ : 98664 42034

# న్యాయవ్యవస్థపై సడలిపోతున్న నమ్మకం

**మేధావి వర్గంలోను, సాధారణ ప్రజానీకంలోను చాలామందికి మన న్యాయ వ్యవస్థ విశ్వసనీయత పట్ల అపారమైన నమ్మకం ఉంది. అదేవిధంగా గౌరవమూ ఉంది. అయితే, ఈ మధ్య కాలంలో జరిగిన కొన్ని సంఘటనలు ఆ విశ్వాసాన్ని వమ్ముచేసేవిగా ఉండటం బాధా కరమే కాకుండా విచారకరంకూడా, దేశంలోని వైద్య కళాశాలల్లో ఎంబీబిఎస్, బీడీఎస్, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో (సంక్షిప్తంగా "నీట్) ప్రవేశానికి సంబంధించి ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహణకు సంబంధించి గతంలో తాను వెలువరించిన తీర్పును సుప్రీంకోర్టు తనకు తానుగానే ఉపసంహరించుకోవటం ఈ సంఘటనల్లో ప్రధాన మైనది. నిజానికి తన తీర్పులను తానే ఉపసంహరించుకోవటం, తిరగ రాయటం సుప్రీంకోర్టుకు క్రొత్త ఏమీ కాదు. ప్రివెంటివ్ డిటెన్షన్‌కు సంబంధించి దివంగత మార్క్సిస్టు నేత ఎ.కె.గోపాలన్ కేసులో 1951లో తాను వెలువరించిన తీర్పు మొదలుకుని, భావ ప్రకటనా స్వేచ్ఛ, జీవించే హక్కు తదితర రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులతో సహా అనేక అంశాలపై తాను వెలువరించిన అనేక తీర్పులను సుప్రీంకోర్టు తిరగరాసుకున్న సందర్భాలు కోకొల్లలు. కానీ ఆ తీర్పులకు, కొద్దిరోజుల క్రితం 'నీట్‌పై వెలువరించిన తీర్పుకు చాలా వ్యత్యాసం ఉన్నది. అందువలన న్యాయ వ్యవస్థ విశ్వసనీయతనే ప్రశ్నార్థకంగా మార్చిన ఈ అంశంపై చర్చ అవసరం.**

'నీట్'లో ప్రవేశానికి సంబంధించి దేశ వ్యాపిత ఉమ్మడి ప్రవేశ పరీక్ష అసంబద్ధమైనదిగా పేర్కొంటూ 2013 జులై 18వ తేదీన సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం ఒక తీర్పును వెలువరించింది. స్వంతంగా ప్రవేశ పరీక్షలను నిర్వహించుకుని డబ్బులు దండుకునే సువర్ణావకాశాన్ని ప్రయివేటు వైద్య కళాశాలలకు కల్పించే ఆ తీర్పుపై అప్పట్లోనే అసంతృప్తి వ్యక్తమయింది. అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అల్తామస్ కబీర్, జస్టిస్ విక్రమ్జిత్, జస్టిస్ ఎ.ఆర్.దవేలతో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం 2-1 మెజారిటీతో ఆ తీర్పును వెలువరించింది. జస్టిస్ అల్తామస్ కబీర్, జస్టిస్ విక్రమ్జిత్లు నీటిలో ప్రవేశానికి సంబంధించి దేశ వ్యాపిత ఉమ్మడి ప్రవేశ పరీక్ష అసమంజసమని, రాజ్యాంగ విరుద్ధమని అభిప్రాయపడగా, జస్టిస్ దవే ఆ అభిప్రాయంతో విభేదించారు. పర్యవసానంగా మెజారిటీ అభిప్రాయం ప్రాతిపదికగా ఆ తీర్పు వెలువడింది.

ఇక్కడ ప్రధానంగా గమనించాల్సింది ఏమిటంటే, ఇద్దరు లేక అంతకన్నా ఎక్కువమంది న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం ఒక కేసును విచారించినప్పుడు, తీర్పును వెలువరించటానికి ముందు, ఆ న్యాయమూర్తులందరూ కూర్చుని చర్చించుకుంటారు. ఆ క్రమంలో చర్చ జరిగిన తర్వాత కూడా వారందరి మధ్య ఏకాభిప్రాయం కుదర నట్లయితే, ఎవరి తీర్పును వారే వెలువరిస్తారు. అంటే ఏకాభిప్రాయం కుదురుతుందా, లేదా అన్నది ప్రధానం కాదు. కాని చర్చ జరగటం ప్రధానం. కానీ జస్టిస్ అల్తామస్ కబీర్, జస్టిస్ విక్రమ్జిత్, జస్టిస్ ఎ.ఆర్. దవేల మధ్య అటువంటి చర్చ జరుగలేదు.ఎటువంటి చర్చ జరుగకుండానే 2018 జులై 18వ తేదీన తీర్పు వెలువడింది. జస్టిస్ దవే తాను విడిగా వ్రాసిన తీర్పులో ఆ విషయాన్ని ప్రస్తావించారు కూడా. ఆ తీర్పును ఉపసంహరించుకుంటూ ఈ నెల 11వ తేదీన సుప్రీం కోర్టు తాను వెలువరించిన తీర్పులో కూడా అదే విషయాన్ని ప్రస్తావిసూ, 2018 జులై 18వ తేదీన వెలువడిన తీర్పుపై పున: సమీక్షకు అది కూడా ఒక కారణమని స్పష్టంగా పేర్కొనటం జరిగింది. ఇలా ఎందుకు జరిగింది?

అప్పటి త్రిసభ్య ధర్మాసనంలో ఒకరైన అప్పటి సుప్రీంకోర్డు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలామస్ కబీర్ పదవీ విరమణ చేసే రోజే ఆ తీర్పు వెలువడింది. అప్పడే సుప్రీంకోర్టు లాబీలో ఆ విష యంపై గుసగుసలు వినిపించాయి. ఆ అంశం పెద్ద చర్చనీయాం శంగా మారింది. ఆందులో ఏదో తిరకాసు ఉన్నదని ఆప్పడే చాలా మంది అనుకున్నారు. తీర్పు ఆ విధంగా వస్తుందని, ఆ తీర్పు రాక ముందే ఒక సుప్రీంకోర్టు అడ్వొకేట్ అంతర్జాలంలో ప్రకటించారు. అంటే తీర్పు అధికారికంగా వెలువడకముందే లీక్ అయిందా? అయితే లీక్ విషయం తనకు తెలియదని జస్టిస్ అలామస్ కబీర్ పేర్కొన్నట్లుగా అప్పట్లో కొన్ని వార్తలు వచ్చాయి. జస్టిస్ అల్తామస్ కబీర్ అభిప్రాయాలతో ఏకీభవించిన మరొక న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్జిత్ కూడా ఆ తర్వాత కొద్దికాలానికే పదవీ విరమణ చేశారు. ఆ తీర్పును వ్యతిరేకించిన దవే మాత్రం ఇంకా ఆ పదవిలోనే కొన సాగుతున్నారు. (ఇప్పటి తీర్పును వెలువరించిన ఐదుగురు సభ్యులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనంలో ఆయన కూడా ఒకరు).

ఈ నేపథ్యంలో, 2013 జులై 18వ తేదీన వెలువడిన తీర్పును ఉపసంహరించుకుంటూ సుప్రీంకోర్టు ధర్మాసనం చేసిన ఈ క్రింది వ్యాఖ్యలు గమనార్హం. "2013 జులై 18న వెలువడిన తీర్పులో కొన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోలేదు. మరీ ముఖ్యంగా నాటి తీర్పును వెలువరించటానికి ముందు ధర్మాసనంలోని సభ్యుల మధ్య ఎలాంటి చర్చ జరగలేదని మేము గుర్తించాం", లక్షలాది మంది వైద్య విద్యార్థుల జీవితాలకు, భవిష్యత్తుకు సంబంధించి అత్యంత ప్రధానమైన ప్రవేశ పరీక్షల విషయంలో సుప్రీంకోర్టు ఆనాడు అలా ఎందుకు వ్యవహరించింది? అంత హడావిడిగా, అన్ని విషయాలను కూలంకషంగా, లోతుగా అధ్యయనం చేయకుండా, సహ న్యాయ మూర్తులతో కనీసం చర్చించకుండా జస్టిస్ అల్తామస్ కబీర్ పదవీ విరమణ రోజే ఆ తీర్పు ఎందుకు వెలువడింది? దీని వెనుక ఏమైనా రాజకీయ ఒత్తిళ్ళా, లేక మరేవైనా ప్రలోభాలు ఉన్నాయా? ఆ తీర్పు

లోప భూయిష్టమని, పునః సమీక్ష అవసరమంటూ ఈ రోజు ఆ తీర్పును సుప్రీం కోర్టు వెనుకకు తీసుకున్న నేపథ్యంలో సామాన్యుడికి అటువంటి అనుమానాలు రావటం సహజమేకదా. ఇక మరొక బాధాకరమైన విషయం ఏమిటంటే, 2013 నుండి ఇప్పటిదాకా, ఆ లోపభూయిష్టమైన తీర్పే రాజ్యాంగబద్ధంగా చెల్లుబాటు అయింది. అటువంటి తీర్పువలన అప్పటినుండి ఇప్పటిదాకా ఎవరైనా వైద్య విద్యార్థులు నష్టపోయి ఉంటే ఆ నష్టాన్ని ఎవరు పూడుస్తారు? అసలు పూడ్చటం సాధ్యమేనా? ఇటువంటి సంఘటనలు ఖచ్చితంగా న్యాయ వ్యవస్థ ఔన్నత్యం, నిజాయితీ, స్వతంత్రతపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయి. సామాన్యుడికి న్యాయ వ్యవస్థపై ఉన్న నమ్మకం, విశ్వస నీయత కూడా సన్నగిల్లే అవకాశం ఉంటుంది.

**ఇక రెండవ సంఘటన**

అవిభక్త ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి ఖాతాలోని మొత్తాన్ని ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలు ఏవిధంగా, ఏ నిష్పత్తిలో పంచుకోవాలో నిర్దేశిస్తూ మార్చి 18వ తేదీన సుప్రీం కోర్టు ఒక తీర్పును వెలువరించింది. ఇక్కడ గమనించాల్సింది ఏమిటంటే, ఆంధ్ర ప్రదేశ్ విభజన రాజ్యాంగ బద్ధమా కాదా అన్నది తేల్చకుండానే, రెండు రాష్ట్రాల మధ్య వాటాల పంపకంపై సుప్రీం కోర్టు పైవిధంగా తీర్పును వెలువరించింది. ఇది ఏవిధంగా న్యాయబద్ధం, రాజ్యాంగ బద్ధం అన్నది ఒక ప్రధానమైన ప్రశ్న. ఎందుకంటే, రాష్ట్ర విభజన రాజ్యాంగ బద్ధమేనని తిరుగులేని విధంగా నిర్ధారింపబడితేగదా ఆస్తులు, అప్పులు, వాటాల విభజన అన్న సమస్య తలెత్తేది. ఆ విష యాన్ని తేల్చకుండా వాటాలను తేల్చటం రాజ్యాంగ విరుద్ధం కాదా, అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టే ఇటువంటి తీర్పులను వెలువరిస్తే సామాన్యుడికి, మేధావులకు న్యాయ వ్యవస్థపై నమ్మకం ఎలా ఉంటుంది? ఇక్కడ ఆంధ్ర ప్రదేశ్ విభజన తప్పొరైటా అన్నది సమస్యకాదు. ఆ విషయం సుప్రీంకోర్టు పరిశీలనలో ఉన్నప్పుడు, ఆ విషయం తేలకుండానే విభజన తదనంతర పరిణామాలు, వివాదా స్పద అంశాలపై అదే సుప్రీంకోర్టు తీర్పును వెలువరించటం ఎంత వరకు సబబు అన్నదే ప్రశ్న. ఇటువంటి తీర్పులు న్యాయవ్యవస్థ విశ్వసనీయతపై ప్రజల్లోకి ఎటువంటి సంకేతాలను తీసుకువెళతాయి?

2014 జూన్ నెల రెండవ తేదీన భారత చిత్రపటం నుండి 28 జిల్లాలో కూడిన ఆంధ్రప్రదేశ్ అదృశ్యమై, ఆ స్థానంలో ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణా అనే రెండు రాష్ట్రాలు ఏర్పడ్డాయి. అవిభక్త ఆంధ్ర ప్రదేశ్ విభజన రాజ్యాంగ విరుద్ధమంటూ విభజనకు కొన్ని నెలలు ముందే అప్పటి పార్లమెంటు సభ్యులు ఉండవల్లి అరుణకుమార్‌తో సహా అనేకమంది సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్లను దాఖలు చేశారు. ఆ రిట్ పిటిషన్లను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది. అయితే విభజన రాజ్యాంగబద్ధత తేలే వరకు విభజన కార్యరూపం దాల్చ కుండా మధ్యంతర స్టే ఇవాలన్న పిటిషనర్ల అభ్యర్థనను త్రోసిపుచ్చింది. ఆ పిటిషన్లు దాఖలైన తేదీ నుండి విభజన కార్య రూపం దాల్చటానికి మధ్య కొన్ని నెలల వ్యవధి ఉన్నప్పటికీ, ఆ మధ్యకాలంలో ఆ రిట్ పిటిషన్లపై విచారణ జరగలేదు. ఈ లోగా 2014 జూన్ 2వ తేదీ రానే వచ్చింది. విభజన కార్యరూపం దాల్చింది.

విభజనతో రెండు రాష్ట్రాల మధ్య వివాదాలు మొదలయ్యాయి. అటువంటి అనేక వివాదాలలో ఒక వివాదమే ఉన్నత విద్యామండలి ఖాతాలో ఉన్న సొమ్ము వివాదం. అంతిమంగా ఆ వివాదం సుప్రీం కోర్టు గడప తొక్కింది. విభజనకు ముఅదు ఉన్నత విద్యామండలి ఖాతాలో ఉన్న సొమ్మును 58:42 నిష్పత్తిలో ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలు పంచుకోవాలని సుప్రీం కోర్టు మార్చి 18వ తేదీ తీర్పును వెలువరించింది. ఆ తీర్పులో ఒక భాగం ఈ క్రింది విధంగా ఉన్నది. "రాష్ట్ర విభజన చాలా సున్నితమైనది. ఆరే ధ్ర ప్రదేశ్ విభజన చట్టం రూపకల్పన సమయంలోనే మరింత జాగ్రత్త తీసుకోవాల్సింది". అంటే రాష్ట్ర విభజన చట్టం రూపకల్పన లోప భూయిష్టంగా ఉన్నదని సుప్రీంకోర్టు అంగీకరించినట్లే కదా. అటువంటప్పుడు, రాష్ట్ర విభజన రాజ్యాంగ బద్ధతను పరిష్కరించకుండా, రాజ్యాంగ విభజన చట్టంలోని లోటుపాట్లపై సుప్రీం కోర్టు తీర్పును ఎలా వెలువరించింది?

**ఇక్కడ మరొక విషయం కూడా గమనించాలి. అదేమిటంటే, రాష్ట్ర విభజన రాజ్యాంగ బద్ధతను ప్రశ్నిస్తూ దాదాపు రెండు సంవత్సరాల క్రితం దాఖలైన రిట్ పిటిషన్లను పరిశీలించటానికి తీరికలేని సుప్రీం కోర్టుకు, ఆ తర్వాత చాలా కాలానికి, మరొకవిధంగా చెప్పాలంటే, కొద్దినెలల క్రింతం దాఖలైన ఉన్నత విద్యా మండలి ఖాతాల వివాదంపై విచారణకు తీరిక ఎలా దొరికింది? లేక ఎనిమిది కోట్ల మంది తెలుగు ప్రజల భవితవ్యానికి సంబంధించిన విభజన వివాదం కన్నా ఉన్నత విద్యామండలి ఖాతాల వివాదం అత్యంత ముఖ్యమైనదని సుప్రీంకోర్టు భావించిందా? దేశంలోనే అత్యున్నతమైన సుప్రీం కోర్టు ఈ విధంగా వ్యవహరిస్తుంటే సామాన్యుడికి న్యాయ వ్యవస్థపై విశ్వాసం పెరుగుతుందా, లేక సన్నగిల్లుతుందా?**

**కొసమెరుపు :** సరిగ్గా ఈ తీర్పు వెలువడిన కొద్దిరోజులకే హైదరా బాదులో న్యాయాధికారుల రెండు రోజుల సదస్సు జరిగింది. జస్టిస్ వెంకట రమణ, జస్టిస్ చలమేశ్వర్ తదితర సుప్రీం కోర్టు న్యాయ మూర్తులు, అనేకమంది హైకోర్టు న్యాయమూర్తులు ఆ సదస్సులో పాల్గొన్నారు. న్యాయ వ్యవస్థ పట్ల ప్రజలలో విశ్వసనీయత పెంచాలని న్యాయ మూర్తులంతా వక్కాణించారు. ప్రజలకు సత్వర న్యాయం అందించాలని పేర్కొన్నారు. నిజమే. **"న్యాయం ఆలస్యం కావటం అంటే న్యాయాన్ని నిరాకరించటమే" అనేది న్యాయ ధర్మ శాస్త్రంలో ప్రథమ పాఠం. మరి ఆంధ్రదేశ్ విభజన రాజ్యాంగ బద్ధతపై దాఖలైన రిట్ పిటిషన్ల విషయంలో సత్వర న్యాయం విషయంలో అదే సుప్రీం కోర్టు ఏమి చేస్తున్నది సత్వర న్యాయంకోసం, ఆ రిట్ పిటిషన్లపై తీర్పుకోసం మరి ఎన్ని సంవత్సరాలు వేచి ఉండాలి. అది తేలకుండా విభజనానంతర వివాదాలపై తీర్పులు ఇస్తుంటే మరి సత్వర న్యాయా నికి అర్థం ఏమిటి? మరికొంత కాలం తర్వాత ఆంధ్ర ప్రదేశ్ విభజన రాజ్యాంగ విరుద్ధమేనని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినట్లయితే, ఉన్నత విద్యామండలి ఖాతాలు తదితర అంశాలపై సుప్రీం కోర్టు వెలువరిం చిన తీర్పుల పరిస్థితి ఏమిటి? తిరిగి పూర్వ స్థితి, పునరుద్ధరణ సాధ్యమేనా? పరిస్థితులు ఇలాగే కొనసాగితే న్యాయ వ్యవస్థపై ప్రజ లకు విశ్వసనీయత ఉంటుందా? న్యాయ మూర్తులు, ప్రజాస్వామ్య వాదులు, మేధావులు, సామాన్యులు తప్పనిసరిగా ఆలోచించవలసిన విషయమే ఇది.** ❋

సృజనకు విత్తు సొంతభాష...
రచనకు సత్తువ ప్రజల భాష

-కొల్లా దశపతిరావు
సెల్ : 94412 14639

# భారతీయ భాషాసమ్మేళనం పిలుపు : మాతృభాషల వికాసంతోనే దేశప్రగతి సాధ్యం



అక్టోబరు 15, 16 తేదీలలో రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం తిరుపతిలో నిర్వహించిన భారతీయ భాషా సమ్మేళనం విజయ వంతంగా ముగిసింది. 15 రాష్ట్రాల నుండి వివిధ రంగాలకు చెందిన 200 మంది భాషావేత్తలు, ఆచార్యులు, భాషా ప్రేమికులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కేంద్ర మానవ వనరుల శాఖామంత్రి శ్రీ ప్రకాష్ జవదేకర్ గారి వీడియో సందేశంతో కార్యక్రమం ప్రారంభమయింది.

### పాల్గొన్న కొందరు ప్రముఖులు

శిక్షా సంస్కృతి ఉత్థాన్ న్యాస్ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీ అతుల్ కొఠారి, భారతీయ భాషామంచ్ జాతీయ సంయోజకులు ఆచార్య వృషభ్ ప్రసాద్ జైన్, ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉపసభాపతి శ్రీ మండలి బుద్ధప్రసాద్, తిరుమల-తిరుపతి దేవస్థానముల అన్ని ప్రాజెక్టుల ప్రత్యేక అధికారి శ్రీ ముక్తేశ్వరరావు, ఐ.ఎ.ఎస్. (విశ్రాంత), తెలుగుభాషోద్యమ సమాఖ్య అధ్యక్షులు, 'తెలుగునుడి' సంపాదకులు డా॥ సామల రమేష్‌బాబు, ద్రవిడ విశ్వవిద్యాలయ మాజీ వైస్-ఛాన్సలర్ ఆచార్య అరుణాచలం, రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం వైస్-ఛాన్సలర్ ఆచార్య ఎమ్.ఎల్.ఎన్. మూర్తి, మనోవైజ్ఞానిక నిపుణు రాలు, అంతర్జాతీయ కార్పొరేట్ శిక్షకురాలు శ్రీమతి పోతుకూచి పద్మ, విశ్రాంత గణితాచార్యులు ఆచార్య సుందరమూర్తి, 'జాగృతి' వారపత్రిక మాజీ సంపాదకులు డా॥ వడ్డి విజయసారథి, భారతీయ శిక్షణ మండల్ జాతీయ సంయోజకులు ఆచార్య దుగ్గిరాల విశ్వే శ్వరం, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ ఆచార్యులు శ్రీమతి శరత్ జ్యోత్స్నారాణి, శ్రీమతి దేవారెడ్డి విజయలక్ష్మి, రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం ఆచార్యులు శ్రీ సత్యనారాయణ, శ్రీమతి లలితా రాణి, ఆచార్య రాణి సదాశివమూర్తి మొదలగువారు పాల్గొన్నారు.

### ప్రముఖుల సందేశాలు

0 కేంద్ర మానవ వనరుల శాఖామంత్రి **శ్రీ ప్రకాష్ జవదేకర్** ఈ సదస్సుకు తాను హాజరు కాలేకపోతున్నందుకు విచారాన్ని వ్యక్తం చేస్తూ ఒక వీడియో సందేశాన్ని పంపారు. భారతీయ సంస్కృతిని, విద్యను కాపాడుకొనేందుకు భారతీయ భాషలను నేర్చుకొనడం అత్యవసరం అని పేర్కొన్నారు. ఈ సదస్సులోని నిర్ణయాలను అమలు చేయడానికి ప్రయత్నిస్తామన్నారు.

0 ప్రారంభ సభలో శిక్షాసంస్కృతీ ఉత్థాన్ న్యాస్ కార్యదర్శి అయిన **శ్రీ అతుల్ కొఠారి** మాట్లాడుతూ మాతృభాషలను నేర్చుకొనడం భావోద్వేగపరంగా ఒక అవసరం అన్నది ప్రక్కన పెడితే శాస్త్రీయంగా అది చాలా సమంజసమైనది అన్నారు. ప్రపంచంలోని విద్యావేత్తలు, మనోవిజ్ఞానశాస్త్రవేత్తలు మాతృభాషలో విద్య వల్ల మనోవికాసం బాగా జరుగుతుందన్నారు. ప్రపంచంలో అత్యధిక స్థూల జాతీయ ఉత్పత్తిని సాధిస్తున్న 20 అగ్ర దేశాలలో విద్యార్థులు తమ మాతృభాషలోనే విద్యాధ్యయనం చేస్తున్నారని, కానీ అత్యల్ప స్థూల జాతీయ ఉత్పత్తిని సాధిస్తూ వెనుకబడిన దేశాలలో విద్యార్థులు ఒక విదేశీ భాషా మాధ్య మంలో విద్యను అభ్యసిస్తున్నట్లు తెలిసింది అని అన్నారు. హిబ్రూ భాషలో పరిశోధనలు చేస్తూ ఇజ్రాయల్ 16 నోబెల్ బహుమతులు సాధించింది. చిన్న చిన్న దేశాలలో కూడా వారి మాతృభాషలోనే విద్య నభ్యసిస్తున్నారు.

0 **శ్రీ మండలి బుద్ధప్రసాద్ :** అన్ని భారతీయ భాషలకు ఆంగ్లం వల్ల ప్రమాదం ఏర్పడింది. అన్ని భారతీయ భాషలు సమైక్యంగా ఉద్యమం సాగించాలి. స్వాతంత్రోద్యమ కాలంలో హిందీ ప్రచారం, మాతృభాషల ప్రచారం ఉద్యమ ప్రణాళికలో భాగంగా ఉండేవి.

ఆంగ్లేయుల కంటే మనవారే ఎక్కువగా మన భాషలకు అన్యాయం చేశారు. ప్రభుత్వ విధానాలు మెకాలే విద్యా విధానాన్ని ముందుకు తీసుకువెళ్ళే విధంగా ఉన్నాయి. ఈరోజు ఒక చిన్న గ్రామంలో కూడ ఆంగ్ల పాఠశాలకే పిల్లలను పంపుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలకు పిల్లలను పంపడంలేదు. ఈ పరిస్థితి అన్ని రాష్ట్రాలలోను

ఉన్నది. మన రాష్ట్రంలో మరీ ఎక్కువగా ఉన్నది.

భాష నశిస్తే జాతి నశిస్తుంది, సంస్కృతి నశిస్తుంది, జాతి ఆత్మ నశిస్తుంది. ఉద్యోగాలు రావచ్చుగాక, తల్లిదండ్రులకు, మాతృ భాషకు, మాతృదేశానికి ప్రత్యామ్నాయం లేదు. ఈరోజు మాతృభాష లను కాపాడుకోవడానికి జరిగే ఉద్యమం కూడా ఒక స్వతం త్రోద్యమమే.

విద్య, పరిపాలన, న్యాయవ్యవస్థలు మాతృభాషలో ఉండాలి. ప్రజలు పరిపాలనలో భాగస్వాములు కావాలంటే ప్రజల భాషలో పాలన ఉండాలి. ముక్తేశ్వరరావు గారు నల్గొండ జిల్లా కలెక్టరుగా ఉన్నప్పుడు కేవలం రెండు నెలలలో గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు పరిపాలనను పూర్తిగా తెలుగులోనికి మార్చారు. దృఢ నిశ్చయం, శ్రద్ధాసక్తులు, ప్రజలకు న్యాయం చేయాలనే కోరిక ముఖ్యం.

నేను ఒకసారి మారిషస్ దేశానికి వెళ్ళాను. అది ఒక చిన్న దేశం. ఆ దేశ స్వాతంత్ర్య ఉద్యమ సారథి శివసాగర్ రామ్ గులాం. అది ఒక చిన్న భారతదేశం. భారతదేశంలోని అన్ని భాషలవారు ఆ దేశంలో ఉన్నారు. ఆయన స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో ఒక వాగ్దానం చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత వారి మాతృభాషలకు పట్టం కడతానన్నారు. అక్కడ ఒకటవ తరగతి నుండి పోస్ట్‌గ్రాడ్యుయేషన్ వరకు వారి వారి భాషలలోనే విద్యాభ్యాసం జరుగుతుంది. వారి సంస్కృతి కాపాడబడుతుంది. అక్కడ తెలుగువారిలో మూడు ప్రధాన సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. అవి - 1. మహారామ భజన, 2. గోవింద పూజ, 3. అప్పన్న పూజ. ఒక్కో కార్యక్రమంలో పదివేలమంది వరకు పాల్గొంటారు. అవి వారి దూరదర్శన్‌లో ప్రసారం చేయబడతాయి. నవంబరు 1వ తేదీని కూడా వారు జరుపు కుంటారు. అదే రీతిలో భారతదేశం కూడా తయారు కావాలి.

**శ్రీ ముక్తేశ్వరరావు :** భాష గురించి పైపైన కాకుండా మౌలికంగా ఆలోచించాలి. ఈమధ్య కాలంలో చాలమంది భాష యొక్క ఉద్దేశ్యం భావవ్యక్తీకరణ అని చెబుతున్నారు. ఇలా అనడం నిజంగా భాష యొక్క లక్ష్యాన్ని, పాత్రను సంకుచితపరచడమే. నిజానికి ఒక జాతి యొక్క పురోభివృద్ధి అంతా భాషే. భాష ద్వారానే ఆ దేశం యొక్క సాంస్కృతిక, సాంకేతిక, ఆర్థిక రంగాల అభివృద్ధి జరుగుతుంది. భాష, సంస్కృతికి ప్రముఖ స్థానం ఇచ్చిన దేశాలు బాగా అభివృద్ధి చెందాయి. చైనా, కొరియా దేశాలు ఇటీవలి ఉదాహరణలు. పరి పాలనలో భాగస్వాములు కావడం ప్రజల హక్కు. మాతృభాషలో పాలన జరిగినప్పుడే ప్రజలు భాగస్వాములౌతారు. కాబట్టి పరిపాలన మాతృభాషలోనే జరగాలి.

ఈరోజున అనేక స్పియర్ల (Spheres) గురించి మాట్లాడు తున్నారు. లితోస్పియర్ (Lithosphere), హైడ్రోస్పియర్, ఎట్మాస్పి యర్. కాని వీటన్నింటికంటె ముఖ్యమైనది భాషావరణం (Lingo sphere). ప్రతివారు మాతృభాషలో మాట్లాడడం, వ్రాయడం విద్య, పరిపాలన, న్యాయవ్యవస్థ, సాహిత్యము, కళలు మొదలగు అన్ని రంగాలలో మాతృభాష ప్రాముఖ్యతను పెంచడం ద్వారా లింగోస్పి యర్ ఏర్పడుతుంది.

**డా॥ సామల రమేష్‌బాబు :** ఈరోజు భాషా సమస్యకు ప్రధాన కారణం ప్రభుత్వ విధానాలే. తెలుగు భాషోద్యమం కోసం 2000 సం॥ నుండి ప్రయత్నం చేస్తున్నాము, అనేక ప్రభుత్వ నిర్ణయాలను ప్రభావితం చేశాము. అధికార తెలుగు భాషా సంఘం గాని, ఇటీవలి తెలుగు భాషా అభివృద్ధి సంఘం గాని ఉద్యమ కృషి ఫలితమే.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ తమ వంతు ప్రయత్నాలు చెయ్యాలి. రాజ్యాంగంలో భాషలకు నిర్దేశించిన స్థానాన్ని ఇవ్వాలి. ఆయా అంశాలను అమలుచేయాలి.

కోర్టులలో జిల్లా స్థాయి వరకు మాతృభాషలోనే వ్యవహారాలు జరగాలి. రాష్ట్ర గవర్నర్ ప్రతిపాదనపై రాష్ట్రపతి అనుమతితో హైకోర్టు లలో కూడ మాతృభాషలలోనే వ్యవహారాలు జరగవచ్చు. 358 అధికరణాన్ననుసరించి ఈ ప్రతిపాదనలు రాష్ట్ర గవర్నర్ ద్వారా రాష్ట్రపతికి పంపే ప్రయత్నం చేయాలి.

విద్యాపీఠం కులపతి **ప్రొఫెసర్ ఎం.ఎల్. మూర్తి** ఒక క్రియా ధాతువు వివిధ ఉపసర్గలు చేరిస్తే ఎంత ఆశ్చర్యకరంగా అర్థాలను మార్చుకుంటూ పోతుందో వివరించి, మాతృభాషను అధ్యయనం చేస్తేనే ఇటువంటి అర్థాలను సక్రమంగా అన్వయించుకుంటూ వివిధ అమూల్య గ్రంథాలను అధ్యయనం చేసేందుకు సాధ్యమౌతుందని అన్నారు.

భారతీయ భాషామంచ్ అధ్యక్షులైన **శ్రీ వృషభ జైన్** మాట్లా డుతూ భారతీయులను విభజించి పాలించేందుకుగాను బ్రిటీషు వారు భారతీయ భాషలను ఒక పావుగా వాడుకున్నారని తెలిపారు. ఒక భాష నుండి వేరొక భాషకు అనువాదాలు విస్తృతంగా జరగాలి. అప్పుడు అన్ని భాషలు సుసంపన్నమౌతాయి.

మనోవైజ్ఞానిక నిపుణురాలు, అంతర్జాతీయ కార్పొరేట్ శిక్షకు రాలు, సభకు ముఖ్య అతిథి అయిన శ్రీమతి **పోతుకూచి పద్మ** మాట్లా డుతూ జనని, జన్మభూమి అనే ద్వయానికి ఇపుడు మాతృభాషను అదనంగా చేర్చవలసిన అవసరం వచ్చిందని అన్నారు.

**ఆచార్య అరుణాచలం** మాట్లాడుతూ పురాణాలు, కావ్యాలు, కళలలో తెలుగు సాహిత్యం అభివృద్ధి చెందినంతగా సాంకేతిక రంగా లలో అభివృద్ధికి కృషి జరగలేదన్నారు. గణితంలో ఉన్నత స్థాయి సంగోష్ఠిని తెలుగులో నిర్వహించాలనే కోరికను వ్యక్తం చేశారు.

**ఆచార్య రాణి సదాశివమూర్తి** మాట్లాడుతూ విద్యలో మార్పు వలన భావాలలో మార్పు సాధ్యమౌతుందని, దీనిని భారతీయులు సాధించారని తెలిపారు. శ్రీ కొల్లా దశపతిరావు ప్రముఖుల ఉపన్యాసా లను సంక్షిప్తంగా అనువదించారు.

**కొన్ని ముఖ్యాంశాలు**

0 భారతీయ భాషలన్నీ ఒకే మాలలోని పుష్పాలవంటివి. వాటిలో వైవిధ్యముంది. ఆ వైవిధ్యం వెనుక ఏకత్వం కూడ ఉంది.

0 అన్ని భారతీయ భాషలూ జాతీయ భాషలే. హిందీ అనుసంధాన భాష మాత్రమే.

0 వివిధ భారతీయ భాషల మధ్య చిచ్చుపెట్టి, విభజించి పాలించే సిద్ధాంతాన్ని ఆంగ్లేయులు అనుసరించారు. ఆర్య, ద్రావిడ, ఉత్తర, దక్షిణ భాషలుగా ఈ దేశ భాషలను విభజించడం ఆంగ్లేయుల కుట్రే.

0 అభివృద్ధి చెందిన అన్ని దేశాలలో వారి విద్య, పరిపాలన, న్యాయ వ్యవస్థ, సాంకేతిక, వైద్య, పరిశోధన కార్యకలాపాలన్నీ వారి భాషలోనే జరుగుతాయి. వారికి సాధ్యమైనది మనకెందుకు సాధ్యంకాదు? ఆలోచించాలి. అడుగు ముందుకేయాలి.

0 అప్పుడప్పుడు భారతీయ భాషల మధ్య, ఆ భాష మాట్లాడే ప్రజల మధ్య, ప్రభుత్వాల మధ్య సంఘర్షణ, విభేదాలు తలెత్త వచ్చు. కాని వాటిని సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలి. ఆ సామర్థ్యం మనకు ఉన్నది.

0 ఆత్మగౌరవం గల ఏ జాతీ ఒక విదేశీ భాషను జాతీయ భాషగా గాని, అనుసంధాన భాషగా గాని అంగీకరించదు.

0 అన్ని భారతీయ భాషలకు ప్రమాదం ఆంగ్లం వల్లనే. అనేక ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలలో ఇలాగే జరిగింది. అక్కడ చాలా స్థానిక భాషలు యూరోపియన్ భాషల వల్ల అంతరించి పోయాయి.

0 భారతీయ భాషలన్నింటిలో జాతీయ ఆత్మ ప్రతిబింబిస్తుంది. వీటిలో ఆయా ప్రాంత ప్రజల సంస్కృతి, జీవన విధానం, ఆధ్యాత్మికత ప్రతిబింబిస్తుంది.

0 ఒక దేశం అన్ని రంగాలలో ముందుకెళ్ళే శక్తినిచ్చేవి ఆ జాతి భాష, సంస్కృతులే. వాటిని ఉపేక్షిస్తే ఆ జాతి వెనుకబడి పోతుంది, నశిస్తుంది.

0 ప్రసార మాధ్యమాలలో ముఖ్యంగా ఎలక్ట్రానిక్ మీడియాలో, సినిమాల్లో ఉపయోగిస్తున్న సంకర భాష నుండి బయటపడాలి.

0 భాష గురించి ప్రజలలో చైతన్యం అవసరం. గ్రామ స్థాయి నుండి ఉద్యమాన్ని బలోపేతం చేయాలి.

0 భాష గురించి రాజ్యాంగంలో పొందుపరచిన అంశాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో అమలుచేయాలి. ఈ దిశలో ప్రభుత్వాలపై వత్తిడి తేవాలి.

0 కేంద్రస్థాయి, రాష్ట్రస్థాయి పోటీ పరీక్షలలో మాతృభాషలకు తగిన ప్రాధాన్యతనివ్వాలి. ఐ.ఐ.టి. ప్రశ్నాపత్రం, నీట్ పరీక్ష, సివిల్ సర్వీస్ ప్రశ్నాపత్రాలు ప్రాంతీయ భాషలలో (రాజ్యాంగంలోని 8వ షెడ్యూలులోని) ఇవ్వవచ్చు.

0 తెలుగు మాధ్యమంలో చదివినవారికి పోటీ పరీక్షలలో ప్రాధా న్యత, అదనపు మార్కులు ఇవ్వాలి.

0 తెలుగులో సాంకేతిక పదాల సృష్టికి, సాంకేతిక రంగాలలో జ్ఞానాన్ని సృష్టించి, అనువదించడానికి కృషి చేయాలి.

0 అంతర్జాలంలో, సమాచార ప్రసార రంగాలలో మాతృభాషలలో విశేష కృషి జరగాలి.

0 సాంకేతిక విద్య, వైద్యవిద్యలను మాతృభాషలోనికి తీసికొని రావడానికి కృషి జరగాలి.

0 ఒక భాషలోని మంచి సాహిత్యాన్ని ఇతర భాషలలోనికి తీసుకొని వెళ్ళడానికి అనువాద ప్రక్రియను బలోపేతం చేయాలి. దీనిపై విశేష శ్రద్ధ అవసరం.

0 భారతీయ భాషల మధ్య వాక్య రచన, శబ్దావళి యొక్క పోలికను అధ్యయనం చేస్తూ భారతీయ భాషలను తేలికగా నేర్చుకొనే ప్రయత్నం జరగాలి.

0 ఉత్తర భారతదేశస్థులు దక్షిణ భారత భాషను, దక్షిణ భారత దేశస్థులు హిందీని నేర్చుకొనే ప్రయత్నం చేయాలి. ఇది జాతీయ సమైక్యతను పెంపొందిస్తుంది.

0 ఇంట్లో, కుటుంబాలలో మాతృభాషనే ఉపయోగించాలి.

0 కనీసం ప్రాథమిక విద్య అయినా మాతృభాషలోనే ఉండాలి.

0 వేరే భాషలను నేర్చుకోవాలి, కాని మాతృభాషను పక్కన పెట్ట కూడదు.

0 ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా భారతీయ భాషలను అభి వృద్ధి చేయాలి.

0 భావ శుద్ధి వల్ల భాషా శుద్ధి జరుగుతుంది.

0 సాహిత్యంలో మాతృభాష సరళంగా, వ్యావహారికంలో ఉండాలి. అందుకు కవితలు, కథలు, గేయాలు పిల్లలకు అలవాటు చేయాలి.

0 సంస్కృత భాష భారతీయ భాషలకు తల్లిలాంటిది. అవసరమై నంత మేరకు వాడుకొని మన భాషలను సుసంపన్నం చేసుకో వచ్చు.

0 మాతృభాషలను నేర్పడంవల్ల నైతిక విలువలు, అనుబంధం, ఆత్మీయతలు బాగా పెంపొందుతాయి.

0 మన మాండలికాలను కూడా కాపాడుకోవాలి.

**<u>మరికొన్ని విశేషాలు</u>**

0 వక్తల ఉపన్యాసాలన్నీ దాదాపుగా వారి మాతృభాషలలోనే సాగాయి. అవసరమైన దగ్గర సంక్షిప్త అనువాదం జరిగింది.

0 ఢిల్లీ నుండే 15 మందికి పైగా ఉన్నత, సర్వోన్నత న్యాయస్థానాల న్యాయవాదులు పాల్గొన్నారు. స్థానిక న్యాయవాదులతో కలిసి న్యాయవ్యవస్థలో తెలుగు గురించి చర్చించారు.

0 ఈ సదస్సుకు అనువర్తిగా వివిధ విభాగాలలో సదస్సులు, సంగో ష్ఠులు నిర్వహించాలని నిర్ణయించడం జరిగింది. అంటే న్యాయ వాదులకు, పోటీ పరీక్షలకు, సాంకేతిక, వైద్య, విద్యా రంగాలకు.

0 రాజ్యాంగంలోని 358 అధికరణం ద్వారా మాతృభాషను హైకోర్టులలో వాడుటకు అవకాశం ఉంది. దీనికి గవర్నర్ గారి ద్వారా రాష్ట్రపతికి విజ్ఞప్తి పంపి ఆమోదం పొందాలి. (రాష్ట్ర గవర్నర్ ద్వారా రాష్ట్రపతికి విజ్ఞప్తి పంపడం కోసం ఉపసభాపతి శ్రీ మండలి బుద్ధప్రసాద్‌కు న్యాయవాదుల ద్వారా విజ్ఞాపన పత్రం సమర్పించడం జరిగింది).

0 33 మంది పరిశోధనా పత్రాలను సమర్పించారు. దీనిలో చాలా భాషలవారున్నారు.

0 తెలుగు భాష వారికి విడిగా, మిగిలిన అన్ని భాషలవారికి విడిగా సమాంతర సమావేశాలు జరిగాయి.

0 భారతీయ భాషల మధ్య, భాషల ప్రజల మధ్య సామరస్యానికి ఒక సజీవ ఉదాహరణగా ఈ సదస్సు జరిగింది.

0 ఆంగ్ల భాషను వాడకుండా జాతీయ సదస్సులు, సంగోష్ఠులు సాధ్యమనే భావన ప్రతినిధులకు కలిగింది. ❋

మాతృభాషల్ని అణచివేసే ప్రభుత్వాలు ప్రజావ్యతిరేకమైనవి. అభివృద్ధి నిరోధకమైనవి కూడ. అలాంటి ప్రభుత్వాలను అధికారంలో ఉండనీయకూడదు.

–ఒక సామాజిక ఉద్యమనేత

-డా॥సామల రమేష్‌బాబు
సెల్ : 98480 16136

# మాతృభాషలు-జాతీయవాదం

**అన్ని మాతృభాషలూ గొప్పవే, వాటి మానాన వాటిని ఎదగదాన్ని ప్రోత్సహిద్దాం. భాషలపుట్టుక, పెరుగుదల కొన్ని సహజసూత్రాలతో సాగుతుంది. ప్రవహించే నదుల్లాంటివి భాషలు. వాటిలో జోక్యం తగనిపని. అది జాతీయతకు దారితీయదు. జాతీయవాదం సహజీవనంతో బలపడుతుంది. అవగాహనతో ఇచ్చిపుచుకోవడంతో పెరుగుతుంది. భారతదేశానికి సంబంధించి ఇది మరీ ముఖ్యంగా గమనించవలసిన అంశం. దేశభాషల్ని బలపరచుకోవడమే జాతీయవాదాన్ని బలపరచు కొనే మార్గం. వైవిధ్యాన్నుంచి ఐక్యతాభావనను పెంపొందించడమే జాతీయ వాదానికి రక్ష**

నిజానికి ఈ అంశం విస్తృతమైనది మాత్రమేగాక, క్లిష్టమైనది కూడా. భౌగోళిక దేశాల ఏర్పాటు ప్రకారం 'జాతీయతను గుర్తించ వలసినప్పుడు ఆ జాతీయత దేశం పేరుతో ముడిపడి ఉంటుంది. భారత జాతీయత, శ్రీలంక జాతీయత, పాకిస్తాన్ జాతీయత - ఇట్లా ఉంటుంది. కొన్ని సందర్భాల్లో భాష ఆధారంగా దేశం ఏర్పడి నపుడు, ఉదాహరణకు బంగాదేశ్ వంటి చోట్ల- దేశమంతా ఒకే భాష ఉన్నచోట్ల దేశ జాతీయత, భాషాజాతీయత కలిసే ఉంటాయి. కానీ భారతదేశం వంటి బహుభాషా దేశాల్లో భాషా సమూహాలకు అతీతంగా దేశ జాతీయత ఉంటుంది. కారణం భారతదేశంలో వందల సంఖ్యలో భిన్న భాషాసమూహాల ప్రజలు న్నారు. 22 భాషలు మాత్రమే మన రాజ్యాంగంలోని 8వ షెడ్యూలులో చేర్చబడ్డాయి. ఈ షెడ్యూలులో తమ భాషల్ని కూడా చేర్చాలని మరికొన్ని భాషా సమూహాలు కోరుతున్నాయి.

పుట్టుకతో తాను ఏ భాషీయుడో దానిని తన మాతృభాషగా ప్రక టించుకొని, తన మాతృభాషలో మాట్లాడుకోవడానికి, చదువుకోవ డానికి, తన మాతృభాషను తోటి మాతృభాషీయులతో కలిసి వికసింప చేసుకోవ డానికి, సాంస్కృతిక ప్రత్యేకతలను కాపాడుకోవడానికి అంత ర్జాతీయ న్యాయసూత్రాల ప్రకారం, యునెస్కో వంటి అంతర్జాతీయ వేదికలపై ఇప్పటివరకు ప్రకటింపబడిన మానవ హక్కుల క్రింద అతడికి సహజమైన హక్కు ఉంది.

### మాతృభాషా దినోత్సవం

ఇక్కడ మనం ఒక సంగతిని గుర్తుచేసుకోవాలి. అది 2000వ సంవత్సరం నుండీ "యునెస్కో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ప్రకటించిన సంగతి. ప్రపంచంలోని మాతృభాషీయులందరూ తమ తమ భాషల్ని రక్షించుకోవడం కోసం పూనుకోవాలనీ, ఇందు కోసం ప్రతి ఏటా ఫిబ్రవరి 21ని "అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంగా జరుపు కోవాలని యునెస్కో పిలుపునిచ్చిన సంగతే అది. ఇందుకుగాను ఆ తేదీని ఎందుకు నిర్ణయించారన్న నేపథ్యాన్ని కూడా మనం ఇక్కడ చెప్పుకోవచ్చు.

భారత భూభాగం నుండి మత ప్రాతిపదికపై తూర్పు పడమర ల్లోని రెండు భాగాలను విడదీసి, ఆ రెండింటినీ కలిపి పాకిస్తాన్గా 1947లో బ్రిటిష్వలస ప్రభుత్వం ఏర్పరచి వెళ్ళింది. రెండు భాగాలూ ఒకే దేశం అయినా, పశ్చిమ పాకిస్తాన్‌దే పెత్తనం సాగుతూ ఉండేది. పశ్చిమ పాకిస్తాన్ పెత్తనం తూర్పు పాకిస్తాన్‌పై భాషాపరంగా కూడా సాగింది. పాకిస్తాన్ అధికార భాష ఉర్దూను తూర్పు పాకిస్తాన్‌పై రుద్దడాన్ని సహించని అక్కడి పౌరులు ముఖ్యంగా మేధావి, విద్యార్థి వర్గాలు తమది బెంగాలీ భాష అనీ, అదే తమ జాతీయభాష అనీ ప్రకటించుకున్నారు. ఉద్యమిం చారు. దాన్ని అణచివేయడానికి పాల కులు జరిపిన కాల్పుల్లో కొందరు బంగ్లా ఉద్యమకారులు మరణిం చారు. ఆ రోజే 1952 ఫిబ్రవరి 21 తర్వాత తూర్పు పాకిస్తాన్, బంగ్లాదేశ్ స్వతంత్ర రాజ్యంగా ఏర్పడడం తెలిసిందే. తవు మాతృభాషను రక్షించుకోవడానికి తూర్పు బెంగాల్ దేశీయులు జరిపిన పోరాటానికి గుర్తుగా నిలిచిన ఫిబ్రవరి 21ని 'అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం'గా 'యునెస్కో' ప్రకటించడానికి కారణం ఇదే. బంగ్లాదేశ్ విషయంలో అత్యధికంగా ఉన్న ఒక భాషా సమూహం నివసిస్తున్న భూభాగం ఒక దేశంగా ఏర్పడింది. అంటే భాషా పరంగా తమపై సాగుతున్న అణచివేతకు ఎదురు నిలిచి, పోరాడి బంగ్లాదేశ్ స్వాతంత్ర్యాన్ని సాధించుకొన్నదని మనం గ్రహిస్తాం. అయితే, బంగ్లా దేశ్‌లో కూడా భాషాపరమైన మైనారిటీలు లేరని కాదు. వాళ్ళు తమ సంఖ్యను బట్టి, తమ అవసరాన్ని కోరికల్ని ఆధారంగా చేసుకుని తమ తమ మాతృభాషల్ని రక్షించుకోవడానికి ప్రజాస్వామ్య పద్ధతు ల్లోనో, అవి చెల్లనప్పుడు తమకు తోచిన మరో మార్గంలోనో తమ ప్రయత్నాలు తాము కొనసాగించుకోవచ్చు. ఆ దేశంలో లక్షలాది మంది తెలుగువారు కూడా జీవిస్తున్నది ఇలాగే అని సమాచారం.

### మాతృభాషల రక్షణే కీలకం

మాతృభాషల్ని రక్షించుకోవాలని యునెస్కో పిలుపు ఇవ్వడంలో ప్రధానమైన అంశం - జీవ వైవిధ్యాన్ని (బయోడైవర్సిటీని) కాపాడు కోవడం. వేలాది సంవత్సరాలుగా ఆయా భాషా సమూహాలు తాము సాగించిన జీవన యానంలో తమ భాషలో నిక్షిప్తం చేసుకొన్న జ్ఞానాన్ని సాంస్కృతిక వారసత్వ సంపదను కోల్పోకుండా ఉండటానికి తమ భాషను రక్షించుకోవాలన్నదే ఆ పిలుపు సారాంశం. సామ్రాజ్యవాదుల పెత్తనంవల్ల నష్టపోయిన భాషాసమూహాలు తమను తాము రక్షించు కోవడానికి తమ మాతృభాషలను రక్షించుకోవడమే కీలకం అనే సందేశం అందులో ఇమిడి ఉంది. మాతృభాష ద్వారా అనంత విజ్ఞా నాన్ని సంపాదించడమే శాస్త్రీయ మైన పద్ధతి అని, పరభాషల ద్వారా జ్ఞానసముపార్జన కష్టతరమనే అశాస్త్రీ యమనే సందేశం అందులో ఉంది. అన్ని విధాలా తమ మాతృభాషల ద్వారానే మానవ వికాసం జరగాలనే ధర్మసూక్ష్మం అందులో వుంది.

మన దేశం సంగతే చూసుకొంటే - బ్రిటిష్ సామ్రాజ్యపాలన నుండి విముక్తి పొందేందుకు దేశ వ్యాప్తంగా దీర్ఘకాలం చేసిన స్వాతం త్ర్యోద్యమ ఫలితంగా జాతీయవాదం వెల్లివిరిసింది. రాజుల పాలనలో వున్న భిన్న జాతీయతలకు, భాషా సమూహాలకు అతీతంగా భారతదేశ మంతా ఒకటేనన్న భావాన్ని మన జాతీయోద్యమం మనకు నేర్పింది. స్వాతంత్ర్యానంతరం మనం భారతదేశానికి ఒక రాజ్యాంగాన్ని సిద్ధం చేసుకొని ఒక సర్వసత్తాక రాజ్యంగా ప్రకటించుకొన్నాం. ఆ రాజ్యాంగ నిర్మాణ సమయంలోనే రాజ్యాంగ పరిషత్ సభ్యులు అనేక సందర్భాల్లో దేశ భాషల విషయం చర్చించారు. దేశంలోని భాషా వైవిధ్యం కార ణంగా భారతదేశాన్ని కలిపి ఉంచే ఒక జాతీయ భాష ఉండాలని పెద్దలు

అభిప్రాయపడినా, దానిపైన ఏకాభిప్రాయం కుదరకపోవడంతో సంస్కృతం, హిందీ వాదులకు జరిగిన పోటీలో ఇరువురికీ సమానంగా ఓట్లు రాగా, అధ్యక్షుని ఓటుతో హిందీ గెలిచిన సంగతిని మరువరాదు. చివరకు జాతీయ అనుసంధాన భాషగానే హిందీని ఆమోదించారు. అందు వల్ల ఇప్పుడు రాజ్యాంగం ప్రకారం మనకున్నవి 22 దేశ భాషలు. వాటిలో హిందీ జాతీయ అనుసంధాన భాష. అంతేగాని, ఒక జాతీయ భాష అంటూ రాజ్యాంగపరంగా దేనికీ గుర్తింపులేదు. రాజ్యాంగం 8వ షెడ్యూలు లోని 22 భాషల్నీ జాతీయ భాషలుగా గుర్తించాలనే చిరకాలపు డిమాం డుకు గతంలో ఎన్డీఏ, యుపిఏ ప్రభుత్వాలు తలలూపినా, అందుకోసం ఆ ప్రభుత్వాలు ఎటువంటి చర్యలూ చేపట్టలేదు. కనుక- మనకు సంబం ధించి నంతవరకు మాతృభాషలన్నీ జాతీయభాషలే. భారత జాతీయత క్రిందనే, రాజ్యాంగ రక్షణ క్రిందే ఇవన్నీ వర్ధిల్లుతుంటాయి. కనుక భారత జాతీయతకు లోబడే మాతృభాషలన్నీ ఉంటాయి.

**జాతి, జాతీయత, జాతీయవాదం అంటే?**

మనం ఇక్కడ పరిశీలించవలసిన అంశాలు ఏమిటంటే - ఒక జాతీయ రాజ్యవ్యవస్థ (నేషన్ స్టేట్)లో ఒకే మాతృభాష ఉండాలా? అనేక మాతృభాషలు కలిసి మనుగడ సాగించలేవా? అసలు, మాతృ భాషలకు అతీతంగా జాతీయ రాజ్యవ్యవస్థల ఏర్పాటుకు కారణమయ్యే అంశాలు ఏమిటి? భౌగోళిక ఏకత ఆధారంగా ఆధునిక జాతీయ రాజ్యాలు నిర్మాణమై ఉన్నప్పుడు భాష, భౌగోళికతల మధ్య ఘర్షణలు ఏర్పడే అవకాశాలుండవా? అప్పుడు జాతీయత, జాతీయవాదం అనే మాటలను మనం ఎలా అర్థం చేసుకోవాలి? మరీ ముఖ్యంగా పలు భాషల ప్రజలు నివసించే దేశం (జాతీయ రాజ్యవ్యవస్థ)లో ఒక భాషీయులు తక్కిన భాషీయులపై పెత్తనానికి పూనుకొన్నప్పుడు, ఘర్షణకు వీలుంది కదా. అలాంటప్పుడు జాతీయవాదం పటాపంచలై ఆ రాజ్యవ్యవస్థ విచ్ఛిన్నమై, దాని నుంచి మరొకటి గాని, అంతకంటే ఎక్కువగాని రాజ్యాలు ఏర్పడే అవకాశం ఉంది కదా. అలాంటి పరిస్థితిని ఎదుర్కోగల శక్తి జాతీయవాదా నికీ, జాతీయ భాషావాదానికీ ఉందా? ఇలాంటి ప్రశ్నలు అనేకం మన ముందు నిలిచి వుంటాయి.

ఈ అంశాలన్నిటినీ పరిశీలించడానికి మన దేశం కంటే సరైన ఉదాహరణ మరొకటి దొరకదు. మన పరిస్థితులను పరిశీలించుకొని, రాజ్యవ్యవస్థకు జాతీయతా భావానికి సంఘర్షణకు తావులేని జాతీయ వాదాన్ని భారత రాజ్యవ్యవస్థలో సాధించేందుకు ప్రయత్నించాలి. అందుకోసం మన దేశంలో నెలకొని ఉన్న అన్ని రకాల వైవిధ్యాలనూ మనం గుర్తించాలి. నదీ జలాలు, భూగర్భ ఖనిజ సంపద, ప్రకృతి సంపద వంటి భౌగోళిక వనరుల వాస్తవ స్థితి, బహుళ భాషాజాతుల వారసత్వ సంపదను రక్షిస్తూ సమకాలీన ప్రగతి మార్గంలో అందరినీ ఏకత్రాటిన నడిపించవలసిన అవసరాన్ని మనం గుర్తించాలి.

ఏదో ఒక ఆదర్శాన్ని ముందు పెట్టి, దాని కోసం జాతీయ వాదాన్ని బలపరచాలనుకోవడం సరైన పరిష్కారం కాదు. ఎందుకంటే ఈ వైవిధ్యా లన్నిటికీ ఆధారమూ, కారణమూ భాషా సాంస్కృతిక వైవిధ్యం కనుక. ఈ అంశాన్ని గుర్తిస్తే సాంస్కృతిక జాతీయవాదం ఎలా ఉండాలో రూపొం దించుకోగలుగుతాం.

**భాషాప్రయుక్త రాష్ట్రాల ప్రభావం**

స్వాతంత్ర్యోద్యమ సమయంలోనే భాషా ప్రయుక్త రాష్ట్రాల చర్చ బలంగా వచ్చింది. అందువల్లనే స్వాతంత్ర్యాన్ని సాధించిన వెంటనే ఈ సమస్యను పరిష్కరిస్తామని భారత జాతీయ కాంగ్రెసు ఒప్పకొంది. స్వాతంత్ర్యం తర్వాత ఈ సమస్య బలంగా ఉద్యమరూపం తీసుకొంది. దాని ఫలితంగానే భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడ్డాయి. ఫజలాలీ కమిషన్ ఈ అంశంపై ఇచ్చిన నివేదికల్లో దీనిపై ఎంతో చర్చ ఉంది. కేవలం భాష ప్రాతిపదికపై రాష్ట్రాల ఏర్పాటుకు గిరులు గీయడం సాధ్యపడదనీ, ఆ రాష్ట్రాల మనుగడ కోసం అనేక ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకోవాలనీ స్పష్టంగా చెప్పింది. అనేక పరిమితుల మధ్యనే భాషా రాష్ట్రాల ఏర్పాటు జరిగింది. అందువల్లనే భాషల మధ్య వైరుధ్య భావనలకు నేటికీ అవకాశాలు పెరుగు తున్నాయి. మద్రాసు హైకోర్టు ప్రాచీన భాషల వ్యాజ్యంలో ఇటీవల ఇచ్చిన తీర్పు నుంచి మనం నేర్చుకోవలసింది ఎంతో ఉంది.

22 భాషల్ని మాత్రమే రాజ్యాంగం ఆమోదించింది. మరెన్నో చిన్నా పెద్దా భాషలు అణచివేతకు గురవుతున్నాయి. భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడిన తర్వాత ఆయా అధికారభాషల ఆధిక్యత వల్ల అక్కడి గిరిజన భాషలు, మరికొన్ని చిన్న భాషలు నశించిపోవడమో, పెద్ద భాషల్లో విలీనమై పోవడమో జరుగుతూనే ఉంది.

**భావవ్యక్తీకరణ మాధ్యమంగా హిందీ**

జాతీయోద్యమంతోపాటు హిందీని జాతీయభాషగా పెంపుచేసే చర్యలను చేపట్టారు. స్వాతంత్ర్యం తర్వాత కూడా అధికారికంగా ఆ ప్రయత్నాలను కొనసాగిసూనే ఉన్నారు. హిందీ ప్రాంతాలుగా పరిగ ణింపబడే రాష్ట్రాలను, వాటిలోపలి విభిన్న ప్రాంతాలను పరిశీలిస్తే వాటిలో భాషలో ఎంతో వైవిధ్యం కనబడుతుంది. అందులో పారశీ, అరబ్బీ పదాలు ఎంతగా కలిసిపోయాయో, హిందీ పేరుతో ఉర్దూ ఎంతగా చెలామణీ అవుతుందో గమనిస్తే ఆశ్చర్యం కలుగుతుంది. అటువంటి 'హిందూ స్తానీ''ని జాతీయ భాషను చేద్దామన్న గాంధీజీ ప్రతిపాదనను అంగీక రించలేదని, సంస్కృతం ఆధారితంగా ఉండే హిందీ జాతీయభాష కావా లన్న వాదం బలంగా ముందుకు వచ్చిందనీ చరిత్ర మనకు విశదం చేస్తున్నది.

చివరకు రాజ్యాంగం 351వ అధికరణలో "విభిన్న సంస్కృ తుల మిశ్రమమైన భారతీయుల మధ్య భావ వ్యక్తీకరణ మాధ్యమంగా (Medium of Expression) హిందీని అభివృద్ధి చేయడం కేంద్ర ప్రభుత్వ బాధ్యత. ఆ క్రమంలో అవసరమైన చోట సంస్కృతాన్ని ప్రాథమిక మూలంగా స్వీకరిస్తూ ఎనిమిదవ షెడ్యూలులోని ఇతర భాషలతో సమ్మిళితం అవుతూ, హిందూస్తానీ పదోచ్చారణకు తగిన ప్రాధాన్యమిస్తూ, హిందీ భాషా వ్యాప్తికి కృషి జరుగవలెను" అని పేర్కొన్నారు.

**ప్రాచీన భాషల సంగతేమిటి?**

మరి తెలుగు, తమిళం, కన్నడం వంటి ప్రాచీన భాషల సంగతే మిటి? తెలుగు భాషాచరిత్ర లోతుల్లోకి వెళ్తే- ఈ దేశపు బలమైన, పెద్దదైన ప్రాచీన భాషగా తెలుగు నిరూపితం అవుతుంది. అనేక చారిత్రక, రాజకీయ, సామాజిక కారణాలవల్ల తెలుగు ప్రజలు సగంమంది మాత్రమే ఆంధ్ర, తెలంగాణాల్లో ఉన్నారు. తక్కిన సగంమంది దేశవ్యాప్తంగా, ముఖ్యంగా పొరుగు రాష్ట్రాల్లో ఉన్నారు. ఇదే విధంగా మరికొన్ని భాషా జాతులూ ఇటువంటి పరిస్థితుల నెదుర్కొంటున్నాయి. ఈ అంశాలను పరిశీలించవద్దా?

భాషా రాష్ట్రాల ఏర్పాటువల్ల తలెత్తే భాషాపరమైన మైనారిటీల సమస్యను గుర్తించినందువల్లనే రాజ్యాంగ నిర్మాతలు 347, 350-ఎ, 350-బి. అధికరణలను పెట్టారు. అయితే ఈ అరవై ఏళ్ళలో ఆయా రాష్ట్రాల్లోని భాషాపరమైన మైనారిటీలు భాషా సంస్కృతుల పరంగా అణచివేతకు గురయ్యారు. దీనికి స్పష్టమైన ఉదాహరణ తమిళనాడు. అక్కడ 42శాతం మంది తెలుగు భాషాసమూహాలు ఈ అణచివేతకు

బలయ్యారు. తక్కిన రాష్ట్రాల్లో అణచివేత ఉన్నా లేకపోయినా నిర్లక్ష్యానికి గురయ్యారు. దీనికి రాజ్యాంగం గాని, కేంద్ర ప్రభుత్వం గాని ఎటువంటి బాధ్యతనూ తీసుకోవడం లేదు. ఈ విషయంలో రాజ్యాంగం పూర్తిగా నిర్లక్ష్యం చేయబడింది.

రాయి పట్టి, మన్ను పుట్టక ముందే పుట్టిన శ్రేష్ఠమైన తొలి భాష తమిళ్ అని ప్రకటించుకొని ద్రవిడోద్యమం రాజకీయ రంగంలో భాషను ప్రధాన అంశం చేసుకొని చాలా పెద్ద ఎత్తుగడలతో సాంస్కృతిక, రాజకీయ దీర్ఘకాల ప్రణాళికలకు సిద్ధ మవుతున్న నిజాన్ని మనం గమనించాలి. దీనితోపాటు అన్ని ప్రాంతాల్లో ఉన్న తెలుగు వారిలో స్వభాష రక్షణ పట్ల పెరుగుతున్న ఆందోళన, ఇతర భారతీయ భాషీయుల్లోనూ మాతృభాషల పట్ల పెరుగుతున్న అనురక్తి పట్టించుకోకుండా వదలివేసే అంశాలు కావు. మాతృభాషల రక్షణే జాతీయవాదా నికి మనుగడ.




జాతీయతా, జాతి అనే మాటలు సాపేక్షికం. ఈ శబ్దాల ప్రయో గాన్ని చూసి మనం భయాన్నో కలతనో చెందనక్కరలేదు. కాని, అవి స్వాభిమానాన్ని ఐక్యతను వెల్లడించే భావాలు మాత్రమే. భాషా సమూహం అన్నప్పుడు దానికి ఎవరూ విపరీత భాష్యాలను చెప్ప నక్కరలేదు. ఇప్పటి జాతీయ రాజ్య వ్యవస్థల (నేషన్ స్టేట్స్) పరిధిలో ఆ భాషీయులు (ఆ భాషా జాతీయులు), తమ అవసరాల తీరులో, తమ అభివృద్ధికి అది అడ్డంకిగా నిలువనంత కాలం, లేదా ఇతర భాషా సమూహాలు పెత్తనం చేయడంగాని, అణచివేతకు ప్రయత్నిం చడంగాని జరుగనంతకాలం – తమ జీవనం, నేలతో వున్న సంబంధం తదితర అంశాల ఆధారంగా ఆ దేశ జాతీయతా పరిధుల్లో (భాషా రాష్ట్రాల పరిధులతో కలుపుకొని) ఉంటారు. కాని పక్షంలో ప్రజా స్వామికంగానో, అప్రజాస్వామికంగానో ఎదురు తిరిగేందుకు ఎప్పుడూ అవకాశం ఉంటుంది. అప్పుడా రాజ్య వ్యవస్థతో ఘర్షణ రావడమూ, పరిణామాలను ఎదుర్కొనక తప్పని పరిస్థితి వస్తుంది. ఆ ఫలితాలు ఇరుపక్షాల్లో ఎవరికైనా అనుకూలం కావచ్చు.

అందువల్ల అత్యంత సంక్లిష్టమైన భాషా సామాజికత ఉన్న మన దేశంలో జాతీయవాదం మనుగడకు మాతృభాషలను రక్షించు కోవడం, అవి స్వతంత్రంగా ఎదగడానికి అన్ని విధాలా అవకాశ మివ్వడం తప్పదు. ఇప్పటికే ఉన్న భాషా సమస్యల్ని కూడా సానుకూల దృష్టితో పరిష్కరించు కోవాలి. జాతీయవాదం పేరుతో ప్రత్యక్షంగాగాని, పరోక్షంగాగాని మాతృ భాషలపై సంస్కరణలకు, పెత్తనానికి, పరాయీ కరణకు ప్రయత్నించడం అత్యంత ప్రమాదకరం. దేశం మొత్తంలో ఎక్కువ సారూప్యతను తేవాలనే పేరుతో శాస్త్ర సాంకేతిక పదాల్ని అన్ని భారతీయ భాషల్లోనూ ఒకే విధంగా ఉండేట్లు చూడాలనే ఆలోచనలు, ప్రయత్నాలు, పరోక్షంగానో ప్రత్యక్షం గానో జరుగుతూనే ఉన్నాయి. ఈ విధమైన ప్రయత్నాలు హిందీ ప్రాంతాల్లో సాధ్యం కాగలవేమోగానీ, ఇతర భాషల్లో సాధ్యం కావు.

**ఐక్యతాభావనే జాతీయవాదానికి రక్ష**

అన్ని మాతృభాషలూ గొప్పవే. వాటిమానాన వాటిని ఎదగడాన్ని ప్రోత్సహిద్దాం. భాషల పుట్టుక, పెరుగుదల కొన్ని సహజ సూత్రాలతో సాగుతుంది. ప్రవహించే నదుల్లాంటివి భాషలు. వాటిలో జోక్యం తగని పని. అది జాతీయతకు దారితీయదు. జాతీయవాదం సహజీవనంతో బలపడుతుంది. అవగాహనతో ఇచ్చిపుచ్చుకోవడంతో పెరుగుతుంది. విద్యావికాసంతో, విజ్ఞాన వికాసంతో విశాల భావ నలు వ్యాప్తమౌతాయి. ఆ పరిణామాలు సర్వజనీన భావనలకు దారి తీస్తాయి. జాతీయవాదం కూడా ఆ భావనలకు లోబడే, నిలబడగలుగుతుంది. భారతదేశానికి సంబంధించి ఇది మరీ ముఖ్యంగా గమనించ వలసిన అంశం. దేశభాషల్ని బలపరచుకోవడమే జాతీయవాదాన్ని బలపరచుకొనే మార్గం. వైవిధ్యా న్నుంచి ఐక్యతాభావనను పెంపొందిం చడమే జాతీయవాదానికి రక్ష.

'సాంస్కృతిక జాతీయవాదం' గురించి తీసుకుంటే, ఒక దేశ సార్వభౌమతను కాపాడుకోవడానికి కేవలం భౌగోళికంగానేగాక, ఆ దేశ ప్రజల్లో సాంస్కృతిక సమైక్యతను కూడా సాధించడం అవసరం. అయితే ఎంతో వైవిధ్యంతో కూడిన భారత సమాజంలో భాషల్లో వైవిధ్యం చాలా లోతైన అంశాలతో కూడుకొని ఉంది. సంస్కృతికి భాష ప్రాణం. కనుక భాషలతోపాటే సాంస్కృతిక వైవిధ్యత కూడా అంత గాఢంగా ఉంటుంది. అన్ని భారతీయ భాషల, సంస్కృతుల మధ్య వైవిధ్యాలకు అతీతంగా ఉన్న సారూప్యతలను ప్రధానంగా తీసుకొని, జాతీయ సాంస్కృతిక సమైక్య తను నిర్మాణం చేసే కృషి జరగాలి. దురదృష్టవశాత్తు ఇంతవరకూ ప్రభు త్వాలు ఈ దిశగా ఆలోచించడంలేదు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజనకు దారితీసిన అనేక అంశాల్లో భాషా సాంస్కృతికపరమైనవి కూడా ఉన్నాయి. ఇదే పరిస్థితి భారతదేశంలో పునరావృతం కాకుండా ఉండాలంటే సాంస్కృతిక జాతీయత అన్న మాటను ఒక నినాదంగాగాక, సమైక్య భారత జాతీయతను సాధించే దిశగా మన ఆలోచనలు సాగాలని ఆశిద్దాం.

చైతన్యవంతమైన, శక్తివంతమైన భారతదేశాన్ని నిర్మించుకోవడం కోసం స్వామి వివేకానందుడు, అంబేద్కర్ వంటివారు ఈ అంశాలపై ఏమి చెప్పారో లోతుగా పరిశీలించాలి. మాతృభాషల్ని ప్రోత్సహించడం ద్వారా జాతీయవాదాన్ని బలపరచుకో గలుగుతాము.

*('జాగృతి' వారపత్రిక 2016 అక్టోబరు 31 సంచిక నుండి...ధన్యావాదాలో..)*

శ్రద్ధాంజలి

## 'రుద్రజ్వాల'
## వెలుగు వెంకట సుబ్బారావు



కనువెలుగు :.........................
కనుమరుగు: 2016 అక్టోబరు 24

నిలువెల్లా గాయమైన తెలుగుపాట ఈ గీతం
నెత్తుటి రుతుపవనాలను వీచే ఒక జలపాతం ॥నిలువెల్లా॥

పెదవులు కుట్టేసినట్టు పదపదమున మూగతనం
నడకను కట్టేసినట్టు అడుగడుగున కుంటితనం
కళ్ళల్లో కరుకు పొద్దు...చూపుల్లో కటికి రేయి
కదిలే కనుపాపల్లో కంటివాన ముసురు ॥నిలువెల్లా॥

రెక్కలు విరిచేసినట్టు ఏమి చేయలేని తనం
వెన్నుపూస వంచినట్టు ఏది మోయలేని తనం
మెలకువలో భయం భయం-మౌనంలో మధనం
మగత నిద్రలో కూడా తెరల తెరల సంక్షోభం ॥నిలువెల్లా॥

ఏఏ దరువులు విన్నా అన్ని వలస శబ్దాలే
ఏఏ దారులు గన్నా అగాధాల స్వార్థాలే
అక్షరాలు పండించిన చెమట నదుల చేతులేవి
అమ్మపలుకు బండిపైకి పనలెత్తిన జాతి ఏది?

ఏ పడమటి తుపానులో చిక్కుబడీ పోయినవో
ఏ పరాకు పతనాలకు ముక్కచెక్కలైనామో ॥నిలువెల్లా॥

ఈ అక్టోబరు 24న మనకు దూరమైపోయిన వెలుగు వెంకట సుబ్బారావుగారు రెండేళ్ళక్రితం రాసిన పాట ఇది. ఈ పాటలో తెలుగుభాష, తెలుగుజాతి పరిస్థితి పట్ల ఆయనకున్న లోతైన అవగాహన, ఆవేదన పెల్లుబికి కనిపిస్తుంది. **నుడినెగుడు** పేరుతో రాసిన ఈ పాట ఆయనకి ఎంతో ఇష్టమైనది.

ఆయన మరణించడానికి కొన్ని నెలలముందు కరణం కల్యాణ కృష్ణ ఆయనతో చేసిన 'ముఖాముఖి' పూర్తికాకుండానే సగంలో ఆగిపోయింది.

దానిని ఈ ప్రక్కన ప్రచురిస్తున్నాం. -సం॥

# నింగికెగసిన నక్షత్రం

**"**రాజుమరణించె ఒక తార రాలిపోయె..
సుకవి మరణించె ఒక తార గగనమెక్కె." -గుర్రం జాషువా

కొంతమంది తమ పుట్టుక వెనుక మర్మాన్ని గుర్తెరిగి నడుచుకుంటుంటారు.. అలాంటి వారిలో కవులు ముందుంటారు. అదే కోవకు చెందిన ప్రజాకవి వెలుగు వెంకట సుబ్బారావు. 'రుద్రజ్వాల' కలం పేరుతో చిరపరిచితమైన సాహితీ గళం వెలుగు వెంకట సుబ్బారావు. తాడిత, పీడిత ప్రజల వర్గాన నిలిచి అలతి పదాలతో కథలు, కవితలు, నాటికలు, పాటలు రచించి, ఆలోచింపజేసి, పెత్తందారులపై కలం ఝుళిపించి, తెలుగుభాష జెండాను భుజాన మోసిన నిత్య ఉద్యమకారుడు రుద్రజ్వాల అక్టోబర్ 23న కన్నుమూశారు. రుద్రజ్వాల మృతి సాహితీలోకానికి తీరని లోటే... శ్రీశ్రీవంటి మహాకవుల సాన్నిహిత్యంలో సాహిత్య సేద్యం చేసిన రుద్రజ్వాల, వరకట్న హత్య నేపథ్యంలో వ్రాసిన 'సమస్య' నాటిక ముంబాయి, చెన్నై నగరాలతో పాటూ దేశవ్యాప్తంగా 150 పైగా ప్రదర్శనలకు నోచుకుంది. పెత్తందార్ల దౌర్జన్యాల పై రాసిన 'రాములోరిగుడి' అప్పట్లో పెద్ద సంచలనం. చేనేతకార్మికుల పై రాసిన 'నాడి', తీరప్రాంత ప్రజల సమస్యలపై విరుచుకుపడ్డ 'కడలి ' ఆయనకు ప్రజలతో ఉన్న బాంధవ్యాన్ని తెలియజేస్తాయి.. పేదోడికి అటు ఇటు ఉండేవాడే కవి అన్న శ్రీశ్రీ మాటలకు కట్టుబడి, అక్షరాలా ఆఖరివరకూ ఆచరించిన మహోన్నత వ్యక్తిత్వం ఉన్న రుద్రజ్వాల చివరి రోజులన్నీ ఎప్పుడైనా పడిపోయేట్లున్న చిన్న గదిలో గడిపి అక్టోబరు 24న తుది శ్వాస విడిచి సాహితీ ప్రియులను విషాదంలో ముంచారు.

నీటి సమస్యలపై రుద్రజ్వాల రాసిన 'నీటి పోరూ- కన్నీటి హోరు' నాటిక గుడివాడ ఏఎన్నార్ కళాశాలలో ప్రదర్శించగా తిలకించిన అక్కినేని చలించిపోయారంటే రుద్రజ్వాల కలం ఎంతటి శక్తిమంతమైనదో అర్థమవుతుంది.. పర్యావరణం పై , రైతన్నల కష్టాలపై ఆయన రచనలు చేశారు.. వామపక్ష భావజాలం ఉన్న పలు చిత్రాలకు పాటలనందించారు.. విప్లవ రచయితల సంఘానికీ (విరసం), తెలుగు భాషోద్యమ సమాఖ్యకీ పతాక గీతాలను రచించారు.. ఆయన విరసం నుంచి అనివార్య కారణాలతో బయటకు వచ్చినా తన ఉద్యమ స్ఫూర్తిని మాత్రం వీడలేదు.. తన రచనలతో ప్రభుత్వాల తీరును ఎండగడుతూనే, ప్రజలను చైతన్యపరచడం లో అవిరళకృషి చేసిన రుద్రజ్వాల ప్రచారానికి దూరంగా ఉంటారు.. అలాంటి రుద్రజ్వాల వివిఎస్ మనసువిప్పి మాట్లాడిన తొలి, మలి ముఖాముఖి 'అమ్మనుడి' పాఠకులకోసం ప్రత్యేకంగా....

**ప్రతినిధి :** నమస్కారం రుద్రజ్వాల గారూ.

**వివిఎస్ :** నమస్కారం

**ప్రతినిధి :** మీ బాల్యం గురించి తెలియజేస్తారా ?

**వివిఎస్:** ప్రకాశంజిల్లా కారంచేడు సమీపంలోని ఇసుకపర్రు, కొడవలివారిపాలెంలో నా బాల్యం అంతా గడిచింది. నాగులుప్పల పాడు మండలం తిమ్మసముద్రం లో తొమ్మిదవతరగతి వరకు చదువుకున్నాను. ఆతరువాత మా తల్లిదండ్రులతో కలసి చీరాలకు




మకాం మార్చాము. చీరాలలోని విఆర్ఎస్ అండ్ వైఆర్ ఎన్ కళాశాలలో పియుసి చదువుకునే సమయంలో విద్యార్థిసంఘం అధ్యక్షుడుగా రామానాయుడు (ప్రముఖ చలనచిత్ర నిర్మాత), కార్యదర్శిగా నేను పనిచేయడం ఒక మధురానుభూతి. అనంతరం గుంటూరు ఆంధ్ర క్రిస్టియన్ కళాశాలలో డిగ్రీ చదువుతున్న సమయంలో జంధ్యాలపాపయ్య శాస్త్రి గారి శిష్యుడుగా పద్యకవిత్వం రాయడం మొదలెట్టాను. ఆ తరువాత ఆంధ్రా యూనివర్సిటీలో ఎం ఎ. చేశాను. నాటినుండి నేటివరకు సాహిత్య కళారంగాలకే నా జీవితాన్ని ధారపోస్తున్నాను.

**ప్రతినిధి :** విరసంలో కీలకపాత్ర పోషించిన మీరు, విరసంలో అడుగు పెట్టడానికి గల ఆనాటి పరిస్థితులను తెలుసుకోవచ్చా?

**వివిఎస్ :** 67-69 ప్రాంతంలో భారత రాజకీయాల్లో పెనుమార్పులు సంభవించాయి. అందులో భాగంగా 70లో వచ్చిన విప్లవ రచయితల సంఘం (విరసం) ఓ సంచలనం. ఆసమయంలో అనేక మంది సాహితీవేత్తలు విరసం ఆశయాలకు ఆకర్షితులయ్యారు. శ్రీశ్రీ, త్రిపురనేని మధుసూదనరావు, కేవిరమణారెడ్డి వంటి మిత్రులతో కలసి విరసం ఆశయాలలో భాగంగా పీడితుల కోసం ఎన్నో నాటకాలు రాయడం జరిగింది. విరసం లో ఉన్నప్పుడు రాసిన ఒక అద్భుతమైన నాటకం 'పునరంకితం'. అది గోండుల జీవితాలకోసం రాసిన నాటకం. 60లో 'జగిత్యాల జైత్రయాత్ర 'పేరుతో జరిగిన రైతాంగ పోరాటానికి అనుకూలంగా రాసినటువంటి ఘంటారావం. ఆళవ రాజయ్య ఆ నాటకానికి స్ఫూర్తి . మిత్రులు కేవిఆర్, వరవరరావు, గద్దర్ వీళ్ళంతా విరసంలో నాతోపాటు ఉన్నారు. 94 లో అనివార్య కారణాల వల్ల విరసం నుంచి బయటకు వచ్చేశాను.

**ప్రతినిధి:** విరసానికి పతాకగీతం రాసిన నేపథ్యం తెలియజేస్తారా ?

**వివిఎస్ :** విరసం ప్రారంభ సమయం నుంచి పతాక గీతం ఎవరైనా రాస్తే బాగుంటుందని అనుకున్నాం. శ్రీశ్రీగారు నన్నురాయమన్నారు. అప్పుడు రాసిందే

" ఎత్తినాము విరసం జెండా
అలలలలుగ వరదలెత్తు
పోరుపోరు జెండా
సుబ్బారావు పాణిగ్రాహి
సంధించిన కలలత్రోవ
మా ఎన్ ఎస్ ప్రకాశరావు
మండించిన కథనంలో
పరిటాల రాములన్న
ప్రతిఘటనా పాదంలో
గళ గళమున
క్రాంతి జెంది...

ఎత్తినాము విరసం జెండా "అనే ఈ గీతం నేటివరకు విరసం సభల్లో పాడుతున్న నాగీతం.

**ప్రతినిధి :** మీరు సినిమాలవైపు ఆకర్షితులు అవడానికి సందర్భమేది? అందులో మీ మిత్రులు రామానాయుడుగారి పాత్ర ఏమైనా ఉందా?

**వివిఎస్ :** మద్రాసులో పొన్నలూరి బ్రదర్స్ వద్దకు రామానాయుడు గారు వెళ్ళినతరువాత ఆయనను చూడటానికి ఒకసారి వెళ్ళాను. ఆ సమయంలో పొన్నలూరి బ్రదర్స్‌తో సాన్నిహిత్యం ఏర్పడింది. భాగ్యరేఖ, దైవబలం, కాడెద్దులు ఎకరం నేల, చిత్రాలు అన్నీ వామపక్ష అభిప్రాయాలతో సాగినటువంటి సినిమాలు. వాటిల్లో నేను కొన్ని కొన్ని పాటలు రాయడం జరిగింది. రామానాయుడు గారితో కళాశాల రోజులనుంచి మా స్నేహం కొనసాగింది. నాకున్న సాన్నిహిత్యం మరువలేనిది. ఆయన వివాహానికి 'కల్యాణ కనకాంబరాలు' అనే గీతం రాసి ఇచ్చాను. వదిన గారిగా నేను పిలిచే రాజేశ్వరిగారికి రామనాయుడు గారికి జరిగిన వివాహానికి రాసిన 'కల్యాణ కనకాంబరాలు' రామానాయుడు దంపతులు చాలా ఇష్టపడే గీతం స్నేహితులు గానే కాకుండా అన్నదమ్ములుగానే కలసిమెలసి జీవించాం. మొన్న మొన్నటివరకు నా కష్టాల్లో, నష్టాల్లో, నా కన్నీళ్లలో పంచుకున్న మిత్రుడు ఆత్మీయుడు, సోదరుడు ఇప్పుడు లేకపోవడం నాకు భరించరాని విషయం. కాలం గాయాన్ని మార్పుతుంది. ప్రజల దృష్టి ఉన్నవాడు ముందుకే సాగుతాడు తప్ప వెనక్కి వెళ్ళడనేటటువంటి మార్క్సిస్టు దృక్పథం కలిగిన రచయితను కాబట్టి ముందుకే ప్రయాణం చేస్తున్నాను. (రామానాయుడు గారి గురించి మాట్లాడుతున్నంత సేపు వివిఎస్ గారి కంటి చెమ్మ ఊరుతూనే ఉంది.)

**ప్రతినిధి :** విరసం నేత పరిటాల రాములు మీద తీసిన చిత్రం 'శ్రీరాములయ్య'లో మీరు రాసిన పాట వివరాలు చెబుతారా ?

**వివిఎస్ :** పరిటాల రవి, నేను గుడివాడలో పనిచేస్తున్నప్పుడు వచ్చాడు. "నాన్నగారి పేరుతో శ్రీరాములయ్య చిత్రం తీస్తున్నాం బాబాయ్, నాన్నగారిమీద మీరు రాసిన పాట ఉందికదా దానిని వాడుకుంటాం అని అడిగారు. మార్పులు లేకుండా వాడుకుంటే నాకు అభ్యంతరం లేదని, డబ్బులు కూడా అవసరం లేదని శ్రీరాములయ్య గారి మీద రాసిన పాటను రవికి అందించాను. ఏం జరిగిందో ఏమో తెలియదు కాని, అందులో రుద్రజ్వాల అనే పేరు లేదు. పాటలో కూడా అక్కడక్కడ మార్పులు జరిగాయి. అది నాకు బాధ కలిగించింది.

"పోరాటాల రాములు
నీకు లాల్ సలాములు
వృధా కాదు నీ మరణం
రేపటి సూర్యుని కిరణం" అనే పల్లవితో ప్రారంభం అవుతుంది ఆ గీతం. నాకు చాలా ఇష్టమైనటువంటి సోదర సమానులు పరిటాల శ్రీరాములుతో కలసి తిరిగాము విరసంలో. విరసం నుంచి బయటకు వచ్చిన తరువాత కూడా వారితో అనుబంధం కొనసాగింది. అనంతపురంలో నేను వేసిన ప్రతి నాటకానికి వచ్చేవారు. అనంతపురం వెళితే వెంకటాపురం తీసుకు వెళ్ళేవారు. మూడు, నాలుగు రోజులు ఆయనతో గడిపే వాళ్ళం.

**ప్రతినిధి :** మీరు విరసం నుంచి బయటకు వచ్చిన అనంతరం ?

**వివిఎస్ :** తెలుగు భాష ఉండగా ఉండగా అంతర్ధానమవుతుందని అంతర్జాతీయసమితి హెచ్చరించిన తరువాత భాష గురించి ఏదైనా చేయాలన్న ఆలోచన కలిగింది. అదే సమయంలో డా.సామల రమేష్ బాబు, కీ.శే.సి.ధర్మారావుల పూనికతో శ్రీ మండలి బుద్ధప్రసాద్ నేతృత్వంలో తెలుగు భాషోద్యమ సమాలోచన శిబిరం కృష్ణాజిల్లా శ్రీకాకుళంలో 2002 నవంబరు 1,2 తేదీలలో జరిగింది. అక్కడి నిర్ణయానుసారం 2003 ఫిబ్రవరి 21న తెలుగుభాషోద్యమ సమాఖ్య సి.ధర్మారావు అధ్యక్షుడుగా, డా.సామల రమేష్‌బాబు ప్రధాన కార్యదర్శిగా ప్రారంభమైంది. అప్పటినుండి వారితో కలసి తెలుగు భాషోద్యమంలో కీలకంగా వ్యవహరిస్తున్నాను. ప్రస్తుతం కేంద్రకమిటి సభ్యునిగా తెలుగు భాష కోసం కృషి చేస్తున్నాను. తెలుగు భాషోద్యమ పతాక గీతాన్ని వ్రాయమని సామల రమేష్ బాబు కోరారు. ఆయనతో చర్చించిన మీదట ఈ పతాక గీతాన్ని వ్రాశాను....

తెలుగు పతాకమా!
నా జాతిపతాకమా!
ఎగరేస్తాం మళ్ళీ పై పైకీ
మాగుండెల ఊపిరి పోసీ ॥తెలుగు॥
ఒక్కోతరం.. ఒక్కోతరం
ఎంత నలిగి పొయ్యావో
ఏ చీకటి దుమ్ములో
ఎంత మాసిపొయ్యావో...
నీ ఏపుకు అడ్డమైన ప్రతికంపను పెళ్లగించి
జనం బతుకు మలుపుల్లో ఏరువాక పొంగిస్తాం ॥తెలుగు॥
ఏ అవసర దూరాలను
నీ గొంతై కలుపునో
ఏ అలజడి తీరాలను
నీ నడకై నిలుపునో...
అదేయాస, అదేబాస శ్వాసశ్వాసకూ పంచీ..
ఉద్యమాల కనురెప్పల రెపరెపలై జీవిస్తాం ॥తెలుగు॥

అంటూ నేను రాసిన ఈ గీతం తెలుగు భాషోద్యమ సమాఖ్య సమావేశం ఎక్కడ జరిగినా వినపడుతోంది. తెలుగు భాషోద్యమ సమాఖ్య సభల కొరకు నాటికలు, నృత్యరూపకాలు, చిన్నచిన్న పాటలు రాసాను.

**ప్రతినిధి :** భాషాసాహిత్యాలకు ఇంత గొప్ప సేవ చేస్తున్న మీరు, రాలి పడిపోయే చిన్న పాత గదిలో గడపడం ఇబ్బందిగా లేదా ?

**వివిఎస్ :** భయమేమి లేదు..ఆర్థికముగా ఆదుకొనేందుకు మిత్రులున్నారు. మిత్రులు జంపాల గంగాధర్ రావు నేను 40 సం॥ నుంచి స్నేహితులం. అయన పనిచేస్తున్న డిగ్రీ కాలేజిలో, ఆయన సహకారంతో మొన్నటి దాకా తెలుగు లెక్చరర్‌గా పనిచేశాను. ఇవాళ తెలుగు భాషకు పుట్టగతులు లేకుండా పోతున్న పరిస్థితుల్లో, తెలుగు మాట్లాడితేనే బూతు మాట్లాడినట్లు ఉంటుందని, తల్లిదండ్రులు, కార్పోరేట్ విద్యాసంస్థలు భావిస్తున్న దుర్భరస్థితిలో ఒక చిన్న పాఠశాలలో తెలుగు టీచర్‌గా పనిచేస్తున్నాను. అదే పరిస్థితి. ఉన్నంతలో సర్దుకు పోవడం... అంతే.

**ప్రతినిధి :** తెలుగు రచనా వ్యాసంగంలో వస్తున్న మార్పులపై మీ అభిప్రాయం, తెలుగుభాష పట్ల మమకారం పెంచుకోవడానికి రాబోయే తరాలకి ఎలాంటి సలహాలు ఇస్తారు ?

**వివిఎస్ :** ఉద్యమాలన్ని తగ్గుముఖం పట్టాయని నేను అనుకోను కాని, ఎక్కడైతే పేదలకష్టాలుంటాయో, ఎక్కడైతే పేదల కన్నీరు ఊరుతుందో అక్కడ కనిపించినా, కనిపించకున్నా నిజమైన ఉద్యమం ఖచ్చితంగా ఉంటుంది. ప్రజలు ఉంటారు. సాహిత్యం ఉంటుంది. సాహితీవేత్తలు ఉంటారు. శ్రీశ్రీ గారన్నట్లు " కష్టజీవికి రెండు వైపుల నిలబడే వాడే కవి", శ్రీశ్రీ గారు అన్న ఆ మాటలు నా జీవితంలో ఆచితూచి కష్టజీవికి రెండు వైపుల నిలబడటానికి చివరిదాకా ప్రయత్నం చేస్తున్నాను.

**ప్రతినిధి :** కొత్తగా ఎటువంటి నాటికలు రాస్తున్నారో తెలియజేస్తారా?

**వివిఎస్ :** ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య జీవిత చరిత్ర స్క్రీన్ ప్లే రాసే ప్రయత్నం చేస్తున్నాను. దుగ్గిరాల గోపాలకృష్ణయ్య ఇతివృత్తంపై సమగ్రమైన సమాచారాన్ని తీసుకు వచ్చినటు వారు మిత్రులు 'మన ఆంధ్రరత్న' రచయిత కరణం సుబ్బారావుగారు. చీరాల లోని యార్లగడ్డ అన్నపూర్ణాంబ డిగ్రీ కళాశాలకు ప్రిన్సిపాల్ గా పనిచేశారు. ఇద్దరం కలసి గోపాలకృష్ణయ్య ఇతివృత్తాన్ని నాటకంగా చలన చిత్రానికి స్క్రీన్ ప్లే గా తీసుకురావాలని అనుకున్నాం. ప్రజల కోసం కష్టపడి అసువులు బాసిన నిజమైన నాయకుడు గోపాలకృష్ణయ్య. చీరాల ప్రజలకు మాత్రమే కాకుండా దేశప్రజలందరికి తెలియజేయాలన్నదే మా ఆలోచన. ఆయన రాసిన పాటలు, పద్యాలు, కీర్తనలు అజరామరాలు. కరణానికి నేను ఎంతో ఋణపడి ఉన్నాను.

దాదాపు అర్ధగంటకు పైగా వారితో ముఖాముఖి జరపడం ఒక మీడియా ప్రతినిధిగా నేను గర్వపడుతున్నాను.. ఈ ఇంటర్వ్యూ ఏ విధంగానూ సమగ్రం కాదు. ఇంకా ఒకటి రెండుసార్లు ఇయనతో కుర్చొని సమగ్రంగా చేద్దామనుకున్నాను. కాని విధి ఇలా ఉంది. కనీసం ఎలాంటి ప్రచారపటాటోపాలు లేకుండా చివరివరకూ ప్రజా ఉద్యమమే ఊపిరిగా బ్రతుకు వెళ్ళదీసిన నిజమైన ప్రజాకవి రుద్రజ్వాల..జీవితంలో వెలుగులుంటాయ్. వెన్నంటే చీకటీ ఉంటుంది.. కానీ తాను పడ్డ కష్టాలనన్నింటినీ చీకటిలో వదిలి.. ప్రజల వెలుగు కోసం పరితపించిన వెలుగు వెంకటసుబ్బారావు అక్షరాలు వెలుగుతూనే ఉంటాయి.. అందులో ఆయన తళతళలాడుతూనే ఉంటాడు నింగిలో నక్షత్రంలా..! ❊

**స్పందనను వ్రాయండి**

**'అమ్మనుడి'**లో రచనలపై
మీ స్పందనను వ్రాసి పంపండి!
-సంపాదకుడు

# 'నేను న్యాయవాదిని కాను'

-పెండ్యాల సత్యనారాయణ
చరవాణి: 9866442034

**'అమ్మనుడి'** అక్టోబర్ సంచికలో తెలుగు భాషకు ప్రాచీన హోదాపై మద్రాసు ఉన్నత న్యాయస్థానం వెలువరించిన తీర్పు అనువాదాన్ని ప్రచురించే క్రమంలో 'ప్రముఖ న్యాయవాది, రచయిత' అని నన్ను పరిచయం చేయటం జరిగింది. అందుకుగాను సంపాదకులు డాక్టర్ రమేష్‌బాబుగారికి నా ధన్యవాదాలు. నేను 'ప్రముఖ' అవునో కాదో నాకు తెలియదు కాని, నేను మాత్రం 'న్యాయ వాదిని' కాను. దాదాపు 30 సంవత్సరాలకు పైగా అడ్వొకేట్ వృత్తిలో ఉన్న నేను 'న్యాయాన్ని వాదించిన సందర్భాలు చాలా తక్కువ. చాలా సందర్భాలలో దొంగల తరపున వాదించి వారికి శిక్ష పడకుండా చేశాను. చెల్లని చెక్కులు ఇచ్చినవారి తరపున వాదించి వారికి శిక్ష పడకుండా చేశాను. అప్పు చేసినవారి తరపున వాదించి అప్పు ఎగ్గొట్టటంలో వారికి దోహదపడ్డాను. ఇవి కేవలం కొన్ని ఉదాహరణలు మాత్రమే. చెప్పుకోవాలంటే చాలా ఉన్నాయి.'న్యాయవాది' అంటే 'న్యాయాన్ని వాదించేవాడు' అని సాధారణంగా అర్థం చేసుకోబడుతున్నది. ఆ భావన తప్పు. ఇది వాస్తవం. ఒక వాస్తవాన్ని వాస్తవంగా అంగీకరించాలంటే ఎంతో ధైర్యం ఉండాలి. ఆ ధైర్యం తోనే ఈ విధంగా చెప్పగలుగుతున్నాను.

అడ్వొకేట్ అనే ఆంగ్ల పదానికి తెలుగు అనువాదంగా 'న్యాయవాది' అనే పదం స్థిరపడిపోయింది.అడ్వొకేట్ అంటే అడ్వొకేట్ చేసేవాడు, లేక వాదించేవాడు అని నిఘంటు పూర్వక అర్థం. అంటే తన క్లయింటు తరపున వాదించేవాడు, లేక అతని వాదాన్ని అడ్వొకేట్ చేసేవాడు (An advocate is one who advocates for his client) అని అర్థం. అంతే తప్ప అడ్వొకేట్ అంటే న్యాయవాది అన్న అనువాదం ఏ నిఘంటువులోనూ లేదు. తెలుగు భాషా కోవిదులూ, అనువాద పండితులూ ఆ విధంగా అనువదించినట్లు నాకు తెలియదు. నాకు తెలిసినంత వరకు ఎవరూ ఆ విధంగా అనువదించి ఉండరు. ఎందుకంటే ఏ కోణం నుండి చూసినా, అడ్వొకేట్ అనే పదానికి, న్యాయవాది అనే పదానికి లింకు లేక లంకె కుదరదు. అంటే అడ్వొకేట్ అనే పదానికి తెలుగులో పర్యాయ పదంగా 'న్యాయవాది' అని పేర్కొనటం అర్థం లేని, అసంబద్ధ, పూర్తిగా తప్పుడు అనువాదం. కానీ ఆ పదం ఆ విధంగా స్థిరపడిపోవటం దురదృష్టకరం. ఒక అడ్వొకేటుగా, క్లయింటు దగ్గర ఫీజు తీసుకున్నాను కాబట్టి, అతను చెప్పమన్నది కోర్టులో చెప్పటమే నేను చేశాను. ఆ క్రమంలో, నాకు చట్టం తెలుసు కనుక చట్ట పరమైన మెలకువలు క్లయింటుకు వివరిస్తాను. వృత్తి ధర్మంలో భాగంగా క్లయింటు దగ్గర ఫీజు తీసుకున్నాను కనుక, అతనికి న్యాయం చెయ్యాలి కనుక అతని తరఫున అన్యాయాన్ని కూడా న్యాయమని వాదించక తప్పదు. అంటే, నేను నా క్లయింటుకు న్యాయం చేస్తున్నానే తప్ప, న్యాయాన్ని వాదించటం లేదు. అందుకే, నేను అడ్వొకేట్‌నే తప్ప న్యాయవాదిని కాను అని ధైర్యంగా చెప్పగలుగుతున్నాను. ఉరి శిక్ష పడ్డ వ్యక్తిని ఉరితీయబోతూ, తలారి, "చట్టం ప్రకారం ఉద్యోగిగా నా వృత్తి ధర్మాన్ని నేను నిర్వర్తిస్తున్నానే తప్ప, నీపై నాకు ఎటువంటి కోపమూ లేదు" అంటాడు. నేనూ అంతే. అడ్వొకేట్‌గా నా పరిస్థితీ అంతే. నేనే కాదు, అడ్వొకేట్లు అందరి పరిస్థితీ ఇంతే.

హంతకులు, మానభంగాలు తదితర అకృత్యాలకు పాల్పడిన వ్యక్తులు, ఉగ్రవాదులు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా తదితర సంఘ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న కరుడు గట్టిన నేరస్తులు, బ్యాంకులకు టోపీ పెట్టేవారు, ఆదాయపు పన్ను ఎగ్గొట్టే వారు, తదితర వైట్ కాలర్ నేరస్తుల తరపున వకాల్తా పుచ్చుకుని, వారి తరపున న్యాయస్థానాల్లో వాదిస్తున్నవారే మున్సిఫ్ కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న అడ్వొకేట్ల నుండి, సుప్రీంకోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న అడ్వొకేట్ల వరకు అడ్వొకేట్లు అందరూ, ఈ విషయం మనందరికీ తెలిసినదే. వీరంతా న్యాయవాదులా, లేక తమ వృత్తి ధర్మాన్ని నిర్వర్తిస్తున్నవారా? నిజాయితీగా చెప్పాలంటే, వారంతా, తమ వృత్తి ధర్మాన్ని అనుసరించి, తమ క్లయింట్లవద్ద ఫీజు తీసుకుని, వారికి న్యాయం చేస్తున్నారే తప్ప, న్యాయవాదులు మాత్రం కాదు. కేవలం తమ క్లయింట్ వాదనను అడ్వొకేట్ చేస్తున్న అడ్వొకేట్లు మాత్రమే.

ఇదంతా ఎందుకు చెప్పాల్సి వస్తున్నదంటే, భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఏర్పడి అరవై సంవత్సరాలు దాటినా, తెలుగులో



స్పందన

# 'కవిరాజమార్గ' రచయిత అమోఘవర్షుడు

అక్టోబరు 2016 సంచిక 'అమ్మనుడి'లో తెలుగుభాషకు ప్రాచీనహోదా కల్పిస్తూ మద్రాసు హైకోర్టు 8-8-2016వ తేదీన వెలువరించిన తీర్పు పూర్తి పాఠాన్ని తెలుగులో ప్రచురించి పాఠకులకు అందించడం చాలా సంతోషంగా వుంది. గౌరవన్యాయమూర్తులు ఏయే అంశాలను ఏయే కోణాల్లో విశ్లేషించారో, అవన్నీ సాధారణ పాఠకులకు అర్థమయ్యేందుకు గాను, ఈ తీర్పు తెలుగు అనువాదం చక్కగా ఉపయోగపడుతుంది. ఈ ప్రయత్నంలో మీతో కలిసి పని చేసిన పెద్దలందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. ఇటువంటి మంచి ప్రయత్నాలు భవిష్యత్తులో కూడా కొనసాగాలని మనసారా కోరుకుంటున్నాను.

ఈ సందర్భంగా నాదొక చిన్న విన్నపము. ఏ కారణం వల్లనో గాని ఈ తీర్పు సందర్భంగా గౌరవ న్యాయమూర్తులు, కన్నడ గ్రంథం 'కవిరాజమార్గ' విషయంలో రచయిత పేరును తప్పుగా ప్రస్తావించారు. ఆ గ్రంథ రచయితగా 'శ్రీ విజయనృపతుంగ మహారాజు'ను పేర్కొన్నారు. కానీ వాస్తవంగా ఆ గ్రంథ రచయిత రాష్ట్రకూట చక్రవర్తి అయిన 'అమోఘవర్షుడు'. వీరు ఈ గ్రంథంతో పాటుగా 'రత్నమాలిక' అనే మరో గొప్ప గ్రంథం వ్రాసిన మహాకవి. ఏ విధంగానైనా, చారిత్రకమైన ఆ తీర్పులో దొర్లిన ఈ పొరపాటును సరిదిద్దేందుకు గాను పత్రిక తరపున మరియు వ్యక్తిగతంగాను సంపాదకులవారు గట్టిగా ప్రయత్నించవలసిందిగా సవినయంగా కోరుతున్నాను. కన్నడభాషకు ప్రాచీనహోదా కల్పించే ప్రక్రియలో ప్రధానపాత్ర పోషించిన ఆ గ్రంథ రచయితకు (ఆ గ్రంథ రచన ద్వారా) తీరని అపచారం చేసినట్లే కాగలదు- ఈ తప్పును సవరించే ప్రయత్నం చేయనట్లయితే.

**-యద్దనపూడి వెంకటరత్నం**, బండారుపల్లి,
గుంటూరుజిల్లా, 93478 55571

న్యాయ పద నిఘంటువును మనం తయారు చేసుకోలేకపోయాం. ఇది మన దౌర్భాగ్యం. 'న్యాయవాది' అనే పదంపై ఇంత వివాదానికి కారణం ఈ దౌర్భాగ్యమే. ప్రస్తుత న్యాయ భాష అంతా ఆంగ్లం మరియు ఉర్దూ పదజాలంతో కప్పబడి ఉన్నది. 'బార్' అనే పదం ఇందుకు మరో ఉదాహరణ. న్యాయశాస్త్రంలో పట్టా పొందిన అనంతరం 'అడ్వొకేట్'గా ప్రాక్టీస్ చేయాలంటే బార్ కౌన్సిల్‌లో నమోదు కావాలి. అడ్వొకేట్ అంటే న్యాయవాది కనుక 'అడ్వొకేట్స్ కౌన్సిల్' అని ఉండాలి. అలా కాకుండా బార్ కౌన్సిల్ అని ఎందుకు పిలుస్తున్నారు? కారణం తెలియదు. బార్ కౌన్సిల్ విషయంలో బార్ అంటే న్యాయవాది అని అర్థం చేసుకోబడుతున్నది. ఉదాహరణకు గుంటూరు న్యాయవాదుల సంఘం ఆంగ్ల నామధేయం 'గుంటూరు బార్ అసోసియేషన్'. విజయవాడ న్యాయవాదుల సంఘం ఆంగ్ల నామధేయం 'బెజవాడ బార్ అసోసియేషన్.'. బార్ అనే ఆంగ్ల పదానికి, న్యాయవాది అనే తెలుగు పదానికి ఎక్కడైనా లింకు, లంకె ఉన్నదా? అడ్వొకేట్ అనే పదానికి ఉన్న మరో రెండు పర్యాయ పదాలు 'ప్లీడర్', 'వకీల్'. తన క్లయింటు తరపున ప్లీడ్ చేసేవాడు ప్లీడర్. తన క్లయింటు తరపున వకాల్తా పుచ్చుకున్నవాడు వకీల్. వకీల్ అనేది అచ్చ ఉర్దూ పదం. వకాలత్ నుండి వకీల్ ఉద్భవించింది. ఒక కక్షిదారుడు, తన తరపున వాదించేందుకై ఇచ్చే ఆథరైజేషన్‌ను వకాలత్ అంటారు. వకాలత్ కలిగి ఉన్నవాడు వకీల్. వకీళ్ళు ఇప్పుడు లేరు. అంతా అడ్వొకేట్లే. అయినా వకాలత్ అనే పదం ఇప్పటికీ కొనసాగుతున్నది. ఇంతకన్నా బాధాకరమైన విషయం మరేమి ఉంటుంది. పిటిషనర్, రెస్పాండెంటు, ఛీఫ్ ఎగ్జామినేషన్, క్రాస్ ఎగ్జామినేషన్, క్లెయిం పిటిషన్, కేవియట్, రిట్ పిటిషన్, హెబియస్ కార్పస్, కో వారంటో, మాండమస్, సర్షియోరరి (వీటిలో కొన్ని లాటిన్ పదాలు), మొదలైన పరభాషా పదజాలమే న్యాయస్థానాలలో ఇప్పటికీ రాజ్యమేలుతున్నది. వీటికి సరైన తెలుగు పదాలను కనిపెట్టలేని దీనాతి దీనమైన స్థితిలో ఉన్న మనం, అడ్వొకేట్ అన్నా, బార్ అన్నా, న్యాయవాది అనే అసంబద్ధ అనువాదాన్ని కల్పించుకుని, అదే గొప్ప, సరైన అనువాదంగా భ్రమ పడుతున్నాం.

పదవిలోకి రావటం, ఆ పదవిని కాపాడుకోవటం, ఆ కాలంలో నాలుగు రాళ్ళు (కోట్లాది రూపాయలు) వెనకేసుకోవటమే పరమావిధిగా ఉన్న ప్రస్తుత రాజకీయ పార్టీలకు, రాజకీయ నాయకులకు, ప్రభుత్వాలకు తెలుగుభాషపై శ్రద్ధ ఉంటుందనుకుంటే పేరాశే. ఆ కృషి తెలుగు భాషాభిమానులు, స్వచ్ఛంద సంస్థలకే కొంత వరకైనా సాధ్యం. ఆ క్రమంలో ఇప్పుడు కాకపోతే రేపైనా న్యాయ స్థానాలలో కూడా తెలుగు భాష రాజ్యమేలుతుందని నా ఆశ. న్యాయ స్థానాలలో తెలుగు భాష దయనీయ స్థితిపై తెలుగు భాషాభిమానులతో ముచ్చటించాలని ఎప్పటినుంచో నాకున్న ఒక కోరిక. అమ్మనుడి సంపాదకుల ద్వారా నాకీ అవకాశం అనుకోకుండా లభించింది.

క్షమాపణ: అడ్వొకేట్ అనే పదానికి న్యాయవాది అనేది సరైన అనువాదం కాదని, తప్పుడు అనువాదమని డాక్టర్ రమేష్ బాబు గారికి తెలుసు. ఆ విషయమై మా ఉభయుల మధ్య చర్చ కూడా జరిగింది. అందుకే నేను అనువదించిన తీర్పులో కూడా అడ్వొకేట్ అనే పదాన్ని యధాతథంగా ఉంచాను. అందువలన నన్ను 'న్యాయవాది' అని పరిచయం చేయటం పూర్తిగా యాదృచ్ఛికము, కాకతాళీయము అని నాకు తెలుసు. ఈ చిన్న వివరణకు 'నేను న్యాయవాదిని కాను' అన్న పేరు బాగుంటుందని నాకు అనిపించింది. అందువలన అనివార్యంగా డాక్టర్ రమేష్‌బాబుగారి ప్రస్తావన తీసుకురావటం జరిగింది. పాఠకులు విషయాన్ని సద్భావనతో అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నాను. మనలో చాలా బలీయంగా పాతుకుపోయిన ఒక చిన్న అంశం, మనకు తెలియకుండానే మనపై ఎంతటి ప్రభావాన్ని చూపుతుందో తెలుసుకునేందుకు ఇది ఒక చిన్న ఉదాహరణ. ❋

# గిడుగు వేంకట రామమూర్తి రచనాసర్వస్వం రెండో సంపుటం-'సవర భాషాసంబంధి'



ప్రజలు మాట్లాడే భాషలను బట్టి, వారి సంస్కృతిని బట్టి భారతదేశంలోని జనులను నాలుగు జాతులుగా విభజించ వచ్చు. 1.నిషాద లేక ఆస్టిక్ (ఆస్ట్రో-ఆసియాటిక్) 2. కిరాట లేక సీనో - టిబెటన్ 3. ద్రావిడ 4. ఇండో-ఆర్యను కుటుంబాలు. వీనిలో ఆస్ట్రో - ఆసియాటిక్ కుటుంబం మనదేశంలో అతి ప్రాచీన మైనది. ముండా కుటుంబం ఈ మహాకుటుంబంలోని ఒక విభాగం. నేడు భారత దేశంలోని సంతాలి, సవర, ముండా మొదలైన వారు మాట్లాడే భాష ముండా కుటుంబానికి చెందినది. సంతాలి, సవర మొదలైన పేర్లు జాతి వాచకంగాను, భాషా వాచకంగాను ఉపయోగిస్తున్నాం. ఈ భాష లను మాట్లాడే ప్రజలే ఈ దేశం లోని ఆది వాసులు. ఋగ్వేదంలోని ఐతరేయ బ్రాహ్మ ణంలో ఆంధ్ర, పుండ్ర, శబర, పుళింద, మూతిబా మొదలైన అనార్య జాతుల ప్రస్తా వన వుంది. నాటి శబరులే నేటి సవరలు. సవరలు విజయనగరం, శ్రీకాకుళం జిల్లా లోని తూర్పు కనుమలలోను, ఒరిస్సాలోని కోరాపుట్, కలహండి, మయూర్‌భంజ్, బాలా సోర్, కటక్, గంజాం, గజపతి జిల్లాలలోను ఎక్కువగా కనిపిస్తున్నారు. వీరు ఆయా రాష్ట్రా లలోని కొండలలో నివసిస్తుంటారు. సవర భాష మాట్లాడేవారి సంఖ్య సుమారు 2,56,000.

సవరభాషలో లెక్కింపు విధానం ఒక ప్రత్యేకతను కలిగివుంది. సవరలు ఒకటినుండి పన్నెండు వరకు లెక్కిస్తారు. ఆపైన పన్నెండు ఒకటి, పన్నెండు రెండు, పన్నెండు మూడు అన్న విధంగా లెక్కిస్తారు. మనలాగ పద మూడు, పద్నాలుగు, పదిహేను అని లెక్కిం చరు. వారిది ద్వాదశ విధానం. ఇదే ప్రాచీన మైనదేమో! విషు చక్రంలో ద్వాదశ (పన్నెండు) రాసులు. సంవత్సరానికి పన్నెండు నెలలు. రోజులో పగలు పన్నెండు గంటలు, రాత్రి పన్నెండు గంటలు. అడుగుకు పన్నెండు అంగుళములు. సంవత్సరకాలంలో సూర్యుడు పన్నెండు రాశులు తిరిగి మళ్ళీ మొదటిరాశికే వస్తాడు. నేడు సవరలు తెలుగు అంకెలే వాడు తున్నారు. తెలుగు మాస్టరు గూడ ఎటెన్డెన్స్ పిలిచేటప్పుడు నెంబర్ వన్, నెంబర్ టూ అంటు న్నారు గదా. ఎక్కువమందికి సవర భాషలో లెక్కించడం రాదు.

**సవర సాహిత్యం**

రామమూర్తిగారి కంటే ముందు సవరభాష నేర్చుకొన్నవారు లేరు. రామ మూర్తిగారు సవరభాష నేర్చుకొంటున్నప్పుడే సవర కథలను సేకరించి రాసుకొన్నారు. సవర భాషకు సాంప్రదాయ లిపి లేదు. తెలుగు లిపినే రామమూర్తిగారు ఉపయో గించారు. రామమూర్తిగారు సవరలచేత పాటలు పాడించి రాసుకొన్నారు. ఎవరెవరి నుండి ఏయే పాటలు తాను సేకరించారో వివరించారు. తాను సేకరించిన ముప్ఫై పాటలతోపాటు రామమూర్తిగారు స్వయంగా రాసిన రెండు పాటలతో కలిపి సవర సాంగ్స్ సంకలనం ప్రచురించారు.

**సవర రీడర్లు**

తెలుగు లిపిని రాయడం చదవడం తెలిసిన సవరలు చదువుకోవడం కోసం రామమూర్తిగారు సవర రీడర్లు రాశారు. సవరభాషతో రచించిన పుస్తకాలను అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం 1912 - 14 మధ్య కాలంలో ప్రచురించింది. ఇవి సవర రీడర్ 1, 2, 3, 4 అనే నాలుగు భాగాలు సాంగ్స్ అనే పాటల పుస్తకం ఒకటి. (సవరభాషతో రచించిన సవర రీడర్1 ప్రస్తుతానికి అలభ్యం). వీటిని ఇప్పటి వరకు ఎవరూ పునర్ముద్రించలేదు. ఈ వ్యాసకర్త సంపాదక త్వంలో 2005 - 06 మధ్య వెలువడిన "సవర" మాసపత్రికలో కొన్ని సవర కథలు, పాటలు తెలుగు అనువాదంతో ప్రచురిం చారు. సవర రీడర్లకు రామమూర్తి గారే స్వయంగా అనువాదాలు చేశారు. అవి ట్రాన్సలేషన్ ఆఫ్ సవర రీడర్ 1, 2, 3, 4, అన్న పేర్లతో 1912 లోనే ప్రచురింప బడ్డాయి. (సవర సాంగ్స్ అనువాదం అలభ్యం.) వీటితోపాటు తెలుగు-సవర నిఘంటువు గూడ మద్రాసు ప్రభుత్వం ప్రచు రించింది. సవరభాషలో కొద్దిపాటి జ్ఞానం కలిగిన తెలుగువారు తెలుగు అనువాద పుస్తకాలు దగ్గర పెట్టుకొని సవర రీడర్లు చదివి అర్థం చేసుకొనే వీలుంది.

గిడుగు వెంకట రామమూర్తిగారి సవర భాషలోని రచనలను ఒక సమగ్రమైన సంపుటిగా అందించాలనే ఉద్దేశంతో వేదగిరి రాంబాబుగారు (వేదగిరి కమ్యూనికేషన్స్ హైదరాబాద్ వారు) "గిడుగు వేంకట రామమూర్తి రచనాసర్వస్వం సవరసంబంధి" సంపుటిని ప్రచురించారు. ఇందులో టాన్స లేషన్ ఆఫ్ సవర రీడర్ 1, 2, 3, 4, పుస్తకాలు, రామమూర్తిగారు సవర భాషలో రాసిన రెండు పాటలతో పాటు, వాటికి డా॥ అల్లంసెట్టి చంద్రశేఖర రావు చేసిన తెలుగు అనువాదం, రామమూర్తిగారు సేకరించిన కొన్ని సవర పాటలు, వాటి అనువాదం, తెలుగు సవర నిఘంటువు వున్నాయి. ఇవన్నీ తెలుగు లిపిలో ఉన్నాయి. ప్రపంచ భాషా శాస్త్రవేత్తల అవగాహనకోసం, బ్రిటిష్ ఉద్యో గులకోసం, కొండలలో సవరదేశ మందు పనిచేస్తున్న మిషనరీలకోసం, సవర మాన్యు యల్, ఇంగ్లీషు సవర డిక్షనరీ, సవర ఇంగ్లీషు డిక్షనరీ, అంతర్జాతీయ ధ్వనిలిపిలో రాశారు. మద్రాసు ప్రభుత్వం 1931, 1933, 1938 సంవత్సరాలలో వరుసగా ప్రచురించింది. ఈ పుస్తకాలు కొన్ని గ్రంథాల యాలలో మాత్రమే

శిధిలావస్థలో వున్నాయి. వీటిని యధా తథంగా వేదగిరి రాంబాబుగారు ప్రచురించిన గిడుగు రచనా సర్వస్వం రెండవ సంపుటంలో చూడవచ్చు.

మొదటి పుస్తకంలోని కథలన్నీ ఇంగ్లీషులో ఉన్న ఈజపు-కథలను పట్టి రామమూర్తిగారు సవరభాషలో రాసినవి. రెండవ పుస్తకాన్ని "కలక్షన్స్ ఫ్రమ్ సవర ఫోక్‌లోర్ అన్నారు. ఇందులో సవర వాళ్లు రామమూర్తి గారి ఎదుట చెప్పిన ఏడు కథలున్నాయి. ఇంచుమించు వారిమాటలలోనే కథలు రాశారు. మూడవ పుస్తకంలో పదహారు కథలున్నాయి.

మూడవ రీడరుకు ఒక ప్రత్యేకత వుంది. ఇందులోని కథలలో సవరల ఆచార వ్యవహారాలు, సంస్కృతికి సంబంధించిన విషయాలున్నాయి. కథలతోపాటు చారిత్రకాంశాలు గల కథనాలున్నాయి. "13వ 14వ కథలలో సవరప్రదేశములో జరిగిన పితూరీలు వర్ణించడమైనది. తాత్రాజు పితూరీ 1854-58 లోనున్ను, పుత్తాసింగ్ పితూరీ 1864 లో నున్ను జరిగినవి. తాత్రాజు పాలకొండ మన్యానికి చెందినవాడంటారు. ఈ విప్లవ వీరుణ్ణి శ్రీకాకుళంలో ఉరితీశారు.

సాహిత్యం సమాజాన్ని ప్రతిబింబిస్తుంది. నాలుగవ వాచకం సవర సమాజాన్ని మన కళ్లముందుంచుతుంది. ఈ వాచకములోని పాఠాలన్నీ సంభాషణ రూపంలో ఉన్నాయి. మొత్తం 30 సంభాషణలున్నాయి. "ఈ పాఠాలలో సవరవాళ్ల లోకవ్యవహారము గురించిన భోగట్టా చాలా ఉన్నది. ఇంటి వద్దను, పొలములోను, కొండమీదను, సంతలోను, మాటామంతీ ఆడుకోవడము, జగడమాడడము, నెమ్మదిగా పనీపాటూ చేసుకోవడము, కల్లు తాగడము, పూజలు చేయించడము, సోదె చూడడము, చేపలు పట్టడము, వేటాడడము,- ఈ విధముగా వాళ్ల బతుకు ఏలాగు ఉంటుందో కనపర్చడమయినది." అంటారు రామమూర్తిగారు నాలుగవ పుస్తకం "ఇంట్రడక్షన్"లో, ఈ నాలుగవ పుస్తకములో సవరలు వారి మాతృభాషలో కోర్టులో ఇచ్చిన వాఙ్మూలాలు గూడ ఉన్నాయి.

రామమూర్తిగారు సవర కథలను సవరలు మాట్లాడుకొనే భాషలోనే రాశారు. తాను వ్యావహారిక భాషలో రాయవలసిన అవసరం గురించి రామమూర్తిగారు "లోక వ్యవహారములో ఉన్నట్లే, సవర వాక్యాలు వ్రాయక తప్పదుగదా. వాళ్లభాషకు వాడుకే ప్రమాణము. శబ్దసిద్ధి లోకంబువలనం దెలియును" అన్నారు.

తెలుగు అనువాదముగూడ వాడుక భాషలోనే ఉంది. తాను వ్యావహారిక భాషలో రాయవలసిన అవసరం గురించి రామమూర్తి గారు ఇలా అన్నారు."ప్రజల వాడుకలో లేని మాటలు వేసి, ఆడంబరముగా వ్రాసి నా పాండిత్యము ప్రదర్శించుట వలన ఏమీ లాభము లేదు. నేను ఎవరికోసము ఈ పుస్తకములు వ్రాసినానో వారికి తెలియక నాశ్రమ అంతా ఎందుకూ పనికిరాకుండా పోతుంది."

**సవర సాంగ్స్**

32 పాటలు వున్న "సవర సాంగ్స్' పుస్తకంలో రామమూర్తిగారు 2 పాటలు సొంతంగా రాశారు. మిగిలినవి సేకరించినవి. వీటిలో 9 పిల్లలపాటలు, 7 పెళ్ళి పాటలు, 6 సరసపు పాటలు, 8 పూజ పాటలు (మంత్రాలు) వున్నాయి. రామమూర్తి గారు రాసిన పాటలలో ఒకటి సవరజానపద కథను ఆధారంగా చేసుకొని కూర్చిన 'ఎల్డాడుకిరీ బోయి' అన్న పెద్ద పాట. దీనిలో 345 పాదాలున్నాయి. నారింజ చెట్టును కాపలా కాస్తున్న ఒక పిల్లని ఒక మంత్రగత్తె ఆహారం కోసం తీసుకు పోతుంది. ఆ పిల్ల తన తెలివి తేటలతో తనకు బదులుగా ఆ మంత్రగత్తె పిల్లలను వారి తండ్రిచేతనే చంపించి తాను తప్పించుకొని, మంత్రగత్తె, దాని భర్త చచ్చేటట్లు చేస్తుంది. రామమూర్తిగారు రాసిన 'గూఅరానే బన్జి' అన్న రెండవ పాటలో 120 పాదాలున్నాయి. ఈ పాటలలో చెట్లు తమను నరకవద్దని మనిషిని ప్రాధేయ పడదామని తమలోతాము అనుకొంటాయి. పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకత గురించి ఆనాడే రామమూర్తిగారు ఒక హెచ్చరిక చేశారు.

**సోర (సవర) మాన్యుయల్**

సవరభాష నేర్చుకోవాలనుకొనే వారి కోసం రామమూర్తిగారు దీనిని రచించారు. ఇది ఇంగ్లీషుభాషలో వుంది. సవరభాష రాయడానికి అంర్జాతీయ ధ్వనిలిపి వాడారు. దీనిని మనవాళ్లు సవరవ్యాకరణం అంటున్నారు గాని 250 పేజీలున్న ఈ పుస్తకంలో వ్యాకరణభాగం 73 పేజీలు. మిగిలిన భాగంలో రీడింగ్ లెసన్సు వున్నాయి. ఇందులో వ్యవహారానికి పనికివచ్చే సంభాషణలు ఎక్కువగా ఉన్నాయి. కొన్ని సాటుల ఉన్నాయి. ఈనాడు ఆధునిక భాషాశాస్త్రవేత్తలు భాషా బోధనకుపయోగించే పద్ధతులను ఆనాడే రామమూర్తిగారు సవర మాన్యుయల్లో చూపించారు.

**నిఘంటువులు**

నిఘంటువులలో చెట్ల పేర్లకు అర్థాలు ఒక వృక్షవిశేషము అనకుండా బొటానికల్ నేమ్స్‌లో చెప్పడం విశేషం. నిఘంటువులలో సాధారణంగా కనిపించనివి బూతిమాటలు (ఫోర్ లెటర్ వర్డ్స్)). ఈ మాటలు భాషా వ్యవహర్తలు రహస్యంగా తమలో తాము మాట్లాడుకొంటారు. నిఘంటు రచయితకు ఇటువంటి పదాలు సేకరించడం చాలా కష్టం. వాటి అర్థాలు యధాతథంగా రాయడం అంతకంటే కష్టం. రామమూర్తిగారి నిఘంటువులలో ఇవి ఉన్నాయి. అంతేకాదు బూతి తిట్లు గూడా ఉన్నాయి. దీనినిబట్టి అతని కృషిని అంచనా వేసుకోవచ్చు.

సవర ఇంగ్లీషు నిఘంటువు, సోర (సవర) మాన్యుయల్ లకు రామమూర్తిగారు ముందుమాటలు (Author's Preface) రాశారు. వారు రాసిన ముందుమాటలలో చాలా విలువైన సమాచారం వుంది. అందులో సవరభాష గురించి, సంప్రదాయకంగా లిపిలేని భాషలను రాయడానికి వాడుకోవలసిన లిపి గురించి రామమూర్తిగారు చాలా వివరంగా రాశారు. సవరభాషకు సంబంధించిన రామమూర్తిగారి రచనలు అందుబాటులో లేనికారణంగా (Author's Preface) ని "ముందుమాటలు" అన్న పేరుతో కణుగుల వెంకటరావుగారు అనువదించారు. ఆదర్శ కళామందిరం, పొందూరు వారు ఈ అనువాదాన్ని 2008 లో ప్రచురించారు. ఈ అనువాదాన్ని గూడ గిడుగు రచనా సర్వస్వం రెండవ సంపుటంలో చూడవచ్చు.

సవర ఇంగ్లీషు నిఘంటువు ఒక వ్యుత్పత్తి కోశం. అందులో వారు సోదర ముండాభాషలనుండి ధాతురూపాలు చూపించారు. "ముండాభాషలోని ప్రాచీన సంఖ్యా రూపాలు నేడు వినరావడం లేదు. వంద సంవత్సరాల క్రితం జువాజ్ అంకెలను వ్రాసుకొన్న కేంప్ బెల్ గారు కూడా 1 నుండి 3 వరకే రాశారు. అదృష్టం కొద్దీ గిడుగు రామ



# విశిష్ట భాషా సాహితీమూర్తి శ్రీ కోరాడ మహాదేవశాస్త్రిగారు

**భా**షా శాస్త్రవేత్త, బహుభాషా పండితుడు, బహుముఖీన ప్రతిభాపాటవాలు కల విశిష్ట భాషా సాహితీ మూర్తి శ్రీ కోరాడ మహాదేవ శాస్త్రిగారు ఈ విజయదశమి నాడు పరమపదించడం తెలుగు భాషాసాహిత్యాలకు తీరని లోటు. 1921లో జన్మించి 95 సంవత్సరాలు జీవించి నూరేళ్ళు పూర్తిచేసుకుంటారనుకున్న దశలో హఠాత్తుగా వీరు స్వర్గస్తులు కావడం విచారకరం.

ఎస్కేయూ పీజీ కళాశాలలో తెలుగు ప్రొఫెసర్‌గా మొదటి తెలుగు విభాగాధిపతిగా, తొలి ప్రిన్సిపల్‌గా పని చేసి ఎనలేని సేవలందించిన శాస్త్రి గారు సంస్కృతం, తెలుగు, ఆంగ్లం మొదలైన భాషల్లో గొప్ప పండితులు. కోరాడ ఇంటిపేరు మొక్కవోని సాహిత్యసేవాదీక్షకు పెట్టింది పేరు. వీరి వంశమే పండిత వంశం. నాలుగు వందల సంవత్సరాలుపైగా సాహిత్యసేవలో తరించారు. ప్రఖ్యాత తెలుగు పరిశోధకులు కోరాడ రాధాకృష్ణయ్య గారి కుమారులు వీరు.

మహాదేవ శాస్త్రి ఎం.ఏ. ఆర్థశాస్త్రం పట్టభద్రులై కొన్ని సంవత్సరాలు ఆర్థిక శాస్త్రవేత్తగా ఉంటూ కలకత్తాలో ఎం.ఏ. కంపారటివ్ ఫైలాలజి పూర్తి చేసి తరువాత 'హిస్టారికల్ గ్రామర్ ఆఫ్ తెలుగు' అనే పరిశోధన గావించారు. ఈ గ్రంథానికి గాను డి.లిట్ పట్టం పొందారు. తెలుగులో ధ్వని- వర్ణం, సంధి, పదజాలం ఇత్యాది ప్రాతిపదికల ఆధారంగా సాగిన చారిత్రక వ్యాకరణ పరిశోధన ఇది నాటికీ నేటికీ.

ఇంగ్లీషు ద్వారా తెలుగు నేర్చుకోవడానికి అనువుగా A Grammar and handbook of Modern Telugu రచించారు. ఇది తెలుగు భాషకు వెలసిన అపర కాతంత్రవ్యాకరణం అని చెప్పవచ్చు.

'ఆంధ్ర వాఙ్మయ పరిచయము' -తెలుగు సాహిత్యం పట్ల అభినివేశం, ఆసక్తి కలిగించే ఒక చక్కని ప్రణాళికతో రచించిన గ్రంథం. "వ్యాకరణ దీపిక, వ్యాకరణ పారిభాషిక పదకోశం, అలాగే 'తెలుగుదేశ్యవ్యుత్పత్తి నిఘంటువు', ద్రావిడభాషల పదాల చారిత్రక మూలాలను అన్వేషించడానికి ఉపకరించే అద్భుతమైన నిఘంటువు. ఇది తెలుగు భాషకు మరో డియిడి.

నన్నెచోడుని కుమార సంభవము' 'భాష-సంస్కృతి' అనే గ్రంథాలు వీరి సాహిత్య భాషా సామాజిక శాస్త్రాల లోతైన అవగాహన మదింపుకు ఆనవాళ్ళు.

వేటూరి ప్రభాకరశాస్త్రి గారు చెప్పిన మొట్టమొదటి తెలుగు పదం 'నాగబు' ను ఆ తరువాత కాలంలో 'నాగబుద్ధి అనే పేరులో చివరి అక్షరం విరిగి పోగా మిగిలిందేనని కొందరు పండితులు అభిప్రాయపడ్డారు. కోరాడ మహదేవశాస్త్రి ఈ పదాన్ని విశ్లేషిస్తూ, శాతవాహనుల కాలం నాటి తెలుగులో "నాగ0బు" అనే పదం మధ్య సున్నా లోపి0చి 'నాగబు'గా మారి ఉండవచ్చునన్నారు. దీనిని ఆధారంగా తీసుకొని ఐరావతం మహదేవన్ అనే తమిళ చరిత్ర పరిశోధకుడు సింధు నాగరికత లిపిలో కొన్ని పదాలకు చివర బాణం గుర్తుకు '0బు' సంకేతంగా ఈ అంబు(బాణం) గుర్తుని ప్రయోగించి ఉంటారని ఒక ఊహను అందించారు. ఇది ఒక మచ్చు తునకమాత్రమే.

మహదేవశాస్త్రిగారు అంతర్జాతీయ ద్రవిడ భాషాసంఘం సంస్థాపకుల్లో ఒకరు. 'ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ ద్రవిడియన్ లింగ్విస్టిక్స్' సంస్థకు గౌరవ అధ్యక్షులుగా ఉన్నారు.

**-డా॥ అద్దంకి శ్రీనివాస్**
98488 81838

---

మూర్తిగారు గుటో మొదలైన ముండా భాషల అంకెలను 10 వరకు లిఖించి వుంచడంచేత ఈనాడు ఎక్కడా లభించని సమాచారం సవర ఇంగ్లీషు నిఘంటువులో లభిస్తుంది" అంటూ ముండా సంఖ్యలపై పరిశోధనచేసిన ఎన్. హెచ్. జైడ్ 1978లో స్టడీస్ ఇన్ ద ముండా న్యూమరల్స్ అన్న గ్రంథంలో రాశారు.

గిడుగు రచనా సర్వస్వం రెండో సంపుటంలో రామమూర్తిగారు అనువాదం చేసిన సవర పాటలు తప్ప మిగిలిన అన్ని రచనలు వున్నాయి. కనుమరుగైపోయిన గిడుగు వెంకట రామమూర్తిగారి సవర రచనలను చూడగలిగే అదృష్టం ఇన్నాళ్ళకు కలిగింది. మనం ధన్యులం.

ఈ సంపుటాన్ని ప్రచురించిన శ్రీ వేదగిరి కమ్యూనికేషన్స్ వారికీ, సంపాదకత్వం వహించిన పోరంకి దక్షిణామూర్తి, అల్లంశెట్టి చంద్రశేఖరరావు, వేదగిరి రాంబాబు, విహారి (జె.యస్.మూర్తి), గిడుగు వేంకటరామకృష్ణారావు, గిడుగు వేంకట నాగేశ్వరరావులకు అభినందనలు.

గిడుగు వేంకట రామమూర్తి రచనాసర్వస్వం
రెండో సంపుటం-'సవర భాషాసంబంధి'
ప్రతులకు: శ్రీ వేదగిరి కమ్యూనికేషన్స్, హెచ్.ఐ.జి. 1, ఫ్లాట్ 10, బాగ్ లింగంపల్లి, హైదరాబాదు- 500044.
పుటలు:1160, ధర రు.60లు.

**-డా॥ అల్లంసెట్టి చంద్రశేఖరరావు**
99496 05141
email: savaralanguage@gmail.com

కవిత

## అది ముగింపు లేని పాట

అడవి పూగుతోంది
పక్షులు ఆకాశం వేపు గుంపులుగా ఎగిరాయి
సూర్యుడు ఇంకా ఉదయించలేదు
నక్షత్రాలు కన్నీళ్ళు పెట్టాయి
నెత్తటితో నేల తడిసింది
మరణం ఏదైనా ఒక రణమే
రణమేదైనా మానవ హననమే
ఖలీల్ జిబ్రాన్ ప్రేమ గురించి చెబుతున్నాడు
ఒకసారి ప్రేమ వెన్నెల వెలుగు అంటున్నాడు
ఒకసారి ప్రేమ అగాధమంటున్నాడు
ప్రేమంటే వైయక్తికం అని ఎందుకనుకోవాలి
ఐన్‌స్టీన్ భౌతిక శాస్త్రాన్ని ప్రేమించలేదా!
వర్డ్స్‌వర్త్ ప్రకృతిని ప్రేమించలేదా!
బుద్ధుడు దు:ఖాన్ని ప్రేమించలేదా!
అంబేడ్కర్ సమానతను ప్రేమించలేదా!
అవును! ప్రేమ విశ్వజనీనమైందే!
అణువును కనుగొన్న ఐన్‌స్టీనే
శాంతి కావాలని అమెరికా వీధుల్లో ర్యాలీలు చేశాడు
బెర్ట్రాండ్ రస్సెల్‌తో కలసి ఆకుపచ్చని సంతకం చేశాడు
అడవి సృష్టిస్తున్న కొత్త చిగురుల గురించి వీరికి తెలుసా!
మనస్సును, మేధస్సును
సమన్వయించడమే వ్యక్తిత్వ స్ఫూర్తి
మేధావులు ఆలోచిస్తున్నారు
వారి ఆలోచనల్లో కడలి తరంగాల సవ్వడులున్నాయి
సమాజాన్ని మార్చే సూక్తులున్నాయి
మనిషిని నిర్మించే పరికరాలున్నాయి
ద్వేషరహితమైన మాట వెన్నెల బాట
స్వీయగమనం ఏదైనా కొండల అంచుల దాకే!
ఆశయం బలంగా ఉంటే
ఆకాశం ఎంతో దూరం ఉండదు కదూ!
నిజమే! ఆ అడవి నెత్తురోడింది
కొందరు బాధపడ్డారు, కొందరు నిశ్చేష్టులయ్యారు
ఆ కొండల్లో కోనల్లో పక్షులన్నీ కన్నీళ్ళు కార్చాయి
మాతో జీవించిన వాళ్ళెవరో లేరనే బాధ...
నిజమే! మనిషే కాదు, పక్షులూ ప్రేమమూర్తులే!
వేటకు వచ్చినవాణ్ణి జాలిగా చూసే స్వభావం వాటిది
మళ్ళీ ఆ పక్షులు ప్రేమగీతం ఆలపిస్తున్నాయి
విశ్వజనీనమైనదేదైనా ప్రేమ గీతమే!
అనేక ఘర్షణల నుండి అనేక వైరుధ్యాల నుండి
మళ్ళీ మళ్ళీ అడవి పూస్తూనే ఉంది
మళ్ళీ మళ్ళీ ఆ గీతం మ్రోగుతూనే ఉంది
అది ముగింపు లేని పాట..!

**- డాక్టర్ కత్తి పద్మారావు,** 9849741695.

పుస్తక సమీక్ష




## 'పొలి' దీర్ఘకావ్యానికి ఆంగ్లానువాదం :'ది హార్వెస్ట్'

(సేద్యంపై ఆచార్య రాచపాళెం చంద్ర శేఖరరెడ్డి దీర్ఘకావ్యం '**పొలి**'కి ఆంగ్లానువాదం)

ప్రముఖ మార్క్సిస్టు సాహితీ విమర్శకులు, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార విజేత శ్రీరాచపాళెం చంద్రశేఖరరెడ్డి గారిలోని కవికోణాన్ని ఆవిష్కరించిన దీర్ఘకావ్యం 'పొలి'. సీమరైతు సేద్యంపై దృశ్యకావ్యంగా, స్వానుభవ పూర్వకంగా ఒక స్మృతి కావ్యంగా, ఒక వ్యవసాయ 'ఎలిజీ' అని ప్రశంసలు పొందిన ఈకావ్యాన్ని డా॥ పి.రమేష్ నారాయణ 'ది హార్వెస్ట్' అనేపేరుతో ఆంగ్లానువాదం చేసారు.

ప్రపంచీకరణ ప్రభావంతో వ్యవసాయం అనేక తాకిళ్లకు గురికావటం, ఈ రంగాన్ని నిర్లక్ష్యం చేసే రాజకీయాలు దేశానికి ప్రమాదం అని చెప్పటం కవి ఉద్దేశ్యం. 22 శీర్షికలతో 2006 సం॥లో ప్రచురింపబడిన 'పొలి' కావ్యంలో చిత్తూరు జిల్లా మాండలికం, వ్యవసాయ సంబంధిత పదజాలం, వ్యవసాయంలోని భిన్నదశలు, ప్రక్రియలు హృద్యంగా వివరించబడ్డాయి.

ఇంతగా ప్రశస్తిచెందిన 'పొలి' కావ్యాన్ని డా॥ పి.రమేష్ నారాయణ ఆంగ్లంలోకి అనువాదం చేస్తే జాతీయంగాను, అంతర్జాతీయంగాను పాఠకులు ఆనందిస్తారనే సంకల్పంతో, ఇప్పటికే ఆరు తెలుగు గ్రంథాలను ఆంగ్లంలోకి అనువదించిన అనుభవం ఉండటంతో, 'ది హార్వెస్ట్' గా ఆంగ్లీకరించారు.

మూలరచన ఎడమవైపు, ఆంగ్లానువాదం కుడివైపు సమాంతరంగా పేజీలలో చూసుకుని చదివేవీలుగా ముద్రించారు. భాషేతరులు అర్థం చేసుకోవటానికి 50కి పైగా పదసూచికలను ఆంగ్లంలోను తెలుగులోను చివరిపేజీలలో ఇవ్వటం వలన పాఠకులకు అనుకూలంగా ఉంటుంది.

మూలరచయిత భావాలను ఆంగ్లంలోకి స్పష్టంగా బదిలీ చేసేందుకు, మూలంలోని సారాన్ని ప్రతిబింబింప చేయటానికి అనువాదకుడు విశేషకృషి చేయటం అభినందనీయం. అయితే ఆంగ్ల సమానార్థకాలు యిచ్చి కూడా, పక్కపక్కనే తెలుగుపదాల్ని యిటాలిక్స్‌లో ఇవ్వటం భాషేతరులకు కొంత అసౌకర్యం కలుగచేస్తుంది. ఉదా॥ plough అన్న పదం తర్వాత naagali అని weed removal పక్కన Kalupu Tiyyadam; the young sprouts పక్కన naatlu అని చెప్పటం అనవసరం. ఇది మినహా, 'ది హార్వెస్ట్' చదవతగిన పుస్తకం. ది హార్వెస్ట్ (An English Version of Dr.Rachapalem's 'Poli') డా॥ పి.రమేష్ నారాయణ- 94413 83888, పేజీలు : 121 వెల రూ.90/-, ప్రతులకు డా॥ రాచపాళెం చంద్రశేఖరరెడ్డి -94402 22117, అనంతపురం (ఆం.ప్ర.)

**-ఎమ్.వి. శాస్త్రి** - 94413 42999

# 'తెనుగులెంక'సూక్తులు-16



*ఉన్నవారు తెల్వి యున్న వారై సక*
*లోదయమ్ము దెసకు నొగ్గరేని*
*లేనివారు తాల్మిలేని వారై విజృం*
*భింపగలరు కట్లు త్రెంపగలరు*

'తెనుగులెంక' 'అభినవ తిక్కన'
**తుమ్మల సీతారామమూర్తి**

**'దే**శమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్' అన్నాడు మహాకవి గురజాడ. మనదేశంలో ఉన్న భారతీయులందరూ ఒకే విధంగా ఉన్నారా? అందరూ పీల్చే గాలి ఒక్కటే- అందరూ త్రాగే నీరు ఒక్కటే. అందరి గుండెలు లబ్, డబ్ అనే కొట్టుకుంటాయి. అందరి శరీర భాగాలు, అందరిలో ప్రవహించే రక్తం ఒకే విధంగా ఉంటాయి. అన్ని విషయాల్లోను పోలిక ఉన్న మనుషులు ఆర్థిక విషయాల్లో మాత్రం సమానంగా ఉండరు. సంపద ప్రాతిపదికగా మనుషులను మూడువిధాలుగా విభజించవచ్చు. మొదటి వారు కుబేరులు. వీరివద్ద సంపద కోటానుకోట్లు మూలుగుతూ ఉంటుంది. ఆ సంపదే పిల్లలను పెడుతుంది. కోట్లు మిలియన్లుగా, బిలియన్లుగా మారుతూ ఉంటాయి. విలాసవంతమైన బంగాళాలు, సుఖకరమైన వాహనాలు వారి సొంతం. వీరు 'కో' అంటే కోటి రకాల సౌఖ్యాలు వీరి ముంగిట వాలుతాయి. వీరు వ్యాపారాలు చేస్తారు. రాజకీయ పదవులను కొనుక్కొంటారు. సమాజ సంపదను దోచుకుంటారు. ఇంకా, ఇంకా పెరిగిపోతారు. వీరికి అజీర్తి తప్ప ఆకలి తెలియదు. ఏసి గదులు తప్ప ఎండపోకడ తెలియదు. వీళ్ళ దృష్టిలో మిగిలిన మనుషులందరూ చీమల్లాంటివారు, అసమర్థులు, వీరికి దోచుకోవడం, దాచుకోవడం తప్ప సాటి మనుషుల పట్ల సానుభూతి చూపడం తెలియదు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం తెలియదు.

రెండవ తరగతికి చెందినవారు మధ్య తరగతికి చెందిన సామాన్యులు. వీరు సుఖంగా బ్రతకాలనుకుంటారు. కాని, సుఖాలు పొందలేరు. డబ్బు సంపాదించాలనే యావ ఉంటుంది. కాని సంపాదించలేరు. తమకంటె సంపన్నులైన వారిని చూచి ఈర్ష్య పడుతూ, తమ కంటె తక్కువ స్థాయిలో ఉన్నవారితో పోల్చుకొని తృప్తిపడుతూ బ్రతుకుతుంటారు. వీరికి కనీస జీవన అవసరాలకు లోపం ఉండదు. పై తరగతికి ఎదగలేక, క్రిందిస్థాయికి దిగజారలేక ధర్మాలు పలుకుతూ, నీతులు వల్లిస్తూ త్రిశంకు స్వర్గంలో వేలాడుతుంటారు.

మూడవ తరగతి వారు లేనివారు. వీరికి ప్రతిరోజు గండమే. తినడానికి తిండి, త్రాగడానికి మంచినీరు, కట్టుకోడానికి మంచి బట్టలు, ఉండడానికి ఇల్లు- అన్నింటికి వెదుకులాటే. ఒకపూట తింటే ఒకపూట పస్తులుంటారు. చిరిగిన బట్టలు, అరిగిన చెప్పులు, నీరసించిన బ్రతుకులు వీరి ఆనవాళ్ళు. దేశజనాభాలో వీరే ఎక్కువమంది. బ్రతకలేక సగం చచ్చిన శవాల్లా వీరు ప్రతివీధిలో తారసపడతారు. వీరు కులాతీతులు, మతాతీతులు. అన్ని కులాల్లో, అన్ని మతాల్లో ఉంటారు.

సమాజం సక్రమంగా మనుగడ సాగించాలంటే అంతరాలు అంతరించాలి. తేడాలు తగ్గిపోవాలి. మనుషులందరూ ప్రకృతి సంపదను సమానంగా పంచుకోవాలి. ఈ సమతౌల్యం దెబ్బతింటే మానవ మనుగడ ప్రమాదాలకు నిలయమవుతుంది. కట్టుబాట్లు తెగిపోతాయి. ఓర్పు నశిస్తుంది. తిరుగుబాట్లు జరుగుతాయి. ఈ తిరుగుబాటు ఆగిపోవాలంటే అంతరాలు పెరగకుండా చూచుకోవలసిన బాధ్యత సంపన్న కుబేరులదే.

అందుకే తుమ్మల "ధనవంతులు తెలివి గలిగి మసలుకుంటూ, ప్రజలందరూ అభివృద్ధి పొందే విధంగా చేయాలి. అలా జరుగకపోతే లేనివారు ఓర్పు కోల్పోతారు. విజృంభిస్తారు. కట్టు త్రెంచుకొని ఉన్నవారిని దోచుకుంటారు. సమ సమాజాన్ని నెలకొల్పుతారు" అన్నారు.

**-డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ,**
98497 99711

## తెలుగు చిత్ర పరిశ్రమలోని వారికి తెలుగులో సరిగా పేర్లు పెట్టటం కూడా రాదా?

ఇటీవల టీవీల్లో, పత్రికల్లో తెలుగుభాషను న్యూనపరిచే విధంగా సినిమా ప్రకటనలు వస్తున్నాయి. సరైన పేర్లు కూడా వీరికి దొరకటం లేదనుకుంటాను. ఒకసారి 'బ్లేడ్‌బాబ్జీ' అనే సినిమా వచ్చింది. 'వీడు గోల్డ్ యెహే' మరొక సినిమా పేరు. ప్రస్తుతం ప్రదర్శిస్తున్న 'నాగభరణం' పేరు అసంబద్ధమని పదో తరగతి పిల్లలకు కూడా తెలుసు. 'నాగాభరణం' అని వుండాలి. అంటే నాగ+ఆభరణం. ఆభరణం అంటే నగ. 'నాగభరణం' అనే పేరులో అర్థం లేదు. భరణం అంటే మనోవర్తి అని అర్థం. సినిమాకు ఆ పేరు ఎందుకు పెట్టారో దర్శకుడు, రచయిత వెల్లడించాలి. సీనియర్ దర్శకుడు కోడి రామకృష్ణ ఏ ఉద్దేశ్యంతో ఈ పేరు పెట్టారో తెలియదు. అసంబద్ధమైన పేర్లతో తెలుగుభాషను కించపరచవద్దని చిత్ర పరిశ్రమలోని వారికి విజ్ఞప్తి చేస్తున్నాను.

**-డా॥పి.దక్షిణామూర్తి,** తెనాలి

### తప్పులు-సవరణలు

అక్టోబరు 2016 'అమ్మనుడి'లో తప్పులు దొర్లాయి.

1. విషయసూచిక (పుట 3)లో 'ఓ సంచారి అంతరంగం' (బయటి తెలుగు కతల మాలిక-5) ప్రస్తావనే లేదు. ఆ సంచికలోనే 26వ పుట నుండి అది ప్రచురింపబడింది.
2. ఇదే పుటలో సుబ్రహ్మణ్యభారతి గారి ఫోటోతో ఇచ్చిన సమాచారాన్ని సేకరించి పంపినవారు శ్రీ రావినూతల శ్రీరాములు గారు. వారి ఫోన్ 8885653924. 9-6-1917లో 'శక్తిదాసన' అనే తమిళ పత్రికలో ప్రచురితమైన ఈ వ్యాసభాగాన్ని వ్రాసినవారు కీ.శే. సుబ్రహ్మణ్యభారతి కాగా కీ.శే.చల్లా రాధాకృష్ణశర్మ దీనిని తెలుగులోకి అనువదించారు.
3. పుట 6లో తెలుగుజాతి ట్రస్టు దాత శ్రీ చలంచర్ల భాస్కరరెడ్డిగారి ఫోన్ నెంబరు తప్పుగా పడింది.

వారి ఫోన్ నెంబరు 9247007878.

మరికొన్ని అచ్చుతప్పులు కూడా ఉన్నాయి. చదువరులు మన్నించ గోరుతున్నాము.

-సంపాదకుడు.

పుస్తక సమీక్ష

# కథానికతో ఓ సాయంత్రం

**చా**లామంది రచయితలు, రచయిత్రులు ఒకచోట చేరి కథానిక పండుగను చేసుకోవడం ఎంత ఘనం! అలాంటి ఘనమైన కార్యక్రమం మొన్న అక్టోబర్ 14న హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కన్నుల పండుగగా, వీనుల విందుగా జరిగింది.

ఏటా అక్టోబరు 14 నాడు హైద్రాబాద్‌లో 'కథానికతో ఓ సాయంత్రం' కార్యక్రమం జరుగుతూ ఉంది. ఈ కార్యక్రమంలో రచయితలూ, రచయిత్రులూ కలసి కథానిక తీరు తెన్నుల్ని చర్చించు కోవడంతో పాటు సీనియర్ కథానిక రచయితల్ని సత్కరించుకోవడం, కథానిక సంపుటాల్నీ, సంకలనాల్ని ఆవిష్కరించుకొన్నారు.

ముందుగా జరిగిన కథానిక సదస్సుకు సూత్రధారిగా ప్రముఖ రచయిత, కవి, విమర్శకులు శ్రీ విహారి వ్యవహరించారు. ఆయన కథానిక గురించి కొన్ని ప్రశ్నలను సంధిస్తుంటే సభలో ఉన్న రచయితలు, రచయిత్రులు సమాధానాలిస్తూ కార్యక్రమం కొనసాగింది. ఆ కార్యక్రమంలో శ్రీపతి, బి.ఎస్.రాములు, పులిగడ్డ విశ్వనాధరావు, వి. సూర్యప్రకాశరావు కె.బి.గోపాలం పాలగిరి విశ్వప్రసాద్, కె.బి.లక్ష్మి, కన్నెగంటి అనసూయ, చెన్నూరి సుదర్శన్, సింహప్రసాద్, వాణిశ్రీ, కొత్తపల్లి ఉదయబాబు, యన్.కె. నాగేశ్వరరావు, కాందూరి సీతారామచంద్రమూర్తి, పొత్తూరి విజయ లక్ష్మి మొదలైన వారు కథానిక పట్ల తమకున్న అభిప్రాయాన్ని వెల్లడించారు.

అందరూ కథానిక చాలా శక్తివంతమైన ప్రక్రియ అని, చెప్పేది తక్కువ, ఆలోచింపజేసేది యెక్కువ అనీ, సమాజశ్రేయస్సే దాని ఆశయమని, క్లుప్తతవల్ల ఈ వేగయుగంలో చదవడానికి అది అనువైన ప్రక్రియ అని, జనం మాట్లాడే భాషలో సాగడంతో ఎవరైనా చదువుకోవచ్చనీ కళాత్మకంగా చెప్పినప్పుడే అది పాఠకుల మనస్సుల్లో ముద్రించుకుంటుందనీ రకరకాల అభిప్రాయాలను వెలిబుచ్చారు. సమాజానికి అద్దం పట్టడం, విశ్లేషించడంతోపాటు మనస్సుకి ఆహ్లాదాన్ని కలిగించే కథలు రావడం అవసరమని కొందరు అభిప్రాయపడ్డారు. ఇలా రకరకాల కథానికా చర్చలతో కార్యక్రమంలో ప్రథమ భాగం ముగిసింది.

రెండవభాగంలో ఏకంగా అయిదు గ్రంథాల ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ రచయిత, కథానిక, స్వరూప స్వభావాల పరిశోధకుడు, నిఘంటు నిర్మాత డా॥పోరంకి దక్షణామూర్తి ఆధ్యక్షత వహించారు. అంతకుముందుగా గురజాడ వారి దేశభక్తి గేయాన్ని ఇతరభాషలలోకి అనువదించిన డా॥అనురాధ, డా॥సయ్యద్ రహమ్‌తుల్లాలను వేదికపైకి ఆహ్వానించి ముఖ్య అతిధులద్వారా నగదు మరియు శాలువాలతో సత్కరించారు.

ముఖ్యఅతిధులుగా తెలంగాణా రాష్ట్రప్రభుత్వ సలహాదారులు డా॥ కె.వి.రమణ, ఆంధ్రప్రదేశ పోలీస్ హౌసింగ్ చైర్మన్ శ్రీ రావులపాటి సీతారామారావుగారు పాల్గొన్నారు. వీరిద్దరూ సాహితీవేత్తలు కావడం విశేషం. డా॥ కె.వి.రమణ ఎన్నో సాహిత్య ప్రసంగాలు చేయడమే కాకుండా, చక్కటి చిక్కటి ఆధ్యాత్మిక అంశాలమీద రచనలు



సాగించారు. రావులపాటి సీతారామారావుగారు మంచి రచయిత, ఎన్నో గొప్ప కథానికల్నీ, నవలల్నీ రాశారు.

కథానిక గురించి –తొలిదశలో దానికొకస్థాయిని కల్పించిన రచయితల గురించిన ఈ వ్యాసాల సంపుటి సాహిత్యాభిమాను లందరికీ చక్కటి విందు.

ఇలా కథానిక చర్చలూ, కథానిక గ్రంథాల ఆవిష్కరణలతో సాగిన ఈ 'కథానికతో ఓ సాయంత్రం' కార్యక్రమంలో పెద్ద ఎత్తున రచయితలూ, రచయిత్రులూ పాల్గొని సాహిత్య మథనం చేశారు.

కవిత

## స్వస్థత

–ఎస్.కాశింబి,
90522 16044

మమత లొలికించు మల్లెలను
గౌరవ సూచికలైన గులాబీలను
సుకుమార భావనల సన్నజాజులను
బంధాల నల్లే బంతి చేమంతులను
గని.... పరవశించా నానాడు!

ఆప్యాయతానురాగాల అరటిపళ్ళను
మేటి విలువల మామిళ్ళను
సహనం చాటే సీతా ఫలాలను
జనమందరికీ అందే జామలను
తిని....తృప్తి చెందా నలనాడు!

దుర్మార్గపు టాలోచనల దుర్గంధాన
పెరిగే పాపపు పూడికన
మాత్సర్యం పొంగే మురుగున
మోసపు మలినాల ఊబిన
చిక్కి.....ఉక్కిరి బిక్కిరి అవుతున్నానీ నాడు!

క్షణ క్షణం పెరిగే దురాశా కాలుష్యానికి
చిట్లిన సంబంధాల గాజుపెంకుల తాకిడికి
ద్వేషాన్ని పంచే దోమకాటుకి
ఈర్ష్యాసూయల ఈగల బెదదకి
బలై..... బెంబేలెత్తుతున్నాను నేడు!

నా దురవస్థపై దృష్టిపెట్టండి
నన్ను శీఘ్రమే స్వస్థపరచండి
నేనెవరో అనుకోకండీ
నేను మీ మనసుని సుమండీ!

–ధూపం అభిమన్యుడు, 96033 16211

# తెలుగు వెలుగు ఎందుకు మసకబారి పోతోంది???

తెలుగుభాష వైభవం మసకబారి పోతోందా..కారణాలేమిటి? మధ్యయుగాల నాటికే దేశ విదేశాలలో ప్రజల నాలుకలపై నర్తించిన భాష మన అమ్మనుడి. తెలుగు రాజభాషగా వుండడంతో ఇతర భాషా కవులు, కళాకారుల నుండి సామాన్యుల వరకు తెలుగును నేర్చుకున్నారు. తెలుగులోనే మాట్లాడారు. తెలుగులోనే వర్తక వ్యవహారాలు నడిపారు. యురోపియన్ వ్యాపారులు దేశంలోకి వచ్చిన తరువాత నాణాలపై వారి భాషతో పాటు తెలుగుకు సైతం ప్రాధాన్యత ఇచ్చారు. దక్షిణ భారతదేశంలో తెలుగు భాషకు ప్రాధాన్యత తీసుకు వచ్చిన ఘనత మాత్రం నాయక రాజులకే దక్కుతుంది. విజయనగర నాయక రాజులు తెలుగు కవులను పోషించి తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవ చేసినప్పటికీ తంజావూరు నాయకరాజుల సాహిత్య సేవ ముందు విజయనగర రాజులు చేసింది కాస్త తక్కువ అనే చెప్పుకోవాలి. భోగస్త్రీలు కూడా అద్భుతమైన సాహిత్యాన్ని పండించిన బంగారు కాలమది. విదేశీయులు కూడా ఇక్కడి ప్రజలతో వ్యాపారం చేయాలంటే తెలుగును నేర్చుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ఎందుకంటే తెలుగు ఇక్కడి ప్రజల భాష మాత్రమే కాదు రాజభాష కూడా కావడంతో తెలుగుకు ప్రాధాన్యత ఇవ్వక తప్పనిసరి పరిస్థితి ఏర్పడింది. భారతదేశం వివిధ భాషల సమాగమం అయినప్పటికీ యురోపి యన్లు ఇక్కడి భాషలను నేర్చుకున్నారు. ఇక్కడి సాంకేతిక నైపుణ్యాన్ని తమ భాషలో నిక్షిప్తం చేసుకున్నారు. యురోపియన్ల సాంకేతిక విప్లవానికి సాంకేతికత నందించిన కళాకారులు మన మదుపొల్లం (ఈ ఊరు ప్రకాశం జిల్లాలోని మోటుపల్లిగాని, మామిడిపాలెంగాని అయివుండ వచ్చునని అభిప్రాయం) కమ్మరులే అన్న విషయం ఈ నాటికీ మనకు తెలియని అరుదైన వాస్తవం. మన నౌకానిర్మాణ సాంకేతికతను నేర్చుకోవడానికి ఆంగ్లేయులు పోటీ పడ్డారని, అలా నేర్చుకున్న తరువాత ఆ కళాకారులను అంతమొందించారని యురోపియన్లే తమ పుస్తకాలలో రాసుకున్నారు. ఇలా ఎన్నో విషయాలు చరిత్ర కాలగర్భంలో మరుగున పడిపోయాయి.

మెకాలే అంటించిపోయిన విద్యావిధానం నయంకాని అంటు రోగంలా దేశమంతా వ్యాపించింది. నేడు తెలుగులో పిల్లలను చదివించాలంటే దినసరి కూలీ సైతం నామోషీగా భావిస్తున్న గడ్డుకాలం నడుస్తోంది. తెలుగుబడులు ఒక్కొక్కటిగా మూతబడుతున్నాయి. ఎందుకు అంటే అందరూ చెప్పే ఒకే ఒక కారణంపై చదువులు అన్నీ ఇంగ్లీషులోనే వున్నాయి. ఇప్పటి నుండి ఇంగ్లీషులో చదివిస్తే కానీ ఇంజినీరింగ్, మెడిసిన్ లలో సీటు సంపాదించలేరు- అన్నది ఇందులో వాస్తవం లేకపోలేదు.

భారతదేశపు ఇంజినీరింగ్ విద్యార్థి అంటే విదేశాలలో పెద్దగా విలువలేదు. గౌరవం లేదు. ఎందుకంటే ఇక్కడ చాలా ఇంజినీరింగ్ కళాశాలలు మామూలు వీధిబడులకంటే మెరుగ్గా ఏమీ వుండవు. కనీస సౌకర్యాలు కూడా వుండవు. ఈ కళాశాలలు నిరుద్యోగులను తయారు చేసే కార్ఖానాలుగా మిగులు తున్నాయే కానీ సాంకేతిక నిపుణులను తయారు చేయలేకపోతున్నాయన్నది జీర్ణించుకోలేని సత్యం.

ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలు ఆధునిక పోకడలతో యుద్ధ విమానాలను ఏడు దశాబ్దాల ముందే తయారు చేస్తే మన స్వంత యుద్ధవిమానం తయారు కావడానికి 2016 వరకు కాలం పట్టింది. వెనుకబడి వున్నాం- ఎంతకి! మన దగ్గర పనినేర్చుకున్న వారికంటే వంద సంవత్సరాలు వెనుకబాటా?

నేడు ప్రపంచంలో అగ్రస్థానం కొరకు పోటీ పడుతున్న చైనాకు ఒకనాడు స్ఫూర్తినిచ్చింది మనమే. ఈ రోజు చైనా యువత ఆ దేశానికి కాసుల పంటలు పండిస్తున్నారు. అదే స్థాయిలో మన దేశంలో కూడా యువకులు వున్నారు. ఉద్యోగాల వేటలో నిరంతరం బతుకు బండి లాగిస్తున్నారు. చదివే చదువుకు చేసే పనికి సంబంధం లేకుండా జీవిస్తున్నారు. దీనికి కారణాలు ఏమిటో మనం ఇప్పటికీ కనుక్కోలేక పోవడం శోచనీయం.

వలస పాలకులకు సేవ చేయడానికి అవసరమైన ఉద్యోగులను తయారు చేయడానికే మెకాలే ప్రస్తుత విద్యా వ్యవస్థను తయారు చేశాడు. ప్రపంచంలో అత్యంత లోపభూయిష్టమైన విద్యా విధానం ఏదైనా వుంది అంటే అది మన విద్యా విధానమే. దీనిని వదిలించుకుంటే కానీ మన విద్యార్థులలోని ప్రతిభ వికసించదు.

మన నుండి అన్నీ నేర్చుకున్న చైనా నేటికీ తనదైన విద్యావిధానాన్నే అమలు చేస్తోంది. అక్కడి విద్యార్థులు సాంకేతిక విద్యను సైతం తమ అమ్మనుడిలోనే నేర్చుకుంటారు. అక్కడి ప్రభుత్వం ప్రపంచ వ్యాప్తంగా జరిగే సాంకేతిక ఆవిష్కరణలను ఎప్పటికప్పుడు చైనా భాషలోకి అనువదిస్తుంది. కానీ మన దౌర్భాగ్యం ఏమిటంటే ఫ్రెంచిలో జరిగిన ఆవిష్కరణలను ఇంగ్లీషులోకి తర్జుమా చేసుకుని చదువుకుంటామే తప్ప తెలుగులోకి మాత్రం తరుమా చేసుకోము. వలస భాషపైన మమకారం అలాంటిది మరి. ఐటిఐ, పాలిటెక్నిక్ వంటి చదువులు సైతం ఆంగ్ల మాధ్యమంలో చదువుకోవాలే తప్ప తెలుగులో చదువుకోలేని దుస్థితి నేడు మనది. ఇలా వచ్చీరాని ఇంగ్లీషులో చదివి, సగం అర్థమయీ అర్థం కాక సర్టిఫికేటు తీసుకుని బయటబడితే చాలు ఏదో ఒక ఉద్యోగంలో చేరిపోవచ్చు. జీవితాంతం నిశ్చింతగా బతికిపోవచ్చు. ఇదీ నేటి యువతకు మనమిస్తున్న సందేశం. ఇలా చదివి బయటకు వచ్చిన సాంకేతిక నిపుణులకు అసలు నైపుణ్యమే లేకపోతే? వీరినుండి ఆవిష్కరణలను ఆశించడం ఎంతవరకు సాధ్యం.

చైనాలో గత 40 సంవత్సరాలలో కేవలం నాలుగు సెకెండ్లు మాత్రమే విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందట. మరి మనకో. ప్రతిరోజూ కనీసం ఒక్కసారన్నా కరెంటు పోకపోతే ఒట్టు. ఎందుకిలా? మన సాంకేతిక నిపుణులకు పరిపూర్ణమైన అవగాహన లేకపోవడమే కారణమని ఒప్పుకుని తీరాల్సిందే. అర్థమయ్యీ అర్థం కాని చదువులకు, సగం వచ్చీ పూర్తిగా రాని పనులకు మంగళం పాడాలంటే మన సాంకేతిక విద్యను పూర్తిగా మాతృభాషల్లోనే బోధించి తీరాల్సిందే, తప్పదు.

తెలంగాణా, రాయలసీమ ప్రాంతాలలో విద్యుత్ మోటార్ల వద్ద వందలాదిమంది రైతులు ప్రాణాలు కోల్పోయేవారు. అలాంటి వారి కొరకు ఆటోమేటిక్ స్టార్టర్‌ను తయారు చేసిన వాడు ఒక చిన్న మోటార్ మెకానిక్ అంటే మనం నమ్మగలమా? అవును, కేవలం పదవ తరగతి మాత్రమే చదుకుని ఐటిఐ కూడా చేయని ఒక సాధారణ మెకానిక్ దీన్ని తయారు చేశాడు. అతడు ఏ ఇంగ్లీషు ఇంజినీరింగూ చదవలేదు. అతడే సెల్ ఫోనుతో మోటర్‌ను ఆన్, ఆఫ్ చేసే పరికరాన్ని కూడా తయారు చేశాడు. ఇలాంటి ఎంతోమంది మేధావులు మరుగున పడిపోతున్నారు. ఉన్నతమైన సాంకేతిక పరిజ్ఞానం తెలుగులో వుంటే ఇలాంటి వారు అద్భుతాలనే సృష్టిస్తారనడంలో ఎలాంటి సందేహమూ లేదు.

మనవారు తయారు చేసే సరికొత్త పరికరాలకు మన తెలుగుపేర్లే పెడితే, సాంకేతిక ఆవిష్కరణలకు తెలుగు పదాలే వాడితే ఇంగ్లీషోడేంటి వాడబ్బ అయినా సరే తెలుగు నేర్చుకోవాల్సిందే. ఇప్పటికైనా సాంకేతిక విద్యను తెలుగులోకి తర్జుమా చేసే విధంగా ప్రభుత్వంపై వత్తిడి తీసుకు రావాలి. అప్పుడే అభివృద్ధి బాటపై పరుగులు పెడతాం. అమ్మనుడినీ కాపాడుకుంటాం.

❋



# దళిత చైతన్యస్ఫూర్తి నిజాయితీ గల రచయిత
# చిలుకూరి దేవపుత్ర

**కా**లానికి ఎదురు నిలిచి, సంస్కరణభావాలతో సమాజాన్ని విశ్లేషించి కథల్లో, నవలల్లో, వ్యాసాల్లో తాను చెప్పదలచినదంతా చెప్పిన నిశ్శబ్ద కర్తవ్య పరాయణుడు చిలుకూరి దేవపుత్ర. తెలుగులోనే మన భవిత ముడివేసుకుని ఉన్నదని నమ్మి నిత్యజీవితంలో ఆచరణలో పెట్టిన దేవపుత్ర తనకు కావలసిన వ్యక్తుల ఫోన్ నెంబర్లను కూడా తెలుగు అంకెల్లో వ్రాసిపెట్టుకున్న తెలుగువాడు.

తెలుగేమైపోతుందోనన్న నిరాశ తగదనీ, అందుకోసం నిరంతరం కృషి చేయాలనే దేవపుత్ర తెలుగుభాషోద్యమసమాఖ్య 2003 నవంబరులో అమరావతిలో జరిపిన 'మాండలికాలపై సదస్సు'లో పాల్గొన్నారు. తన అభిప్రాయాల్ని నడుస్తున్న చరిత్రలో వ్రాశారు. తెలుగువాణి తిరుచనాపల్లి (తమిళనాడు)లో పెద్దఎత్తున రెండు రోజులు నిర్వహించిన తెలుగు పల్లెకళల పండుగకు కుటుంబంతో సహా వచ్చిపాల్గొని ఎంతో సంతోషించారు. తన పిల్లలనిద్దరినీ తెలుగు మాధ్యమంలో చదివించి, ఉన్నత విద్యావంతుల్ని చేశారు. భార్య శ్రీమతి లక్ష్మి, కుమార్తె దీవెన తెలుగులో కథారచయితలు. కొడుకు అన్వేష్ కూడా సాహిత్యప్రియుడు. దళితుల అభివృద్ధికి తెలుగు వ్యతిరేకం అనీ, ఇంగ్లీషులోనే దళితుల అభివృద్ధి అనీ వాదించే అశాస్త్రీయ ధోరణుల్ని ఎండగడ్తూ, తెలుగులోనే తెలివి అనీ, దళితులతో సహా ఎవరికైనా తెలుగులోనే ప్రగతి అని చాటిచెప్పేవాడు. ఆయన వ్రాసిన నవలలు నాలుగు. అద్దంలో చందమామ, పంచమం, కక్షశిల, చీకటిపూలు. కథాసంపుటాలు అయిదు. అవి : ఆరుగ్లాసులు, ఏకాకి నౌక చప్పుడు, బందీ, వంకర టింకర 'ఓ', చివరిమనుషులు. మొత్తం 100 కుపైగానే కథలు వ్రాశారు.

వీటిలో కొన్ని ఆంగ్లం, హిందీ, మరాఠీ, గుజరాతీ, ఒరియా, కన్నడ భాషలలోకి అనువాదమయ్యాయి. కొన్ని ప్రసిద్ధ సంకలనాల్లో చోటుచేసుకున్నాయి. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ వారు ఆంగ్లంలో ప్రచురిస్తున్న దళిత సకలనంలో 'గురుదక్షిణ' అన్న కథను తీసుకున్నారు. 'పెంగ్విన్' ప్రచురణ సంస్థవారు ప్రచురించనున్న ఆంగ్ల దళిత సంకలనంలో 'పంచమం' నవలను పరిచయం చేశారు. కేంద్ర సాహిత్య అకాడమీ వారి 'ఒక తరం తెలుగు కథ' కథల సంపుటిలో 'మన్నుతిన్న మనిషి' కథ చోటుచేసుకున్నది.

'బందీ', 'గురుదక్షిణ' కథలనూ, 'పంచమం' నవలనూ శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వారూ, 'అద్దంలో చందమామ', 'పంచమం' నవలలను యోగి వేమన విశ్వవిద్యాలయం వారూ, 'పంచమం' నవలను హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీ వారూ, ఆంధ్రవిశ్వకళాపరిషత్తు వారూ, 'మన్నుతిన్న మనిషి' కథను శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంవారు ఎం.ఏ.(తెలుగు) పాఠ్యాంశాలలో, కర్నాటక రాష్ట్రం, గుల్బర్గా విశ్వవిద్యాలయం వారు బి.ఏ.(తెలుగు) పాఠ్యాంశాలలో ఉంచారు.

ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘంలో కార్యవర్గ సభ్యుడు. అయినా తొలినుంచీ అభ్యుదయభావాలతో సాగిన దేవపుత్ర జీవితం ఏ సిద్ధాంతం వైపుకూ మళ్ళిపోకుండా తనదైన సంయమనంతో, నిజాన్ని అన్వేషించే నిరంతర తపనతోనే గడిచింది. ఎవరితోనూ ఘర్షణపడని, సాత్విక సంపన్నుడు. ఆదర్శంగా బ్రతికినవాడు.

ప్రభుత్వ రెవెన్యూశాఖలో పనిచేస్తూ డిప్యూటీ తహసీల్దారు స్థాయికి ఎదిగినా, ఏ దశలోనూ అవినీతికి లోబడలేదు. స్వంత ఇల్లు కూడా కట్టుకోలేకపోయిన చిలుకూరి దేవపుత్ర తన కుటుంబంలోనేగాక, మిత్రులలోనేగాక, నిజాయితీపరుడుగా, గొప్ప కథా రచయితగా పేరు తెచ్చుకొన్నాడు. తన కలంతో సమాజాన్ని విశ్లేషించాడు, సంస్కారాల్ని నేర్పాడు. ఒక మనిషిగా ఎలా బ్రతకాలో తను ఆచరణలో చూపాడు. ఇంతటి గొప్పవ్యక్తి తెలుగుభాషోద్యమానికీ, నడుస్తున్న చరిత్ర/అమ్మనుడి పత్రికకూ నిరంతర అభిమాని. 24-4-1952న అనంతపురం జిల్లా కాలువపల్లిలో పుట్టిన వీరు ఈ అక్టోబర్ 18న గుండెనొప్పితో హఠాత్తుగా చనిపోయారు- 65 ఏళ్ళ వయస్సులో. ఈ మహావ్యక్తికి మా శ్రద్ధాంజలి.

-సంపాదకుడు

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136)
RNI-APTEL/2015/62362



## అక్టోబరు 15,16 తేదీలలో తిరుపతిలోని రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠంలో జరిగిన
# భారతీయ భాషా సమ్మేళనం

పాల్గొన్న ప్రముఖులు












రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం కులపతి ఆచార్య ఎం.ఎల్.ఎన్.మూర్తి, శిక్షా సంస్కృతి న్యాస్ జాతీయ ప్రధాన కార్యదర్శి అతుల్ కొఠారి, భారతీయ భాషామంచ్ జాతీయ సమన్వయకర్త వృషభ్ ప్రసాద్ జైన్
కార్యక్రమ స్థానిక సంయోజకుడు రాణీ సదాశివమూర్తి, మనోవిజ్ఞాన శిక్షకురాలు పోతుకూచి పద్మ.







అతిథులుగా పాల్గొన్న తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షుడు డా॥సామల రమేష్‌బాబు, తితిదే ప్రత్యేకాధికారి డా॥ఎన్. ముక్తేశ్వరరావు ఐఎఎస్., ముగింపు సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉపసభాపతి గౌ॥మండలి బుద్ధప్రసాద్

## బొర్రా గోవర్ధన్ రచన 'తెలుగమ్మ ఒడిలో బౌద్ధం'




'అమ్మనుడి'లో మార్చి 2015 నుండి వరుసగా 13 నెలలపాటు ప్రచురించిన ధారావాహిక. తెలుగు నేలను బౌద్ధం ఎంతగా తట్టిలేపిందో; మన సంస్కృతీ నాగరికతల నిర్మాణంలో బౌద్ధం పాత్ర ఎంతో; మన వ్యవసాయ ప్రగతికీ, పారిశ్రామిక పురోగతికీ, విద్యా వైజ్ఞానిక ఉన్నతికీ, వ్యాపారాభివృద్ధికీ బౌద్ధం ఏం చేసిందో; తెలుగు వారి శిల్పకళ, చిత్రలేఖనాలను బౌద్ధం మలచిన తీరు ఏమిటో తెలిపే రచన ఇది. తెలుగు వారి భావధారలో, జీవధారలో ప్రవహించే బౌద్ధ ధమ్మాన్ని గురించి విశ్లేషణాత్మకంగా తెలుగులో మలచిన తొలి గ్రంథం ఇది. తెలుగు వారంతా చదివి, వారి నేస్తాలచేత చదివించవలసిన పుస్తకం ఇది. వెల రు.80.లు, లతా రాజా ఫౌండేషన్, హైదరాబాదు వారు ప్రచురించారు. ప్రతులకు: లతారాజా ఫౌండేషన్ (98852 81545), బొర్రా గోవర్ధన్, నగరం–522 268 (93906 00157), ఆర్ట్స్ అండ్ లెటర్స్, హైదరాబాదు–29(040–27635654)

AMMANUDI (Telugu Monthly)
November 2016, Vol.2, Issue 9

RNI-APTEL/2015/62362
Postal Reg. No.TEN/12/2015-17

ఆయుర్వేదాన్ని నమ్మండి.. ఆరోగ్యాన్ని పొందండి...

మధురిక్త

షుగర్ వ్యాధి నియంత్రణకు సమాధానం




- అతిచిన్న డోసు (రోజుకి 2-4 గ్రా.) మధురిక్త బ్లడ్ షుగర్ మరియు యూరిన్ షుగర్‌ని 20-30 రోజులలో తగ్గించును.
- షుగర్‌తోపాటు వచ్చే రుగ్మతలకు చాలా ఉపయుక్తమైనది.
- మధురిక్త పొడి (పౌడర్) మరియు క్యాప్సూల్స్ లభించును.




సమర్థో ఆయిల్

- కీళ్ళు, కండరాల నొప్పులకు సమర్థవంతమైన ఔషధం.
- ఆర్థరైటిస్, రుమటాయిడ్ ఆర్థరైటిస్‌లలో అమోఘంగా పనిచేయును
- ఎముకలు, కండరాలకు బలం చేకూర్చును, కీళ్ళ అరుగుదలను తగ్గించును

గమనిక :
ఆర్థరైటిస్, రుమటాయిడ్ ఆర్థరైటిస్‌లలో సమర్థ ఆయిల్‌తో పాటు రుజ సంరక్ష మరియు సమర్థో ఫోర్ట్ క్యాప్సూల్స్ సత్వర ఫలితమును ఇచ్చును

మందులు ANL / కొరియర్ ద్వారా పంపబడును.
రూ. 1000/-లు ఆపై ఆర్డర్లకు ఉచిత డెలివరీ

కావలెను : డీలర్లు, ఫ్రాంచైజీలు
( నెట్వర్క్ మార్కెటింగ్ చేయువారికి అవకాశం )

సంప్రదించండి : సంరక్ష ఆయుర్వేదిక్ ఫార్మసి Cell : 78426 24991
e-mail : samraksha.ayurveda@gmail.com visit : www.samraksha.in